సాహితీ
గత వారం రోజుల పై వివిధ్యాన్ని
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ fb.com/vaartha

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-2-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 27 పేజీలు: 10+4 వెల: 6.50

హైదరాబాద్‌లో నిమ్స్ వైద్యుడి ఆత్మహత్య 2

ఆప్ ఎమ్మెల్యేలను అడ్డుకొన్న పోలీసులు 5

# తెలంగాణను ఆపలేరు..

## ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ ముందుకు

### ఒక్క యేడాదిలో అత్యధిక పెట్టుబడులు రాక

### ఉద్యోగ కల్పనలో నం.1గా నిలిచాం

### హెచ్‌సిఎల్ టెక్ కొత్త క్యాంపస్ ప్రారంభించిన సిఎం రేవంత్



హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి27:** ప్రపంచ దేశాలతోనే పోటీపడుతున్న తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ అడ్డుకోలేరని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలోనే తెలంగాణరాష్ట్రం, హైదరాబాద్ నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. కేవలం ఏడాది కాలంలోనే తెలంగాణకు దేశవిదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. ఉద్యోగకల్పనలో నెంబర్‌వన్‌గా నిలిచామని తెలిపారు. మాదాపూర్‌లో ఏర్పాటు చేసిన హెచ్‌సీఎల్ (టెక్) కేఆర్ సీ క్యాంపస్‌ను గురువారం లాంచనంగా ప్రారంభించారు. ముఖ్య అతిధిగా మంత్రి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్ కేఆర్‌సీ క్యాంపస్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రతిరోజూ తాము బహుళజాతి సంస్థలతో కొత్త అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడమో.. పెద్ద సంస్థలు తెలంగాణకు రావడమో.. గత సంవత్సరం సంతకం చేసిన ఎంఓయూల కొత్త సౌకర్యాలను ప్రారంభించడమో జరుగుతోందని తెలిపారు. మన దగ్గర అత్యధిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అత్యల్ప ద్రవ్యోల్బణం ఉన్నాయని సీఎం వెల్లడించారు. తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల జీడీపీ రాష్ట్రంగా మారుస్తానని, తాను ముందు చెప్పినప్పుడు అది సాధ్యం కాదని కొందరు అన్నారన్నారు. రెండుసార్లు దావోస్ పర్యటనల్లో రూ. 41,000 కోట్లు, రూ.1.78 లక్షల కోట్ల ఎంవోయూలపై సంతకాలు చేసుకున్న తరువాత ఇప్పుడు అది సాధ్యమని నమ్ముతున్నారని తెలిపారు. తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరని సీఎం స్పష్టం చేశారు. 'మా పోటీ ముంబై, ఢిల్లీ, బెంగళూరు లేదా చెన్నైతో కాదని నేను చెప్పినప్పుడు.. కొంతమంది అది పెద్దకలనే అవతుందన్నారు. మనం ఈవీ అడాప్షన్‌లో హైదరాబాద్‌ను నంబర్ వన్‌గా చేశాక.. రాష్ట్రాన్ని డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, స్కిల్స్, మ్యానుఫ్యాక్చరింగ్, అగ్రి ప్రాసెసింగ్‌కు హబ్‌గా మారుస్తున్నాం అని చెప్పారు. ఇప్పుడు హైదరాబాద్ రైజింగ్ ఆగదు అని ప్రజలు అంటున్నారు. నేను మొదట హైదరాబాద్ రైజింగ్ అని చెప్పినప్పుడు కొందరికి అనుమానం వచ్చింది. ఇప్పుడు ప్రపంచం మొత్తం అంగీకరిస్తోందని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద లైఫ్ సైన్సెస్ కంపెనీల్లో ఒకటైన ఆమ్జెన్ ను కొద్దిరోజుల క్రితం ప్రారంభించుకున్నాం. మేం ప్రపంచంలోని అత్యుత్తమ సమావేశాలలో ఒకటైన బయో

>>2




# 'మహా కుంభ్'తో భారత్‌కు కొత్తశక్తి

## ప్రజల ఐక్యతకు అది నిదర్శనం

### మేళాలో లోపాలు జరిగితే ప్రజలు క్షమించాలి: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుకగా జరిగిన ప్రయాగరాజ్ మహా కుంభ్‌మేళాతో దేశ విదేశాల్లోని హిందువులందరినీ ఒకేవేదికపైకి తెచ్చిందని ప్రధానిమోడీ అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఇంతటి భారీ ఎత్తున మహాకుంభమేళా నిర్వహించడం అంత సులువుకాదని ఏర్పాట్లపరంగా భక్తులెవరైనా అసౌకర్యానికి గురైతే కనుక అందుకు క్షమించాలనికోరారు. ఐక్యత కోసం జరిగిన మహాజ్ఞం దిగ్విజయంగా ముగిసింది. భారతీయ ఐక్యతకు కుంభమేళా నిదర్శనంగా నిలిచిందని తనబ్లాగ్‌లో రాసారు. అంచనాలకు మించి వివిధ ప్రాంతాలనుంచి కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారని భారత్ కొత్తశక్తితో ముందుకు

>>2



గురువారం టన్నెల్‌లో బురదను తొలగిస్తున్న రెస్క్యూ టీం

# ఆశలు ఆవిరి!

### టన్నెల్‌లో 8 మీటర్ల మేర బురద

### ఊడిపడుతున్న మట్టిపెళ్లలు

### వేగంగా టిబిఎం కటింగ్, శకలాల తొలగింపు పనులు

### మరో రెండు, మూడు రోజులు సహాయక చర్యలు: మంత్రి ఉత్తమ్ కుమార్

**మహబూబ్‌నగర్ బ్యూరో, నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్‌లో చిక్కుకున్న 8మంది కాపాడేందుకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నది. 10 మీటర్ల టన్నెల్‌లో 8మీటర్ల బురద చేరుకోవడంతో సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడుతుంది. టన్నెల్ మొత్తం మట్టి బురదతో నిండిపోయిందని తీసే కొద్దీ మట్టి పెచ్చులు ఊడిపడుతుండడంతో ఏం చేయలేని పరిస్థితి నెలకొన్నదని నిపుణులు చెబుతున్నారు. కార్మికులపై అధికారులు ఆశలు వదులుకున్నట్లు తెలుస్తోంది. గురువారం నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ మల్లురవి,మాజీ రాజ్యసభ సభ్యులు వీహెచ్ స్థానిక ఎమ్మెల్యే సహాయక చర్యలను పర్యవేక్షించారు. టన్నెల్ లో ఉన్న నీటిని భారీ పంపులతో బయటికి పంపడం, బురదను తీసివేసి అనంతరం టీబిఎం ముందుభాగం చేరుకోనున్నట్లు తెలుస్తున్నది. టీబిఎం చివరి భాగాలను గ్యాస్ కట్టర్లు, ప్లాస్మా కట్టర్లతో తొలగించనున్నారు. రెండు మూడు రోజుల్లో రెస్క్యూ ఆపరేషన్ పూర్తి చేయనున్నట్లు, తిరిగి సొరంగ పనులు రెండు మూడు నెలల్లో ప్రారంభించనున్నట్లు మంత్రి వివరించారు. ఆర్మీ ,నేవీ,ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ ఎఫ్,బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్, ర్యాట్ హోల్ మైనర్స్, దక్షిణ మధ్య రైల్వే ప్లాస్మా కట్టర్స్, రాబిన్సన్ మైనింగ్ ప్రతినిధులు, మెగా, నవయుగ, ఇలా11 కంపెనీల బృందాలు నిరంతరం సమన్వయంతో సహాయక చర్యలు చేపడుతున్నాయి. టీబిఎం మిషన్, శిథిలాలను, బురదను సొరంగంలో ప్రమాద స్థలం నుంచి బయటికి తీసుకొస్తున్నారు. సహాయక చర్యలకు ఆటంకంగా మారిన బురద నీటిని తొలగించే ప్రక్రియను మరింత స్పీడ్ పెంచారు. దేశంలోని మైనింగ్ ప్రమాదాలలో నిష్ణాతులైన వారి సేవలను వినియోగించుకుంటూ, వారి సలహాలు సూచనలు తీసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నారు. ఈ సహాయక చర్యల్లో దేశంలోని మైనింగ్ రెస్క్యూ సిబ్బంది, ఇండియా బోర్డర్స్ ఆర్గనైజేషన్ సేవలను

>>2



# అది టూరిస్ట్ ప్లేసా?

### మంత్రులు విమానాల్లో వచ్చిపోవడమేనా?

### -హరీష్ నిశిత విమర్శ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగి ఆరు రోజులవుతున్నా ప్రభుత్వానికి పట్టింపులేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. గురువారం మధ్యాహ్నం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద

>>2

# బ్యాలట్ బాక్స్‌ల్లో భవితవ్యం

## మార్చి 3న ఎమ్మెల్సీ ఫలితాలు

### 15 జిల్లాల్లో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

### అత్యధికంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ శాతం నమోదు



కరీంనగర్ జిల్లాలో గురువారం ఓటు వేసేందుకు క్యూలో ఓటర్లు

**కరీంనగర్ బ్యూరో, ప్రభాతవార్త:** కరీంనగర్,నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.గురువారం ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 56 మంది, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 15 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. మొత్తంగా 15 జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటర్లు మూడు లక్షల 55 వేల 159 మంది ఉండగా టీచర్స్ ఓటర్లు 27 వేల 88 మంది ఉన్నారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు అధికారులు చేశారు.కంట్రోల్ రూమ్ నుండి నిరంతర పర్యవేక్షణ చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో 15 జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్స్‌లు ఎన్నికల అధికారులు తరలించారు. 15 జిల్లాలలో కలిపి 499 గ్రాడ్యుయేట్ పోలింగ్ స్టేషన్లు, 274 టీచర్స్ పోలింగ్ స్టేషన్లో ఉన్నాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి,కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వివరించారు. 93 కామన్ పోలింగ్ స్టేషన్లు (గ్రాడ్యుయేట్స్, టీచర్స్) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తంగా అన్ని జిల్లాల్లో 773 పోలింగ్ స్టేషన్లో ఎన్నికలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ మార్చి 3వ తేదీన నిర్వహించనున్నారు.అందుకోసం అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంలకు తరలించి గట్టి బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. 15 జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా ఉదయం 11గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగింది.. మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టభద్రుల,ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నమోదైన పోలింగ్ శాతం వివరాలు ఇలా ఉన్నాయి.. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో పట్టభద్రులఎమ్మెల్సీ స్థానానికి 20.32శాతం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కి 45.11 శాతం, మంచిర్యాల 21.06,49.52, అదిలాబాద్ 23.02,43.25, నిర్మల్ 21.54,35.91, నిజామాబాద్ 21.54,42.12, కామారెడ్డి 27.44,38.39, జగిత్యాల 24.24,39.12, పెద్దపల్లి 20.10,47.25,కరీంనగర్ 18.88, 34.98, రాజన్న సిరిసిల్ల 17.17,40.53,

>>2

# హరీష్‌వన్నీ అసత్యాలే..

### జగన్‌తో కుమ్మక్కై తెలంగాణకు అన్యాయం: మంత్రి ఉత్తమ్

7

## ఇంజినీరింగ్, వృత్తి విద్యలో

# సీట్లన్నీ స్థానికులకే

### ఎపికి నాన్‌లోకల్ గుర్తింపు

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఇకపై జరిగే ఇంజనీరింగ్ ఇతర వృత్తి విద్య కోర్సుల్లో ప్రవేశాలన్నీ తెలంగాణ స్థానికులకే కేటాయించనున్నారు. నేరుగా 85 శాతం సీట్లను తెలంగాణ వారికి కేటాయిస్తూ.. మరో 15 శాతం అన్‌రిజర్వుడ్ సీట్లుగా గుర్తించినప్పటికీ వాటిని కూడా తెలంగాణ వారికే కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి జీవోనంబర్ 15ను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా గురువారం జారీ చేశారు. 2014 ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో నిర్దేశించిన విధంగా 10 సంవత్సరాల కాలానికి తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలమధ్య ఉమ్మడి ప్రవేశాలు ఈ విద్యా సంవత్సరం ముగిసినందున ప్రభుత్వం కొత్త నిబంధనలతో ఉత్తర్వులను జారీ చేసింది. ఇప్పటివరకు రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థలలో 85 శాతం సీట్లు ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంతం (తెలంగాణ) స్థానికులకు రిజర్వ్ చేయబడ్డాయి.. మిగిలినవి అంటే 15శాతం అందరికీ అందుబాటులో ఉన్నాయి, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ నుండి విద్యార్థులు 15శాతం కోటాలో సీటు కోసం పోటీ పడటానికి వీలు కల్పిస్తుంది. 2025-26 విద్యా సంవత్సరం నుండి ఇంజనీరింగ్ సహావివిధవృత్తివిద్య ప్రవేశాల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు కోటా లేకుండా ఉత్తర్వులో సవరణలు చేశారు. ఉన్నత విద్యలోని మెజారిటీ సీట్లను తెలంగాణ స్థానికులకు మాత్రమే రిజర్వ్ చేస్తూ

>>2

# ఏమీ గుర్తులేదు.. మెమొరీ లాస్

### జస్టిస్ పిసి ఘోష్ విచారణలో రిటైర్డ్ ఇఎన్సీ మురళీధర్

2



గురువారం హైదరాబాద్‌లో సిఎంతో భేటీ అయిన ఇమ్మార్ ప్రతినిధులు

## 'ఇమ్మార్' పరిష్కారానికి


# న్యాయ నిపుణుల కమిటీ

### సిఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబుతో ఇమ్మార్ ప్రతినిధుల భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి27:** వివిధ కేసులతో పెండింగ్ లో ఉన్న తమ ప్రాజెక్టుల వివాదాలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మార్ ప్రాపర్టీస్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మార్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎమ్మార్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ అలబ్బర్, భారత్ లో యూఏఈ మాజీ రాయబారి డాక్టర్ అహ్మద్ అల్ బన్నా, ఎమ్మార్ గ్రూప్ సీఈవో అమిత్ జైన్, ఆ కంపెనీ ఇంటర్నేషనల్ అఫైర్స్ హెడ్ ముస్తఫా అక్రమ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి ఈ సమావేశంలో పాల్గొన్నారు. 2001లో ఉమ్మడి రాష్ట్రంలో దుబాయ్‌కి చెందిన ఎమ్మార్ ప్రాపర్టీస్ హైదరాబాద్లో కన్వెన్షన్ సెంటర్, హోటల్, గోల్ఫ్ కోర్సు, విల్లాలు తదితర ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు అప్పటి ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది. ఏపీఐఐసీతో ఆ సంస్థ చేసుకున్న ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని అప్పట్లో సీబీఐ,ఈడీ కేసులు నమోదయ్యాయి. ఏజెన్సీల దర్యాప్తులు, కోర్టుల్లో విచారణలు కొనసాగుతున్నాయి.తెలంగాణ

>>2

# కష్టాల్లో ఖజానా!



### ఆదాయ, వ్యయం మధ్య భారీ అంతరం

### నెలకు రూ.18,500 కోట్ల రాబడి

### 10 నెలల్లో వచ్చింది రూ.1,82,437 కోట్లు

### అప్పుల వడ్డీలు, వేతనాలకే రూ.13 వేల కోట్లు ఖర్చు

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** తెలంగాణ ఖజానా లోటుతో కష్టాల్లో కొట్టుమిట్టాడుతోంది. ఆదాయ, వ్యయాలు మధ్య వ్యత్యాసం భారీగా ఉండటంతో అభివృద్ధి, సంక్షేమానికి నిధుల కొరత ఏర్పడింది. నెలవారీ ఆదాయం మరో రూ.4వేల కోట్లు పెరిగితే తప్ప ఆర్థిక పరిస్థితి మెరుగు పడేలా కనిపించడం లేదని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించడం విశేషం. ఆర్థిక శాఖ లెక్కల ప్రకారం తెలంగాణలో ప్రస్తుతం నెలకు రూ.18వేల 500కోట్ల ఆదాయం వస్తోంది. అయితే. తెచ్చిన అప్పుల కిస్తీలు, వడ్డీలు, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకే ప్రతి నెలా రూ.13వేల కోట్లు ఖర్చవుతోంది. మిగిలిన రూ.5 వేల కోట్లతోనే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి తప్పడం లేదు. ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి 10 నెలల్లో వచ్చిన ఆదాయం ఇప్పటికే నిరాశపరిచింది. పన్నులు, కేంద్ర గ్రాంట్లు, కొత్తగా సేకరించిన రుణాలు కలిపి మొత్తం ఆదాయం రూ.2,90,44 కోట్లు ఉంటుందని బడ్జెట్‌లో అంచనా వేయగా, ఏప్రిల్ నుండి జనవరి వరకు రూ.1,82,437 కోట్లు మాత్రమే వసూలు అయ్యాయి. మిగిలిన ఫిబ్రవరి, మార్చి నెలల్లో రూ.1.08 లక్షల కోట్లు వస్తేనే బడ్జెట్ అంచనాలు నెరవేరుతాయి. కానీ తాజా ఆర్థిక పరిస్థితులు ఈ మొత్తాన్ని చేరుకోకపోవచ్చునని చూపిస్తున్నాయి. అలాగే గత 10 నెలల్లో రుణాలు కలిపి నెలకు సగటున రూ.18 వేల కోట్లు వచ్చాయి. మిగిలిన రెండు నెలల్లో నెలకు రూ.20 వేల కోట్లు రావాల్సి ఉందని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. బడ్జెట్ ఆదాయ అంచనాలతో పోలిస్తే 68 వేల కోట్లు. కొన్ని రంగాలలో ఖర్చులో కోత పడే సూచనలు కూడా ఉన్నాయి. పన్నుల నుండి వచ్చే ఆదాయం రూ. 1,64,397 కోట్లు ఉంటుందని బడ్జెట్

>>2



గురువారం టన్నెల్ వద్ద మీడియాతో మంత్రి ఉత్తమ్. చిత్రంలో విహెచ్ తదితరులు

# ఆశలు ఆవిరి!

>> వినియోగించుకుంటున్నట్లు, తెలిపారు. ఇదిలా ఉండగా ప్రమాదం జరిగి ఆరు రోజులు కావడంతో వారు బ్రతికే ఉంటారా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సొరంగంలో భారీ ఎత్తున మట్టి కూలడం, నీరు, బురద చేరడంతో ప్రాణాలతో ఉండే అవకాశం తక్కువని భావిస్తున్నారు. వారంతా బురదలోనే టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) చుట్టూ కూరుకుపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఒకవేళ ప్రమాదంలో గాయపడినా నీళ్లు, ఆహారం లేకుండా జీవించడం కష్టమని చర్చించుకుంటున్నారు. కాగా, ఈనెల 22న ఉదయం 8:30 గంటలకు జరిగిన ఈ ప్రమాదం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఆరా తీస్తున్నారు. మూడ్రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకోగా.. బుధవారం రేవంత్ రెడ్డితో సమావేశంలోనూ ప్రధాని మోదీ టన్నెల్ ప్రమాదంపై ఆరా తీశారు. కార్మికులను కాపాడేందుకు టన్నెల్ బోరింగ్ మిషన్ అడ్డంకిగా మారడంతో దాన్ని కట్ చేయాలని అధికారులు నిర్ణయించారు. కటింగ్ పనులు ప్రారంభం కానున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు మిషన్ భారీగా దెబ్బతింది. ఆ తర్వాత ఒత్తిడితో దాని వ్యర్థాలు ముందుకు తోసుకువచ్చాయి. దాన్ని దాటి వెళ్తే గాని కార్మికులను కాపాడే ప్రయత్నాలు ఫలించవు. అయితే ప్రమాదం జరిగిన మూడో రోజునే వాటిని తొలగించేందుకు కట్టర్లు, జనరేటర్లు తీసుకెళ్లారు. అయితే కట్ చేసేందుకు జయప్రకాశ్ అసోసియేట్స్ యాజమాన్యం ఒప్పుకోలేదు. భారీ ఖర్చుతో కూడుకోవడం, టీబీఎంను కట్ చేస్తే తిరిగి పనులు ప్రారంభించడం కష్టమవుతుందని భావించారు. కానీ, ఆ సంస్థ ఛైర్మన్ జయప్రకాశ్ గౌర్ ఢిల్లీ నుంచి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంత్రులు, అధికారులు, కంపెనీ ప్రతినిధులు, సహాయ బృందాలతో చర్చల అనంతరం టీబీఎంను కట్ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు పనులు ప్రారంభం కానున్నాయి..

**మరో రెండు రోజుల్లో ఆపరేషన్ పూర్తి చేస్తాం: మంత్రి ఉత్తమ్**

దేశంలోనీ నిష్ణాతులతో రెండు మూడు రోజుల్లో సహాయక చర్యలు పూర్తి చేపట్టనున్నట్లు, మూడు నెలల్లో తిరిగి సొరంగ పనులు ప్రారంభించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎస్ఎల్‌బిసి క్యాంప్ కార్యాలయం వద్ద మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, అచ్చంపేట శాసనసభ్యులు చిక్కుడు వంశీకృష్ణ, మాజీ రాజ్యసభ సభ్యుడు వీహెచ్ హనుమంతరావుతోకలిసి, మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ గురువారం ఉదయం దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ప్లాస్మా కటింగ్ నిష్ణాతుల బృందాన్ని చర్యల్లో భాగం చేసినట్లు సహాయక చర్యలు వేగవంతం అయ్యాయని వివరించారు. రెండు మూడు నెలల్లో ఎస్ఎల్బీసీ సొరంగ పనులను ప్రారంభించడం తన యొక్క దృఢ సంకల్పం అని వివరించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఎస్.ఎల్.బి.సి టన్నెల్ ప్రమాద ఘటనలో టన్నెల్ లో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్గాన్వేషణను ముమ్మరం చేసినట్లు వెల్లడించారు.

# తెలంగాణను ఆపలేరు..

>> ఏషియాను నిర్వహించామని చెప్పారు. ఇప్పుడు హెచ్‌సీఎల్‌లో ఉన్నాం. గ్లోబల్ కంపెనీగా హెచ్‌సీఎల్ టెక్ భారతదేశానికి గర్వకారణంగా నిలిచిందని, ఇది 60 దేశాలలో ఆపరేట్ చేస్తోందని, 2.2 లక్షల మందికి పైగా ఉద్యోగులను కలిగి ఉందన్నారు. డిజిటల్, ఇంజినీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో వరల్డ్ క్లాస్ ఆఫరింగ్స్ క్రియేట్ చేస్తున్నాని చెప్పారు. 2007లో హైదరాబాద్ వచ్చినప్పటి నుంచి అంచెలంచెలుగా హెసిఎల్ పెద్ద స్థాయికి ఎదిగింది. ఇవాళ 3.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దాదాపు 5వేల మందితో కేఆర్‌సీలో ప్రపంచస్థాయి సదుపాయంతో హెచ్ సీఎల్ టెక్ హైదరాబాద్‌లో గొప్ప పనులు చేస్తుందని సీఎం వ్యాఖ్యానించారు.

# భారత్‌కు కొత్తశక్తి

>> సాగుతోందని నవభార్‌తను నిర్మించే కొత్తశకం వచ్చిందని చెప్పేందుకు ఇదే నిదర్శనమనిమోడీ అన్నారు. ఇంతటి భారీ వేడుకను మరిదేనితోనూ పోల్చలేమని, త్రివేణి సంగమం నదీతీరానికి అన్నికోట్లమంది ఎలా వచ్చారన్నది ప్రపంచమే ఆశ్చర్యపోతున్నదని మోడీ అన్నారు. ఈభక్తులెవరికీ అధికారిక ఆహ్వానాలు పంపలేదు. అయినా పవిత్ర సంగమంలో పుణ్యస్నానాలకోసం వారంతా తరలివచ్చారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కనిపించిన సంతోషం సంతృప్తి తానెప్పటికీ మరిచిపోలేనని చిన్నపిల్లలనుంచి వృద్ధులవరకూ చాలామంది వ్యయప్రయాసలకోర్చి కుంభమేళాకు రావడం ఆనందంగా ఉందని మోడీ అన్నారు. మహాకుంభమేళాను విజయవంతంచేసిన యుపి ప్రభుత్వం సహకరించిన ప్రయాగరాజ్ ప్రజలు, భక్తులకు మోడీ ధన్యవాదాలు తెలిపారు. భారీ స్థాయి వేడుకను నిర్విఘ్నంగా కొనసాగించడం అనేది అంత సులువు కాదని తెలుసు. మా పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని ఆగంగా యమునా సరస్వతి మాతలను ప్రార్థిస్తున్నాని మోడీ తన బ్లాగ్‌లో రాసుకొచ్చారు. భగవంతుని స్వరూపాలుగా భావించేభక్తులకు సేవలు చేయడంలో ఏదైనా లోపం ఉంటే అందుకు ప్రజలు కూడా క్షమించాలని ప్రార్థిస్తున్నట్లు మోడీ తన బ్లాగ్‌లో ప్రత్యేకించిమహాకుంభ్‌మేళాను ప్రస్తావించారు. ఇదిలా ఉంటే ఉత్తరప్రదేశ్‌ప్రభుత్వం అధికారిక గణాంకాలను విడుదలచేసింది. మొత్తం మహాకుంభ్‌మేళా 45రోజుల్లోను దేశవిదేశాలనుంచి యాత్రీకులు భక్తులు వచ్చారని 66 కోట్లమంది త్రివేణిసంగమంలో పవిత్రస్నానం ఆచరించారని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సర్కారు ప్రకటించింది. మహాశివరాత్రి చివరిరోజు ఒక్కరోజే 2 కోట్లమందికిపైగా త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలుచేసినట్లు తెలిపారు.

# నిమ్స్ వైద్యుడి ఆత్మహత్య

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** మిస్సింగ్ కేసు కాస్తా ఆత్మహత్య కేసుగా మారిన సంఘటన సూరారం పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఆర్థిక సమస్యలతో ఓ వైద్యుడు ఆత్మహత్య చేసుకుని మరణించిన సంఘటన వెలుగుచూసింది. ఈ నెల 25న నిమ్స్‌లో వైద్యవృత్తి చేస్తున్న డాక్టర్ ఎ.విజయభాస్కర్(62) ఇంట్లో నుంచి వెళ్లిన తర్వాత తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా గురువారం లభించిన మృతదేహం ఆధారాలను స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చివరకు డాక్టర్ విజయభాస్కర్‌గా తేలింది. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.ఈ విధంగా ఉన్నాయి. గురువారం ఉదయం స్థానిక కట్టమైసమ్మ చెరువు వద్ద గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా మృతదేహం కుళ్లినస్థితిలో ఉంది. అనంతరం పరిశీలించి అతడి పేరు డాక్టర్ ఎం.విజయభాస్కర్(62)గా గుర్తించిట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అనంతరం కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు. డాక్టర్ విజయభాస్కర్ మృతి సంఘటన పోలీసులకు అనుమానం రావడంతో విచారించిన పోలీసులు ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# అది టూరిస్ట్ ప్లేసా?

>> ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద ప్రమాద ఘటనకు చేరుకోవడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అక్కడే హరీశ్‌రావుతో సహా మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు తదితరులతో నిరసనకు దిగారు. ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందంటూ విమర్శించారు. ప్రమాద స్థలానికి వెళ్లడానికి ఎందుకుఅనుమతి లేదంటూ ఫైర్ అయ్యారు. హరీశ్‌రావు తన బృందంతో కార్యాలయం వద్దే భైఠాయించడంతో అనంతరం టన్నెల్ పరిశీలను అనుమతి ఇచ్చారు. 8 మంది కార్మికులు టన్నెల్‌లో చిక్కుకొని ఆరురోజులు గడుస్తున్నా ప్రభుత్వానికి కార్మికులు ప్రాణాలంటే లెక్కలేదా అని నిలదీశారు. మంత్రులు రోజూ వచ్చిపోవడానికి ఇదేమన్నా టూరిస్ట్ ప్లేసా అంటూ ప్రశ్నించారు. సహాయక చర్యల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇంత ప్రమాదం జరిగినా సీఎం ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని మండిపడ్డారు. ఎనిమిది మంది ప్రాణా ముఖ్యమా..ఎన్నికలు ముఖ్యమా అని సీఎం సూటిగా ప్రశ్నించారు.

# నిపుణుల కమిటీ

>> రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 2015 అక్టోబర్‌లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మార్ ప్రాపర్టీస్‌కు సంబంధించిన ప్రాజెక్టుల వివాదాల పరిష్కారానికి ఛీఫ్ సెక్రెటరీ సారధ్యంలో ఐదుగురు సెక్రెటరీల కమిటీని ఏర్పాటు చేసింది. మరోవైపు కేంద్ర విదేశాంగ శాఖ, సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా కూడా ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. ఎమ్మార్ ప్రతినిధులతో జరిగిన చర్చల సందర్భంగా ఈ అంశాలన్నింటినీ అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. వివిధ దర్యాప్తు ఏజెన్సీల కేసులు, ఛార్జ్ షీట్లు, న్యాయపరమైన అంశాలతో ముడిపడి ఉన్నందున ఎమ్మార్ ఒప్పందాల డాక్యుమెంట్లు, కోర్టు కేసుల వివరాలతో పాటు కేంద్ర ప్రభుత్వ సూచనలన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవహారాన్ని పరిష్కరించేందుకు 2015లో చీఫ్ సెక్రటరీ నేతృత్వంలో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి అదనంగా న్యాయ నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. న్యాయ వివాదాలను అధ్యయనం చేయడానికి, సామరస్య పూర్వక పరిష్కారం చేసుకోవడానికి యూఏఈ ప్రభుత్వ ఆమోదంతో ఒక లీగల్ ఏజెన్సీని ఏర్పాటు చేస్తామని సంస్థ ప్రతినిధులు ప్రతిపాదించగా, వారి ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమోదించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీ వారితో సంప్రదింపులు జరిపి తదుపరి సూచనలు, సలహాలు అందిస్తుందని చెప్పారు.

## వారం - వర్జ్యం

తేది : 28-02-2025, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
అమావాస్య ఉ.6.15
శతభిష మ.1.40
వర్జ్యం రా.7.27 - 8.54
దు.ఉ.8.57-9.44
2) మ.12.53-1.40
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** ఆకస్మిక ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. ఖర్చులు పెరుగుతాయి.

**వృషభం :** కుటుంబంలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. రుణబంధాలు తప్పవు.

**మిథునం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఆర్థిక ఇబ్బందులు తప్పవు.

**కర్కాటకం :** ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. ఇంటా బయటా ప్రోత్సాహం లభిస్తుంది.

**సింహం:** కుటుంబ సమస్యలు పరిష్కరించుకొంటారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. క్రయవిక్రయాలు.

**కన్య :** సన్నిహితులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**తుల :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రముగా వుంటుంది. ఖర్చులు పెరిగి ఆందోళనకు కారణం అవుతుంది.

**వృశ్చికం:** విలువైన వస్తువులు, ఆభరణాలు జాగ్రత్త అవసరం. చోర భయం. కాంట్రాక్టులు లభిస్తాయి.

**ధనుస్సు:** దూరప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకొంటారు. ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**మకరం:** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్య పరుస్తాయి. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**కుంభం:** ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. సోదరులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.

**మీనం:** మిత్రుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. భూములు, వాహనాలు కొనుగోలు చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# బ్యాలట్ బాక్స్‌ల్లో భవితవ్యం

>> సంగారెడ్డి 24.60,39.93, మెదక్ 24.62, 50.04, సిద్ధిపేట 15.50,16.47, హన్మకొండ 23.62,41.57,జయశంకర్ భూపాలపల్లి 49.40 శాతంగా పోలింగ్ నమోదైంది..అదేవిధంగా మధ్యహ్నాం 2 గంటల వరకు 15 జిల్లాలో కలిపి పట్టభద్రుల ఎమ్మెల్సీ కి 40.61 శాతం,ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 63.49 శాతంగా నమోదైంది.. 15 జిల్లాలో మొత్తగా పోలింగ్ ముగిసే సమయానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ 70.42 శాతంగా నమోదు కాగా ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ 91.90 శాతంగా నమోదైంది..

**ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ 93. 55 శాతం నమోదు**

**ప్రభాతవార్త, నడిగూడెం(సూర్యాపేట):** వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ గురువారం శాసనమండలి పరిధిలో 12 జిల్లాల్లో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఓటర్లు త్వరగా కేంద్రానికి వచ్చి ఓట్లు వేసినప్పటికీ పోలింగ్ సమయం ముగిసేంతవరకు సిబ్బంది తమ విధులను నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ ముగియగానే బ్యాలెట్ బాక్స్ లను భారీ భద్రత నడుమ నల్లగొండలోని రిసెప్షన్ సెంటర్కు తరలించారు. సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో కలెక్టర్లు తేజస్ నందలాల్ పవర్ ఇలా త్రిపాఠి హనుమంతరావులతోపాటు ఆయా జిల్లాల కలెక్టర్లు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా జిల్లాల ఎస్పీలు కూడా పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి పరిస్థితిని సమీక్షించారు. పకడ్బందీగా పోలింగ్ నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తపడ్డారు. పోలింగ్ కేంద్రాల వద్ద 200 కిలోమీటర్ల పరిధి వరకు ఎవరిని అనుమతించలేదు. ఆంక్షలు విధించారు. 12 జిల్లాల్లో 200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.సూర్యాపేట జిల్లాలో 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 2664 మంది ఓటర్లు జిల్లాలో ఉండగా 25 30 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు . 94. 97 పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. నల్లగొండ జిల్లాలో 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4683 మంది ఓటర్లు ఉండగా 4433 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 94. 66 పోలింగ్ నమోదయింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 17 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 984 మంది ఓటర్లు ఉండగా 950 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 96.54 పోలింగ్ నమోదయింది. అత్యధికంగా పోలింగ్ శాతం యాదాద్రి భువనగిరి జిల్లాలో నమోదు అయింది.సిద్ధిపేట జిల్లాలో 4 పోలింగ్ కేంద్రాలు ఉండగా 166 మంది ఓటర్లు 156 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 93. 98 పోలింగ్ నమోదయింది.



గురువారం పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్

జనగామ జిల్లాలో 12 పోలింగ్ కేంద్రాలు ఉండగా 1002 మంది ఓటర్లు ఉండగా 945 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 94. 31 శాతం పోలింగ్ నమోదయింది. హనుమకొండ జిల్లాలో 15 పోలింగ్ కేంద్రాలు ఉండగా 5215 మంది ఓటర్లు ఉండగా 4780 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 91. 66 పోలింగ్ నమోదు అతి తక్కువగా పోలింగ్ హనుమకొండ జిల్లాలోనే నమోదయినట్లు అధికారులు తెలిపిన వివరాలు స్పష్టం చేస్తున్నాయి. వరంగల్ జిల్లాలో 13 పోలింగ్ కేంద్రాలు ఉండగా 2352 మంది ఓటర్లు ఉండగా 2214మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 94. 13 పోలింగ్ నమోదు అయింది. మహబూబాబాద్ జిల్లాలో 16 పోలింగ్ కేంద్రాలు ఉండగా 1663 మంది ఓటర్లు ఉన్నారు.1571 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోగా 94.47 శాతం పోలింగ్ నమోదయింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఏడు పోలింగ్ కేంద్రాల గాను 329 మంది ఓటర్లు ఉన్నారు. 308 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 93.62 శాతం పోలింగ్ ములుగు జిల్లాలో 9 పోలింగ్ కేంద్రాలు ఉండగా 628 మంది ఓటర్లు ఉన్నారు. 583 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 92.83 పోలింగ్ నమోదయింది. భద్రాద్రి జిల్లాలో 23 పోలింగ్ కేంద్రాలు ఉండగా 2022 మంది ఓటర్లు ఉన్నారు.1858 నంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 91.89 పోలింగ్ నమోదయింది. ఖమ్మం జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాల్లో 4089 మంది ఓటర్లు ఉన్నారు.3804 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 93.03 శాతం పోలింగ్ నమోదయింది 12 జిల్లాల పరిధిలో 25,797 మంది ఓటర్లు ఉండగా 24,132 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. 1665 మంది ఓటు హక్కును వినియోగించుకోలేదు. శాసన మండల పరిధిలోని 12 జిల్లాల్లో 93. 55 శాతం పోలింగ్ నమోదు అయింది.వివరాలను ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రకటించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు బలగాలను ఏర్పాటు చేశారు. ఎస్పీలు నిరంతరం పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తూ పరిస్థితిని సమీక్షించారు. ఎక్కడ కూడా సమస్యలు ఉత్పన్నమైన దాఖలాలు లేవు. ప్రతి 2గంటలకు ఒకసారిఅధికారులు పోలింగ్ శాతాన్ని ప్రకటించారు. ఎప్పటికప్పుడు పోలింగ్ సరళి పరిశీలిస్తూ వివరాలను తెలియజేశారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి ఓటింగ్ శాతం పెరుగుతూ వచ్చింది. 19 మంది అభ్యర్థులు పోటీ చేసిన సంగతి తెలిసిందే. జంబో బ్యాలెట్ బాక్సులు కూడా ఏర్పాటు చేశారు. పోలింగ్ సమయం ముగియగానే అధికారుల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ లను సీజ్ చేసి వచ్చిన వాహనాల్లోనే ఎక్కడ ఆపకుండా రిసెప్షన్ సెంటర్ నల్లగొండకు భారీ బందోబస్తు నడుమ తరలించారు. ఎక్కువ శాతం కేంద్రాల్లో తక్కువ సంఖ్యలో ఓటర్లు ఉండడంతో త్వరగా పోలింగ్ పూర్తయింది. ఎక్కువగా పురుష ఓటర్లే ఉన్నారు. ఏది ఏమైనాప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. మార్చి మూడవ తేదీన కౌంటింగ్ నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూముల్లో బ్యాలెట్ బాక్స్ లను భద్రపరిచారు. అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమై ఉంది. వెబ్ కాస్టింగ్ ద్వారా 12 జిల్లాల్లో పోలింగ్ సరళి పరిశీలించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. వెబ్ కాస్టింగ్ ద్వారా అన్ని జిల్లాలలోని పోలింగ్ కేంద్రాల్లో పోలింగును సాంకేతికంగా పర్యవేక్షించినట్లు తెలిపారు. అందరి సహకారంతో పోలింగును ప్రశాంతంగా నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మార్చి మూడున కౌంటింగ్ కౌంటింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



ప్రయాగ్‌రాజ్‌లోని అరయిల్ ఘాట్‌లో గురువారం స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్

# ఏమీ గుర్తు లేదు.. మెమొరీ లాస్

## జస్టిస్ పిసి ఘోష్ విచారణలో రిటైర్డ్ ఇఎన్సీ మురళీధర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి27:** కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ జరుపుతోన్న విచారణ గురువారం కాస్తా వాడి వేడిగా సాగింది. ఈ కమిషన్ ఎదుట రిటైర్డ్ ఈఎన్‌సీలు నల్ల వెంకటేశ్వర్లు, మురళీధర్ రావు, హరిరామ్, సీడీఓ మాజీ సీఈ నరేందర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. తొలుత నల్ల వెంకటేశ్వర్లను కమిషన్ ఛైర్మన్ పీసీ ఘోష్.. క్రాస్ ఎగ్జామిన్ చేశారు. ఆ క్రమంలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల లొకేషన్ ఎందుకు మార్చారంటూ ఆయనను పీసీ ఘోష్ ప్రశ్నించారు. దీంతో నల్లా వెంకటేశ్వర్లు సమాధానమిస్తూ.. గ్రావిటీ కెనాల్ పొడవు తగ్గించడం, కెపాసిటీ పెంచడం, అటవీ భూముల సేకరణ తగ్గించడం, ఎత్తిపోతలు, విద్యుత్ భారం తగ్గించడానికి బ్యారేజిల నిర్మాణ స్థలాలను మార్చినట్లు కమిషన్‌కు ఆయన సోదాహరణగా వివరించారు. అలాగే ఎవరి సూచనల మేరకు లొకేషన్ మార్చారంటూ మరో ప్రశ్నను ఆయనకు కమిషన్ సంధించింది. సీఈ నుంచి వచ్చిన సూచనల మేరకే బ్యారేజ్ నిర్మాణ స్థలాలు మార్చినట్లు తెలిపారు. ఇక ఎవరి ఆదేశాల మేరకు బ్యారేజీలో నీరు స్టోర్ చేశారంటూ కమిషన్ ప్రశ్నించగా.. నాటి సీఎం కేసీఆర్ సూచనల మేరకే నీటిని స్టోర్ చేశామని పేర్కొన్నారు. అదే విధంగా పనుల ఆలస్యంగా చేసినందుకు ఏజెన్సీలకు ఎప్పుడైనా పెనాల్టీలు వేశారా? అని కమిషన్ ప్రశ్నించగా.. అలాంటి పని తాము ఎప్పుడు చేయలేదని కమిషన్ ఎదుట రిటైర్డ్ ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు సమాధానమిచ్చారు. బ్యారేజ్‌ల నిర్మాణ సమయంలో సరిగ్గా మానిటర్ చేయలేదని ఒప్పుకుంటారా ? అన్న కమిషన్ ప్రశ్నకు .. బ్యారేజ్ నిర్మాణ సమయంలో తాను తరచూ వెళ్లేవాడినని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు రిటైర్డ్ ఈఎన్‌సీ మురళీధర్ రావుపై కమిషన్ ఛైర్మన్ పీసీ ఘోష్ అసహనం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణం విషయంలో కమిషన్ ఛైర్మన్ పీసీ ఘోష్ అడిగిన ప్రతి ప్రశ్నకు రిటైర్డ్ ఈఎన్‌సీ మురళీధర్ రావు తెలియదు.. గుర్తు లేదంటూ సమాధానమిచ్చారు. దీంతో జస్టిస్ పీసీ ఘోష్ కొంత అసహనం వ్యక్తం చేస్తూ.. మీరు ఎప్పుడు విధుల నుంచి రిటైర్ అయ్యారంటూ మురళీధర్ రావును సూటిగా ప్రశ్నించారు. తాను2024, ఫిబ్రవరిలో రిటైర్డ్అయ్యానంటూ మురళీధర్‌రావు సమాధానమిచ్చారు. దీంతో మురళీధర్ రావుపై కమిషన్ ఛైర్మన్ పీసీ ఘోష్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. తాను ఇచ్చిన తీర్పులు ఇప్పటికీ తనకు గుర్తు ఉన్నాయన్నారు. మీరు అప్పుడే మరిచిపోయారా? అంటూ జస్టిస్ పీసీ ఘోష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తాను మెమొరీ లాస్ అయినట్లు మురళీధర్ రావు సమాధాన మిచ్చారు. దీంతో పేపర్లు, పుస్తకాలు చదవితే జ్ఞాపకశక్తి పెరుగుతుందంటూ కమిషన్ సూచించగా... పేపర్లు చదవుతా, పుస్తకాలు చదువలేను అని రిటైర్డ్ ఈఎన్‌సీ మురళీధర్ సమాధానం ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.లక్షల కోట్ల వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిర్మించారు. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల ముందు సదరు ప్రాజెక్ట్‌లోని పిల్లర్లు కృంగాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో భారీగా అవినీతిచోటు చేసుకుందని.. అందుకే ఈవిధంగా కృంగిందంటూ ఈవ్యవహారంపై విచారణచేపడతామంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు స్పష్టమైన హామీ ఇచ్చింది. ఇంతలో ఎన్నికలు రావడంతో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరిన అనంతరం కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం.. ఆ నాటి సంఘటనలపై విచారణకు జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ క్రమంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట.. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో పాలు పంచుకొన్న ఉన్నతాధికారులను విచారిస్తోంది.

# కష్టాల్లో ఖజానా!

>> అంచనా వేసింది, కానీ అది కార్యరూపం దాల్చలేదు. మరోవైపు, పన్నుయేతర ఆదాయం మరియు కేంద్ర గ్రాంట్లలో భారీ కోత కారణంగా, రాష్ట్ర ఆర్థిక లోటు రూ. 58,586 కోట్లు దాటింది. దీనిని పూడ్చడానికి, అంచనాలకు మించి కొత్త రుణాలు సేకరించాల్సి వచ్చిందని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం వడ్డీ వాయిదాలకు రూ. 17,729 కోట్లు సరిపోతాయని బడ్జెట్ అంచనా వేసినప్పటికీ, గత 10 నెలల్లోనే ప్రభుత్వం రూ. 22,056 కోట్లు చెల్లించింది. అదేవిధంగా, ఈ సంవత్సరం ఉద్యోగుల పెన్షన్లకు రూ. 11,641 కోట్లు సరిపోతాయని అంచనా వేయగా, ఇప్పటికే రూ. 14,153 కోట్లు చెల్లించారు. వడ్డీ మరియు పెన్షన్లు మొత్తం సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని కేవలం 10 నెలల్లో 21 నుండి 24 శాతం అధిగమించాయి. ఫలితంగా, వివిధ సంక్షేమ పథకాలకు ఇవ్వాల్సిన సబ్సిడీ నిధులలో ఇప్పటివరకు 70 శాతం మాత్రమే పంపిణీ చేయబడ్డాయి. ఇక ఆరు గ్యారంటీలు అమలుతో పాటు, అభివృద్ధి, సంక్షేమానికి ఎటువంటి లోటు రాకుండా ఉండాలంటే నెలకు దాదాపు రూ.10 వేల కోట్లు అవసరమవుతుందని అంచనా. ఇందుకు వివిధ రూపాల్లో ఆదాయం పెంచుకోవడం తప్ప ప్రభుత్వానికి మరో ఆప్షన్ లేదు. అందుకే ఖజానాపై ఫోకస్ పెట్టి.. నిధుల వేటలో ఉంది తెలంగాణ సర్కార్. ఇక జీఎస్టీ వసూళ్లు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ వసూళ్ల మొన్నటి వరకు కాస్త నెమ్మదించినా, ఈ ఏడాది నుంచి వాటిపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టడంతో వసూళ్ల పెరిగాయి. అలాగే ప్రాపర్టీ ట్యాక్స్‌లు, ఇసుక అక్రమ రవాణా కట్టడి, ఎల్ఆర్ఎస్‌ల లాంటి వాటిపైనా దృష్టి పెట్టడంతో ఆదాయం పెరిగే అవకాశం ఉంది. ఇటీవల బీర్లపై ధరలు పెంచడంతో ఎక్సైజ్‌శాఖ నుంచి ఆదాయం పెరుగుతోంది. వీటికి తోడు కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలు, ఆర్థిక సాయం, అభివృద్ధి పనులకు నిధులను సాధించడంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది.

# సీట్లన్నీ స్థానికులకే

>> ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని విద్యా సంస్థలు అందించే ప్రతి కోర్సులో 85 శాతం సీట్లు ఓయూ ప్రాంతం (తెలంగాణ ప్రాంతం) స్థానిక అభ్యర్థులకు రిజర్వ్ చేయబడతాయి. మిగిలిన 15 శాతం సీట్లు అన్‌రిజర్వ్‌డ్ కిందకు వస్తాయి. ఓయూ ప్రాంతం స్థానికులుగా ప్రకటించబడిన అభ్యర్థులు అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీ సీట్లకు అర్హులుగా ఉత్తర్వులో పేర్కొంది. 15 శాతం అన్‌రిజర్వ్‌డ్ కోటా సీట్ల కేటాయింపులో కొన్ని మార్పులు చేసింది. అన్‌రిజర్వ్‌డ్‌లోని 15 శాతం సీట్లకు 4 రకాలవారు అర్హులుగా గుర్తిస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. తెలంగాణ స్థానికత ఉన్నవారు 15 శాతం అన్‌రిజర్వ్‌డ్ సీట్లకూ అర్హులు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో వృత్తివిద్య కోర్సుల్లో అడ్మిషన్ల కోసం గతంలో ఉన్న మార్గదర్శకాల్లో మార్పు చేస్తూ జీవో ఎంఎస్ నంబర్ 15 ప్రభుత్వం జారీ చేసింది. 15 శాతం అన్‌రిజర్వ్ కోటాలో తెలంగాణ స్థానికులు.. 10 సంవత్సరాలు తెలంగాణలో నివాసం ఉన్న వారు.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో, విద్యా సంస్థల్లో పని చేస్తున్న వారి పిల్లలు.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో, విద్యా సంస్థల్లో పని చేస్తున్న వారి జీవిత భాగస్వాములకు సీట్ల కేటాయింపు చేయనున్నారు.

# కమీషన్ ఇవ్వనిదే ఆర్థిక శాఖ బిల్లులు ఇవ్వడం లేదు

### ఇది ప్రభుత్వానికి సిగ్గు అనిపించడం లేదా?: ఎంపి ఈటల

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కమిషన్ ఇవ్వనిదే ఆర్థిక శాఖ బిల్లులు ఇవ్వడం లేదని, ఇది మీకు సిగ్గు అనిపించడం లేదా అంటూ సిఎం రేవంత్‌రెడ్డిని ఎంపి ఈటల రాజేందర్ ప్రశ్నించారు. గురువారం పార్టీ కార్యాలయంలో బిజెఎల్‌పి నేతల ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మరో ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. అవినీతి పాలనపై సిఎం ఎందుకు దృష్టి సారించడం లేదన్నారు. రేవంత్ ది తుగ్లక్ పరిపాలన అంటూ మండిపడ్డారు. సోయి అవగాహన లేదన్నారు. పాడిందే పాడరా అన్నట్టు రేవంత్ రెడ్డి వెకిలి మాటలు బంద్ చెయ్యాలన్నారు. చిట్ చాట్‌ల పేరుతో లీకులు ఇవ్వడం మానెయ్యాలని, మోడిని విమర్శించడం అంటే సూర్యుని మీద ఉమ్మి వేయడమే అన్నారు. కెసిఆర్ కూడా ఇట్లనే విమర్శ చేసారు, పోస్టర్లు వేశారు, హోర్డింగులు పెట్టారు. ఏమయ్యింది? ఎవరి మొఖం ఎక్కడ ఉందో తెలుసుకదా. నీకు కూడా అదే గతి పడుతుందని అన్నారు. మోడికి కూతురు, కొడుకు, అల్లుడు లేరు.. దేశప్రజలే ఆయన కుటుంబసభ్యులు అన్నారు. మోడిని విమర్శిస్తే కీర్తి పెరగదని అన్నారు. రాజకీయంగా ఖతం అవుతారు, భస్మం అయిపోతారు జాగ్రత్త అన్నారు. మీ మాటలు చూసి ఇందుకేనా తెలంగాణ తెచ్చుకుందని ప్రజలు బాధపడుతున్నారని అన్నారు.

**బిఎస్ఎన్ఎల్ పునరుద్ధరణ జరగాలి**

బిఎస్ఎన్ఎల్ పునరుద్ధరణ జరగాలని, దీనికి హైదరాబాద్ నాంది పలకాలని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. బిఎస్ఎన్ఎల్ పునరుద్ధరణకు మా ఎంపీలు అందరం మద్దతుగా ఉంటామని అన్నారు. గురువారం టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఎంపి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఎంపి మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ గొప్ప సంస్థగా ఎదగడానికి కావాల్సిన ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

# మమ్మల్ని అడిగి హామీలు ఇచ్చారా?

### సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మమ్మల్ని అడిగి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారా? ప్రధానమంత్రి నరేంద్రమోడీ, బిజెపి ప్రభుత్వం డబ్బులు ఇస్తేనే అభివృద్ధి పనులు చేస్తానని చెప్పారా? అంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. ప్రాజెక్టులకు రూపకల్పన కేంద్రాన్ని అడిగి చేశాడా? రాష్ట్రాలు ఇలా బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేయడం ఎంతవరకు సబబు అన్నారు. లేనిది ఉన్నట్టుగా చెప్పడం అలవాటైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి అనేక ప్రాజెక్టులను ఎప్పటికప్పుడు వివిధ విభాగాలతో మాట్లాడి, ఉత్తరాలు రాస్తూ అభివృద్ధి పనులు జరిగేలా చూస్తున్నాను. ఇవాళ బెదిరింపు రాజకీయాలు చేస్తే ఎవరు భయపడేవారు లేరన్నారు. రేవంత్‌రెడ్డి మాటలను నమ్మేవారు ఎవరూలేరు. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డిని నమ్మి ఇపుడు ఆయన ఎలాంటి గాలిమాటలు మాట్లాడుతారో ప్రజలు అర్థం చేసుకున్నారు. నేనేం ఆయన, కాంగ్రెస్ పార్టీ దయాదాక్షిణ్యాలతో పార్లమెంట్ లోకి రాలేదు.. నేను తెలంగాణ ప్రజలకు మాత్రమే జవాబుదారీని. రేవంత్ మాటలకు నేను జవాబుదారీని కాద న్నారు. ముఖ్యంగా ఒక్క విషయంలో అయినా ఆయనకు దమ్ము, ధైర్యం ఉంటే నేను ఒక్క ప్రాజెక్టును అడ్డుకున్నట్టు నిరూపించాలని సవాలు చేస్తున్నాను. చేతకాని ముఖ్యమంత్రి, దమ్ములేని ముఖ్యమంత్రి, మాటలు చెప్పి చేతులు దులుపు కొనే ప్రయత్నం చేస్తున్నారు. ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తే ఎలాంటి ఆర్థిక ప్రణాళిక చేస్తారో కూడా ఓ కార్యాచరణ లేదు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ఎలాంటి అవగాహన లేకుండా దుందుడుకుగా మాట్లాడుతున్నారని ఇది ఎంత వరకు సమంజసమని కిషన్‌రెడ్డి అన్నారు.

# భక్తి శ్రద్ధలతో జన జాగరణ

### సిద్ధించిన భక్తుల మనోరథం

**(శ్రీకాళహస్తి, ప్రభాతవార్త)**మహాశివరాత్రి పర్వదినాన శివయ్య సన్నిధిలో నిద్ర చేస్తే మంచిదనే నమ్మకం నేటికి ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, ఇఓ డి.బాపిరెడ్డి, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి,లు వారి సిబ్బంది కలసి ఎలాగైనా భక్తులకు సదుపాయాలు కల్పించుటకు వారి మనోభిష్టానికి అనుకూలంగా డార్మెంటరీలను ఏర్పాటు చేశారు.స్థపద మండపం సమీపంలోనూ, అలాగే సన్నిధివీధి, శివయ్య గోపురంపక్కన కొత్తగా షెడ్లులను నిర్మించి నిద్రించుటకు అవకాశం కల్పించారు. కాలకృత్యాల్లి తీర్చుకోవటానికి మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. అంతేకాక ఈ ఏడాది మాస్టర్‌ప్లాన్‌లో ఖాళీ చేయించిన స్థలాల్లో చక్కగా పార్కింగ్‌లు ఏర్పాటు చేశారు.దాంతో భక్తులు రాత్రి జాగరణకు నిద్రించటానికి ఎంతో అనుకూలంగా మారింది. దక్షిణ కైలాసానికి భక్త జనులు కడలి తరంగాల్లా కదలి వచ్చారు.బుధవారం ఉదయం నుంచి శ్రీకాళహస్తి పట్టణంలో భక్తుల సందడి అంతంత మాత్రంగా ఉండగా మధ్యాహ్నం నుంచి పల్లె జనం తరలి వచ్చారు.దాంతో ఆలయంలో దర్శనానికి నిరీక్షించాల్సి వచ్చింది.

రాత్రి పదకొండు గంటల వరకు కూడా భక్తులు దర్శనానికి నిరీక్షిస్తూ కనబడ్డారు. అయితే నూతనంగా ఏర్పాటు చేసిన క్యూలైన్లతో ఎలాంటి ఇబ్బంది లేకుండా సుదర్శనం చేసుకున్నారు. ఉత్సవంలో గతంలో ఎన్నడూలేని విధంగా కొత్తదనం చోటు చేసుకుంది. పట్టణంలోని నాలుగుమాడా వీధులు కిక్కిరిసి కనబడ్డారు.నందిసేవలో సాంస్కృతిక బృందాల విన్యాసాలు కనువిందు చేశాయి. ఎటు చూసినా యువకుల కేరింతలు,ఆనందోత్సాహాలతో నాట్యాలు చేయటం ఎంతో కనువిందుగా మారింది. ముందు ఒంగోలు నుంచి వచ్చిన నందులు నందీశ్వరుని సేవకు వచ్చాయా అన్నట్లు అలంకరించి వెళుతుంటే సాంప్రదాయాన్ని మరిపించే విధంగా కోలాటాల బృందాలు అడుతూ పాడుతూ ఆకట్టుకున్నాయి.వెంటనే బుట్టబొమ్మలు, పక్కనే గెరిగాటం నృత్యాలు, విచిత్ర వేష ధారణ ఎంతో ఆకట్టుకున్నాయి. ఇక కేరళ పంచవాయిద్యాల మోత హైదరాబాదు బ్యాండుమేళాలు,

స్థానికంగా డోలు సన్నాయి నాదాలు, స్వామి అమ్మవార్లు వెనుక వేదపండితుల వేదఘోష భక్తుల్ని భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. ఉదయం నుంచి లేనిజనాభా ఇంత వచ్చింది. ఇది శివమహిమా? లేక నేల తల్లి ఈనిందా? అన్నట్లు భక్తులు కడలి తరంగాల్లా కదలి వచ్చారు.



## ఉక్రెయిన్‌పై యుద్ధానికి ఉత్తరకొరియా అదనపు బలగాలు

**సియోల్, ఫిబ్రవరి 27:** ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు మద్దతుగా ఉత్తరకొరియా సైన్యం కూడా పాల్గొంటున్నది. ఈక్రమంలో వందలమంది కిమ్‌సైనికులు ప్రాణాలు కోల్పోయారు. అయినా కూడా తాజాగా మరిన్ని బలగాలను కిమ్ రష్యాకు పంపించినట్లు దక్షిణకొరియా నిఘా విభాగం నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్ వెల్లడించింది. ఈసారి ఎంతమందిని పంపించిందనే అంశం తెలుసుకునేప్రయత్నాలుచేస్తున్నట్లు ప్రకటించింది. రష్యాకు భారీ స్థాయిలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి పంపిస్తున్న ఉత్తరకొరియా కొంతకాలం క్రితం 10 నుంచి 12 వేలమంది సైనికులను పంపించిందని అమెరికా దక్షిణకొరియాతోపాటు ఉక్రెయిన్ నిఘా విభాగాలు వెల్లడించాయి. గడచిన రెండునెలల్లో కుర్స్క్ ప్రాంతంలో వెయ్యినుంచి మూడువేలమంది కిమ్‌సైన్యాన్ని మొహరించినట్లు తెలుస్తోంది. ఉత్తరకొరియా సైనికులు చాలా క్రమశిక్షణతోపాటు మంచి శిక్షణకూడా పొందినట్లు కనిపిస్తున్నారని తెలుస్తోంది. అయితే యుద్ధక్షేత్రంలో అనుభవలేమి, అక్కడిబూభాగంపై అవగాహన లేకపోవడంతో డ్రోన్ దాడులకు లక్ష్యంగా మారుతున్నట్లు సమాచారం. జనవరిలోనే 300 మంది కిమ్‌సైనికులు చనిపోగా 2700 మంది గాయపడినట్లు అంచనా. అయితే మొత్తంగా 4వేల మంది ఉత్తరకొరియా సైనికులు చనిపోవడమో లేదా గాయపడటమో జరిగిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. అయితే అమెరికా మాత్రం ఈసంఖ్యను 1200గా చెపుతోంది. సైనిక ఆయుధ సాయం అందిస్తున్న ఉత్తరకొరియాకు బహుమతిగా రష్యా అత్యాధునిక ఆయుధాలు, సాంకేతిక వ్యవస్థలను అందిస్తోందని దక్షిణకొరియా భావిస్తోంది. దీనివల్ల ఉత్తరకొరియా తన అణ్వాయుధ వ్యవస్థను మరింత బలోపేతంచేయవచ్చని అంచనా. ఉక్రెయిన్ రష్యా యుద్ధం ముగింపుకోసం సౌదీ అరేబియా వేదికగాచర్చలుజరుగుతున్నవేళ ఉత్తరకొరియా అదనపు బలగాలను పంపించడం వివాదాన్ని రేకెత్తిస్తోంది.

# ఐరోపా సమాఖ్యపై తాజాగా 25 శాతం సుంకాలు

### హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 27:** ఆదనపు సుంకాల వడ్డనలో అమెరికా అధ్య క్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్రులను కూడా వదలడం లేదు. ఐరోపా సమాఖ్యపై త్వరలోనే 25 శాతం అదనపు టారిఫ్‌లను విధిస్తానని వెల్లడించారు. అసలు ఇయు ఏర్పడిందే అమెరికాను కట్టడి చేయ డానికికని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'మేము ఒక నిర్ణయానికి వచ్చాము. దానిని త్వరలోనే ప్రకటిస్తాం. 25 శాతం అని అనుకొంటున్నాం. అది కార్లు సహా అన్నింటిపైనా వర్తిస్తుం ది. అమెరి కాను బిగించడానికే ఐరోపా సమాఖ్య ఏర్పడింది. అది దాని పని బాగా చేసింది. ఇప్పుడు నేను అధ్యక్షుడిని అయ్యాను' అని పేర్కొ న్నారు. ఇయు ప్రస్తుతం దిగుమతి చేసు కొంటున్న కార్లపై 10 శాతం టారిఫ్ లను విధిస్తోంది. దీనికి తోడు వ్యాట్, ఇతర పన్నులు కలిపి అది 17.5 శాతానికి చేరుతోంది. అదే సమయంలో అమెరికా కేవలం 2.5 శాతం మాత్రమే వసూలు చేస్తోంది. ఐరోపా సమాఖ్య అమెరికాకు మూడో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. చైనాతో కూడా అమెరికాకు ఇదే స్థాయిలో బిజినెస్ జరుగుతుంది. ఇక కెనడా, మెక్సికోలతో అమెరికా వ్యాపారం అత్యధికంగా చేస్తుంది. ఇప్పటికే ఈ మూడు దేశాలపై అదనపు సుంకాలను ట్రంప్ ప్రకటించారు. ఇవి మార్చి 4 తేదీ నుంచి అమ ల్లోకి రానున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలు ఇయులో కలకలం రేపాయి. యూరోపియన్ కమిషన్ స్పందిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్ అయిన ఇయు అమెరికాకు వరమని పేర్కొంది. స్వచ్ఛ, పారదర్శక వాణిజ్యా నికి అన్యాయమైన అడ్డంకులపై ఇయు తక్షణమే స్పందిస్తుంది. ఈ సుంకాలు చట్టాలను, వివక్ష రహిత విధానాలను సవాలు చేస్తాయి అని ఇయు ప్రతినిధి పేర్కొన్నారు.



# హర్యానా, గుజరాత్‌వాసులతో బోగస్ ఓట్ల చేర్పింపు

### అందువల్లనే ఢిల్లీలో బిజెపి గెలుపు

**కోల్‌కతా, ఫిబ్రవరి 27:** భారతీయ జనతా పార్టీ ఢిల్లీఎన్నికల్లో బోగస్ ఓటర్లను చేర్పించడంవల్లనే గెలుపొందిందని, ఈ ఎన్నికల్లో, హర్యానా, గుజరాత్‌లనుంచి కార్యకర్తలను రప్పించి ఓటర్లుగా వారిని నమోదచేయించి ఢిల్లీఎన్నికల్లో లబ్ధిపొందిందని ఆరోపించారు. టిఎంసి సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిష్పాక్షికంగా పనిచేయనంత వరకూ దేశంలో స్వేచ్ఛగాను, నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగే అవకాశం లేదన్నారు. పోలింగ్‌ను మరింత ప్రభావితంచేసేందుకుగాను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా గ్యానేష్‌కుమార్‌ను హడావిడిగా నియమించిందని ఆరోపించారు. తక్షణ కార్యాచరణచేపట్టకపోతే తాను ఎన్నికల సంఘం కార్యాలయం ముందే నిరవధిక ధర్నాకు దిగుతానని కోల్‌కత్తా సీఎం హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ ఆశీస్సులు లేకుండా బిజెపి ఓటర్ల జాబితాలను ఎలా తారుమారుచేస్తుందని ఇది స్పష్టంగా తెలుస్తోందన్నారు. 2006లోనే తాను భూసేకరణకు వ్యతిరేకంగా 26 రోజులపాటు రిలేదీక్షలకు వెళ్లానని ఆమె చెప్పారు. ఇపుడు అదేపరిస్థితి ఎన్నికల సంఘం వద్ద కూడా నిర్వహిస్తామన్నారు. ఓటర్ల జాబితాలను సరిచేసి బోగస్ ఓట్లను తొలగించకపోతే తాము తమ డిమాండ్ పరిష్కరించేంతవరకూ నిరవధిక ఆందోళన చేయకతప్పదని హెచ్చరించారు. ఎన్నికలు వచ్చే సమయానికి బిజెపి చొరబాట్లు ప్రస్తావిస్తుందని, అమెరికానుంచి తాళ్ల గొలుసులతో కట్టిపడేసి అక్రమ వీసాదారులంటూ భారత్‌కు పంపిస్తే ప్రశ్నించలేదని ఆమె మండిపడ్డారు. దేశానికి ఇదెంతో అవమానకరమని, సిగ్గుచేటన్నారు. కొలంబియా ప్రభుత్వం తమ పౌరులను వెనక్కి తెచ్చుకునేందుకు విమానాలు ఏర్పాటుచేసిందని, బిజెపి ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అలాచేయలేక పోయిందని గుర్తుచేసారు. ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి పాల్పడిన అవకతవకలు పశ్చిమబెంగాల్‌లో ఎట్టిపరిస్థితుల్లోను అనుమతించబోమని మమతా బెనర్జీ ఆరోపించారు.



# నేటి నుంచి తెలుగు రాష్ట్రాల్లో వీకెండ్స్ ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త** వీకెండ్స్ సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే తెలుగు రాష్ట్రాల్లో వీకెండ్స్ ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. చర్లపల్లి నుంచి కాకినాడ టౌన్ వెళ్లే నెంబర్ 07031ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 28,మార్చి 7,13,21,28వ తేదీల్లో ప్రతి శుక్రవారాల్లో సాయంత్రం 7-20గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి శనివారం తెల్లవారుజామున 4-30గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కాకినాడ టౌన్ నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07032ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ మార్చి 2,9,16,23,31వ తేదీల్లో ప్రతి ఆదివారం సాయంత్రం 6-55గంటలకు కాకినాడ టౌన్ నుంచి బయలుదేరి సోమవారం ఉదయం 6-50గంటలకు చర్లపల్లి చేరు కుంటుంది. మార్గమధ్యలో ఈ రైలు నల్గొండ, మిర్యాల గూడ, నత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లి గూడెం,రాజమండ్రి, సామర్ల కోట స్టేషన్‌లలో నిలుస్తాయి. చర్లపల్లి-నర్సాపూర్ ప్రత్యేక రైళ్లు : చర్లపల్లి నుంచి నర్సాపూర్ వెళ్లే నెంబర్ 07233ఎక్స్‌ప్రెస్ ఈ నెల 28న, మార్చి 7,13,21,28వ తేదీల్లో ప్రతి శుక్రవారాల్లో రాత్రి 8-15గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి శనివారం తెల్లవారుజామున 5-50గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో నర్సాపూర్ నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07234 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ మార్చి 2,9,16,23,31వ తేదీల్లో ప్రతి ఆదివారం రాత్రి 8-00గంటలకు నర్సాపూర్ నుంచి బయలుదేరి సోమవారం ఉదయం 6-00గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

ఈ రైళ్లు మార్గమధ్యలో నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి,పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ,గుడివాడ,కైకలూరు,ఆకివీడు,భీమవరం టౌన్,వీరవాసరం,పాలకొల్లు స్టేషన్లలో నిలుస్తాయి.

# యుజిసి నిబంధనలపై కేంద్ర విద్యామంత్రి, యుజిసి ఛైర్మన్‌కు తెలంగాణ విద్యాకమిషన్ లేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** కేంద్రంలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) రూపొందించిన కొత్త నిబంధనలను తెలంగాణ విద్యాకమిషన్ వ్యతిరేకించిన విషయం తెలిసిందే. యుజిసి కొత్త నిబంధనలపై కొద్దిరోజుల క్రితం తెలంగాణ విద్యాకమిషన్ మేధావులు, ప్రొఫెసర్లతో సెమినార్‌ను నిర్వహించింది. సెమినార్‌లో వచ్చిన అభిప్రాయాల మేరకు చేసిన తీర్మానంలోని అంశాలపై విద్యాకమిషన్ గురువారం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధరేంద్ర ప్రధాన్‌తోపాటు.. యుజిసి ఛైర్మన్‌కు లేఖ రాసినట్టు విద్యాకమిషన్ ప్రకటించింది. కొత్త మార్గదర్శకాలతో అనేక సమస్యలు రానున్నట్టు పేర్కొన్నారు. పదేళ్లల్లో తరచుగా నిబంధనలను సవరించడం వల్ల ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని కాపాడు కోవాలంటే, రాజ్యాం గంలోని సమాఖ్య నిర్మాణం కింద రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాపాడు కోవాలంటే యుజిసి వంటి కేంద్ర సంస్థలు ఏ సరిహద్దుల్లో పనిచేయాలి అనే దానిపై ముసాయిదా నిబంధనలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయని విద్యాకమిషన్ లేఖలో గుర్తుచేసింది.

ఇప్పటికే తమిళనాడు, కేరళ వంటి అనేక రాష్ట్రాలు ప్రతిపాదిత మార్గదర్శ కాలపై ప్రజల అభిప్రా యాన్ని తీసుకుని.. ఆయా అసెంబ్లీలలో అభ్యంత రాలను లేవనెత్తుతూ తీర్మానాలను ఆమోదిం చాయని పేర్కొంది. తెలంగాణలోని విద్యావేత్తలు యుజిసి నిబంధనలు రాష్ట్ర విశ్వవిద్యా లయాలలో జోక్యంపై జరిగిన సెమినార్‌లో చర్చించినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ యాజమాన్యంలోని ఉన్నత విద్యాసంస్థలపై యుజిసి నియంత్రణను కేంద్రం అనుమతిస్తోందని తీర్మానించారు. కేంద్ర ప్రభు త్వంతోపాటు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ బలమైన విద్యావ్యవస్థకు నిధులు ఇవ్వడంతో పాటు మద్దతు ఇవ్వడం వంటి బాధ్యత నుండి వేగంగా వైదొల గుతున్నాయని లేఖలో విద్యా కమిషన్ పేర్కొన్నట్టు తెలిపింది. ఆర్థిక బాధ్యతల నుండి వైదొలగడంతోపాటు పరిపాలనా, విద్యా స్వయంప్రతిపత్తిని హరించే విధానపాలనను అమలుచేయడం ఉన్నత విద్యావ్యవస్థకు మృత్యువు లాంటిదని పేర్కొంది.

# కందులకు రికార్డు ధర

### క్వింటా రూ.7,900

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాత వార్త :** రాష్ట్రంలో కందులకు మం చి ధర పలుకుతున్నది. ప్రభుత్వ మద్దతు ధర 7,500 రూపాయలు ఉండగా, బహిరంగ మార్కెట్లో 7,900 రూపాయలకు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నా రు. దీంతో వారికే విక్రయించ డానికి రైతులు మొగ్గు చూపుతున్నారు. కందుల కొనుగోలు కోసం ప్రభుత్వం గత నెల 8న 13 జిల్లాల పరిధిలో అన్ని సౌకర్యా లతో 41 సెంటర్లను ఏర్పాటు చేసింది. కందులు అమ్మిన పది రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నది. బహిరంగ మార్కె ట్లో అధిక ధరలు వ స్తుండడంతో రైతులు ప్రభుత్వం కేంద్రాలకు అంతగా రావడం లేదు. రాష్ట్రంలో ఈ ఏడాది 5.20 లక్షల ఎకరాల్లో కంది సాగు చేయగా, 1.72 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. కానీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 4,083 మంది రైతుల నుంచి 3200 టన్నుల కందులు మాత్రమే విక్రయించారు. ఇప్పటివరకు మార్క్‌ఫెడ్ ద్వారా 24 కోట్ల రూపాయల విలువైన కందులు సేకరించగా, అందుకు 4.97 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశారు. మిగతా సొమ్ము వారం రోజుల్లో పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఖర్జూరాల్లో బంగారం స్మగ్లింగ్!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** నగరంలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అంతుచిక్కని రీతిలో తరలిస్తున్న బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకు న్నారు. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఆతడి నుంచి 172 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకన్నారు. 56 ఏళ్ల వయసున్న ఒక ప్రయాణికుడు జెద్దానుంచి ఢిల్లీకి వచ్చాడు. ఆతడు ఎస్వీ 756 విమానంలో ప్రయా ణించాడు. అయితే బ్యాగేజి చెకింగ్ సమయంలో అతడి లగేజిపై అనుమానం వచ్చింది. కర్జూరపండ్లలో బంగారం దాచి తీసు కెళుతున్నట్లు కస్టమ్స్ అధికారులు అనుమానించారు. ఖర్జూరాలు ఉన్న మూటను ఓపెన్‌చేసి పరిశీలించారు. అయితే ఆ పండ్లలో బంగారు ముక్కలను అమర్చినట్లు గుర్తిం చారు. ఒక చైన్‌కూడా బ్యాగ్‌లో ఉంది. ఖర్జూర పండ్లలో దాచిన ఆ బంగారం మొత్తం 172 గ్రాములు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసును మరింత లోతుగా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.



# ఏపిలో చురుకుగా రైలు మార్గం పనులు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త** రాష్ట్రంలోని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న రైలు మార్గం కారణంగా తెలుగు రాష్ట్రాలలో రాకపోకలు సాగించే సింహాద్రి,ఉదయ్,జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను రద్దు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. విజయవాడ రైల్వే డివిజన్‌లోని కడియం-ద్వారపుడి-అనపర్తిల మధ్య ఆటో మెటిక్ సెక్షన్‌కు సంబంధించిన నాన్-ఇంటర్ లాకింగ్ సాంకేతిక పనుల కారణంగా గుంటూరు నుంచి విశాఖపట్నం వెళ్లే నెంబర్ 17239 సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను మార్చి 1,2వ తేదీల్లో, విశాఖపట్నం నుంచి గుంటూరు వెళ్లే నెంబర్ 17240సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను మార్చి 2,3వ తేదీల్లోను,విశాఖపట్నం-గుంటూరు- విశాఖ పట్నం మధ్య తిరిగే నెంబర్ 22701 /02,ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను మార్చి 2న, విశాఖ పట్నం-లింగంపల్లి-విశాఖపట్నంల మధ్య తిరిగే నెంబర్ 12805/06 జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను మార్చి 3న రద్దు చేశారు.



## కెరీర్ ఫెయిర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపి మంత్రి లోకేష్

**విజయవాడ,ఫిబ్రవరి27,ప్రభాతవార్తప్రతినిధి:**వైజాగ్‌లోని గీతం వర్సిటీ వేదికగా వచ్చే నెలలో నిర్వహించే అతిపెద్ద కెరీర్ ఫెయిర్‌ను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. నాస్కామ్ ఫ్రైమ్ కెరీర్ ఫెయిర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ ఫెయిర్‌లో 49 టాప్ ఐటీ.. ఐటీ ఆధారిత కంపెనీలు.. ఉద్యోగుల కోసం రానున్నట్లు తెలిపారు. ఇందులో 10 వేలకుపైగా ఉద్యోగ అవకాశాలను ఏపీ యువతకు కల్పించడమే లక్ష్యంగా ఈ కెరీర్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు నారా లోకేష్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ కెరీర్ ఫెయిర్‌కు సంబంధించిన పోస్టర్‌ను గురువారం సాయంత్రం మంత్రి లోకేష్ విడుదల చేశారు. ఈ కెరీర్ ఫెయిర్‌ను ఏపీ ఉన్నత విద్యామండలి, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థతో కలిసి నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ నిర్వహిస్తున్నట్లు మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఈ కెరీర్ ఫెయిర్‌ను మార్చి 5, 6వ తేదీల్లో విశాఖలోని గీతం విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 2024, 2025 పాస్‌అవుట్ అయిన వివిధ రకాల కోర్సులు చేసిన యువత ఈ కెరీర్ ఫెయిర్ ఉపయోగపడుతుందని వివరించారు. టెక్, ఆర్ట్స్, సైన్స్, ఐటీఐ, పాలిటెక్నిక్ అండ్ డిప్లమా కోర్సులు చేసిన విద్యార్థులు ఈ కెరీర్ ఫెయిర్‌కు అర్హులని చెప్పారు. ముందుగా రిజిస్ట్రేషన్లు చేసుకుని ముందుగా వచ్చిన వారినే తొలి ప్రాధాన్యంగా తీసుకుని.. ఈ కెరీర్ ఫెయిర్ నిర్వహిస్తారని మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఇక ఈ కెరీర్ ఫెయిర్‌లో పాల్గొనాలి అనుకునే నిరుద్యోగ అభ్యర్థులు మార్చి 3వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం ఈ లింక్‌ను ఓపెన్ చేసి వివరాలు నింపాలని పేర్కొన్నారు. ఇక భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దే ఈ సదవకాశాన్ని ఏపీ యువత వినియోగించుకోవాలని ఈ సందర్భంగా నారా లోకేష్ హితవు పలికారు. ఈ యువతకు ఉద్యోగ అవకాశాలు అందించడం కోసం ఈ జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ T.G. లిమిటెడ్
ఆపరేషన్ డివిజన్ : నాగర్‌కర్నూల్
టెండర్ ప్రకటన నం. 02 / 2024-25
నాగర్‌కర్నూల్ ఆపరేషన్ సర్కిల్‌లో స్పెసిఫికేషన్ నెం. T-02/2024-25 యొక్క పనులు నిర్వహించుటకు, అర్హులైన కాంట్రాక్టర్ల నుండి ఓపెన్-టెండర్ ద్వారా సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. పూర్తి వివరాలకు: www.tgsouthernpower.com దయచేసి వీక్షించండి.
సెల్ నెం: 7901093685, 7901093693.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ : నాగర్‌కర్నూల్
DIPR.No.10696-PP/CL/Advt/1/2024-25, తేది: 27.02.2025

# కొత్త ఎక్సైజ్ పోలీస్టేషన్ల ఏర్పాటులో నిర్లక్ష్యం

**హైదరాబాద్, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త :**రాష్ట్ర ఖజానాకు ఆదాయం తీసుకు వచ్చే పలు ప్రభుత్వ విభాగాల్లో ఎక్సైజ్ శాఖ ముఖ్యమైంది.దాని నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.ఎక్సైజ్‌శాఖ నిర్వహణ సామర్థ్యాన్ని పెంచి తద్వారా మరింత ఆదాయం తీసుకు వచ్చే చర్యల్లో భాగంగా కొత్త పోలీస్టేషన్లను ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం భావించింది.దీని ఏర్పాటుతో పోలీస్టేషన్‌ల సామర్థ్యం పెరగడమే కాకుండా యువతకు ఉద్యోగ అవకాశాలు కూడా వస్తాయి. ఈ అంశాన్ని ప్రస్తుత ప్రభుత్వం పట్టించకోవడ లేదనే ఆరోపణలు వస్తున్నాయి. గ్రూప్ 4 ద్వారా ఎక్సైజ్‌శాఖకు కేటాయించిన 72 మంది అభ్యర్థులకు ఇప్పటి వరకు పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తుందనే ఆరోపణలు

### పెరుగుతున్న పనిభారం.. పట్టించుకోని అధికారులు

వినిపిస్తున్నాయి.ప్రతి సంవత్సరం సదరు శాఖ ద్వారా ప్రభుత్వానికి రూ.200 కోట్లు ఆదాయం సమకూరుతుంది.ఈ ఎక్సైజ్ పోలీస్టేషన్ల నిర్వహణలో సమస్యలు ఉన్నట్లు క్షేత్రస్థాయిలో ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఒక్కొక్క రెండుగా విభజించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 13 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక స్టేషన్ చొప్పున కొత్తగా ఏర్పాటు చేయాలని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం ఆనాడే నివేదికలు రూపొందించింది. ఆ మేరకు 2022 ఆగస్టులోనే అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది.దీంతో 13 కొత్త పోలీస్టేషన్ల కోసం ఎక్సైజ్ కమిషనర్ నివేదిక పంపగా నర్ ని, ఆర్థిక శాఖ నుంచి. కూడా అనుమతులు వచ్చాయి. ఈ లోపు ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అనంతర ప్రక్రియ నిలిచిపోయింది.

అయితే ఇంతలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.అప్పటి నుంచి అందుకు సంబంధించిన ఫైల్‌ను అధికారులు పట్టించు కోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.గత ప్రభుత్వ హయాంలో శేరిలింగంపల్లి, బాలానగర్, మల్కాజిగిరి,ఘట్కేసర్ హయత్‌నగర్, సరూర్‌నగర్, శంషాబాద్, పటాన్ చెరు, సికింద్రాబాద్, జూబ్లీహిల్స్, నాంపల్లి, హనుమకొండ ఎక్సైజ్ పరిధిలో ఒక్కో స్టేషన్‌ను అదనంగా ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి.

కొత్త ఎక్సైజ్ స్టేషన్లకు అనుమతి వచ్చి ఉంటే ప్రతిస్టేషన్‌కు ఒక సర్కిల్ ఇన్స్పెక్టర్, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్ళు, హెడ్ 12 మంది కానిస్టేబుళ్లు, ఒక జూనియర్ అని అసిస్టెంట్, ఇద్దరు అటెండర్లు,ఒక డ్రైవర్ చోప్పున మొత్తం 21 మందికి కొత్త ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉండేది. మొత్తం 14 స్టేషన్లలో కలిపి కనీసం 294 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభించేంది.అంతే కాకుండా సర్వీసులో ఉన్నవారికి పదోన్నతలు లభించే అవకాశం ఉండేది. అంతే కాకుండా మూడుళ్ళ పాటు ఒకే సీట్లో ఉన్న వారికి బదిలీలు కూడా అయ్యేవి. కొన్ని కారణాలతో ఆ ఫైల్‌ను ప్రభుత్వం పక్కన పెట్టడంతో సంబంధిత శాఖ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికయిన కొత్త పోలీస్టేషన్‌లు ఏర్పాటు చేస్తే పని భారం తగ్గడమే కాకుండా, సులభంగా పదోన్నతులు, బదిలీలు కూడా జరిగేవని ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మానసికంగా కానీ, నైతికంగా కానీ ఆధ్యాత్మికంగా కానీ ఏ విధంగా కూడా బలహీనత పనికిరాదు.

-సోక్రటీస్

# తమిళనాడు తకరారు

జాతీయ విద్యావిధానంలో త్రిభాషా సూత్రం కింద హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోమని కేంద్ర ప్రభుత్వం పెట్టిన షరతులను తమిళనాడు ప్రభుత్వం ససేమిరా అంటోంది. దాంతో కేంద్ర ప్రభుత్వం తమిళనాడు ప్రభుత్వాలమధ్య ఉప్పునిప్పుగా పరిస్థితి ఉంది. తాము ద్విభాషా సిద్ధాంతానికే కట్టుబడి ఉన్నామని హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డిఎంకె స్పష్టంచేస్తోంది. నిజానికి ఈ వాదం ఈనాటిది కాదు. తమిళ భాషా పరిరక్షణ కోసం ఎంతగానైనా పోరాడగల డిఎంకె హిందీ భాషా బోధనను తప్పనిసరి చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. భారతీయ భాషల మధ్య ఎన్నడూ శతృత్వంలేదని, ప్రతిభాష ఒక దానికొకటి సుసంపన్నం చేసిందని అఖిల భార మరాఠీ సాహిత్య సమ్మేళన్‌లో ప్రధాని మోడీ భాషా సంపన్నత, సొగసు గురించి అభివర్ణించారు. అన్ని భాషలను స్వీకరించి దురభిప్రాయాల నుంచి మనల్ని మనం దూరం చేసుకోవడం సామాజిక బాధ్యతయని ప్రధాని హితవు చెప్పారు. ఇవన్నీ తమిళనాడు వెర్సస్ కేంద్రప్రభుత్వం మధ్య ఏర్పడిన అగాధాన్ని పూడ్చటానికి వీలౌతుందన్న యోచనలో ఆయన ప్రసంగం సాగింది. 1960ల్లో తమిళనాడులో పెద్దఎత్తున భాషా ఉద్యమం జరిగింది. ఆనాటి నుంచి హిందీ భాషపై వ్యతిరేకత పెరిగింది. త్రిభాషా సూత్రాన్ని అన్ని రాష్ట్రాల్లోనూ తప్పనిసరిగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఏనాడో హుకుం జారీ చేసింది. అయినా ఇటు డిఎంకె, అటు కేంద్ర ప్రభుత్వం ఎవరి పట్టు వారువిడవకుండా ఉన్నారు. ఒకరి వాదనను ఒకరు వినే పరిస్థితిలో లేరు. కొంత కర్ణాటకలోనూకన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ నేతృత్వంలో కన్నడ భాషాభిమానులు ఉద్యమించారు. కానీ ఎందుకో చల్లారిపోయింది. తెలుగు ప్రజలు తమ భాషాభిమానాన్ని మరో రూపంలో చాటుకుని మూలాల్లోకి తమ వాదనను తీసుకెళ్లి నెగ్గించుకున్నారు. తెలుగు వెలుగును దశదిశలా చాటాలనుకునే రీతిలో తెలుగును ప్రాచీన భాషగా గుర్తించాలనే డిమాండ్‌తో ఆందోళనలు చేసింది. ప్రాచీన భాషాహోదా సాధించుకుంది. దాంతో తెలుగు భాషాభిమానుల ఆకాంక్ష తీరినట్లే కనపడుతోంది. త్రిభాషా సూత్రం పట్ల తాము సానుకూలంగా లేమనే సాకుతో కేంద్రం తమకు ఇవ్వదగిన నిధులలో కోత పెట్టిందని తమిళనాడు ముఖ్యమంత్రి చెప్పకనే చెబుతు న్నారు. కాగా 2014 నుంచే ఇంతవరకు తమిళనాడుకు నిధుల కేటాయింపులో ఎలాంటి వివక్ష చూపలేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వివరిస్తున్నారు. అయినప్పటికీ వచ్చే యేడాది తమిళనాడులో ఎన్నికలురానున్న దృష్ట్యా ఒకరిపై ఒకరు ఆరోపణలు ఇలాగే ఉంటాయని సరిపెట్టు కోవచ్చు. కానీ హిందీ భాష అమలు విషయంలో తమిళనాడు, కేంద్రాల మధ్య చిచ్చుమాత్రంఈనాటిది కాదు. హిందీ భాషను ఒత్తిడి చేసి తమ మీద రుద్దరాదన్న ఆందోళనల విషయంలో తమిళనాడు ప్రజలుకూడా సమ్మతించే స్పష్టమైన విధానం ఉన్నందున డిఎంకె ఇప్పటికీ ఆ విధానాన్ని విడనాడలేదు. ఈ వివాదంపై కేంద్రం ప్రస్తావన తెచ్చినప్పుడల్లా రాష్ట్రాలు మెళకువలోకి వస్తున్నాయి. ప్రస్తుతం కన్నడ, తెలుగు రాష్ట్రాలకు హిందీ భాష ఒత్తిడి లేనందువల్ల ఈ వివాదంలో ఆయా రాష్ట్రాలు జోక్యం చేసుకునే పరిస్థితి లేదు. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం నిధుల కేటాయింపులో అన్యాయం చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవలనే విమర్శలు గుప్పించారు. తమిళనాడులో జాతీయ విద్యావిధానం2020ని పూర్తిగా అమలు చేసి త్రిభాషా విధానాన్ని ఆమోదించే వరకు తమిళనాడుకు సమగ్ర శిక్షా పథకం కింద నిధులు మంజూరు చేయలేమని కేంద్ర విద్యాశాఖ మంత్రి ఖరాఖండిగా చెప్పడంతో పాత వివాదం మళ్లీ చెలరేగిందని చెప్పాలి. 2024-25సంవత్సరానికి తమిళనాడుకు అందాల్సిన రూ. 2152 కోట్లను విడుదల చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ రాసిన లేఖ తదనంతర పరిణామాలివి. సమగ్ర శిక్షా పథకం నిధులు విడుదల చేయకుంటే ఉపాధ్యాయులకు వేతనం, విద్యార్థులకు సంక్షేమ పథకాలు ఆగిపోతాయని స్టాలిన్ ప్రధానికి రాసిన లేఖ అనంతరం మంత్రి స్పందించారు. 'వడ్లగింజలో బియ్యపుగింజ'న్నట్లు తమిళనాడు, కేంద్రం మధ్య వివాదంలో 'త్రిభాషా' వ్యవహారానికి సంబంధించి, నిధుల విడుదల నిలిపి వేతకు తోడుగా త్వరలో జరుగబోయే నియోజకవర్గాల పునర్విభజనలో తమ రాష్ట్రంలో నియోజకవర్గాలు తగ్గిపోతాయని ముఖ్యమంత్రి స్టాలిన్ తాజా ఆవేదనకూడా చోటుచేసుకుంది. దీనిని జవాబుగా దామాషా విధానంలో చేపట్టే పునర్వ్యవస్థీకరణ వల్ల తమిళనాడులో లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య తగ్గే అవకాశమే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. తమిళనాడుకే ఇదిలా ఉండగా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త పల్లవి అందుకోవడంతో దానికి కూడా అమిత్‌షా సమాధానం ఇచ్చినట్లయింది. దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగబోదంటూ ప్రధాని మోడీ పార్లమెంట్‌లోనే ప్రకటించినా దక్షిణాదిన ఎన్డీయేతర పార్టీలకు పలుసందేహాలున్నాయి. జనాభా ప్రాతిపదికన జరిగే పునర్విభజనవల్ల లోక్‌సభ స్థానాలు తగ్గుతాయనే అంశంలో ఇతర దక్షిణాది రాష్ట్రాలకూ ఆందోళన ఉంది. డీలిమిటేషన్ వల్ల తమిళనాడు లోక్‌సభ సీట్లసంఖ్య 39నుంచి 31కి తగ్గిపోతుం దని స్టాలిన్ ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 'దక్షిణాదికి అన్యాయం' అనే నినాదంతో తమిళనాడు ప్రభుత్వం మార్చి 5న ఆల్‌పార్టీ సమావేశం ఏర్పాటు చేయనున్నందున కేంద్రం నష్టనివారణ చర్యలకు సంకల్పించింది.



నౌకకు అండగా నిల్చే నీళ్లే ఒక్కోసారి నౌకను తల్లకిందులు కూడా చేయగలవు.

తిరుక్కురళ్



పని చేయడానికి లంచం అడగడమే అవినీతి కాదు. జీతం తీసుకొని సక్రమంగా పనిచేయకపోవడం కూడా అవినీతే.

హెన్రీఫోర్డ్


# యువత విజ్ఞాన శిఖరాలను అధిరోహించాలి

**సైన్స్ ప్రపంచ గమనాన్ని మార్చేసింది. మూఢ నమ్మకాల వలన అభివృద్ధి అడుగంటుతుందని, శాస్త్ర విజ్ఞానం సమాజాన్ని పురోగతిలో నడిపిస్తుందని నిరూపిత మైనది. ఎంతో మంది తమ ప్రాణాలను బలిపెట్టి, సైన్స్‌కు పట్టిన గ్రహణాన్ని తొలగించారు. తమ పరిశోధనా ఫలితాలతో జన జీవనాన్ని సమూలంగా మార్చేశారు. సైన్స్ కారణంగా ప్రపంచంలో ఎన్నో ఆవిష్కరణలు జరిగాయి. సౌకర్యవంతమైన జీవన విధానం అలవడింది. భారత దేశంలో సైన్స్ సాధించిన ప్రగతి, ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక యుగం వరకు భారతీయ శాస్త్రవేత్తలు సాగించిన కృషి, పోషిస్తున్న పాత్ర అనిర్వచనీయమైనది.**



సుంకవల్లి సత్తిరాజు

మన చుట్టూ ఎంతో విజ్ఞానం నిగూఢమై ఉంది. ఆసక్తి వలన మాత్రమే విజ్ఞానం వెలికి తీయబడుతుంది. అన్ని విషయాలను కూలంకషంగా పరిశీలించి, పరిశోధించి, మస్తిష్కంలో జనించే ప్రశ్నలకు అర్థవంతమైన సమాధానాలు రాబట్టి, పరిశోధనా ఫలితాలను అర్థవంతంగా అన్వయించి, పలు ఆవిష్కరణలతో మానవ జీవితాన్ని సౌకర్యవంతంగా మార్చే ప్రక్రియను'సైన్స్' లేదా 'విజ్ఞాన శాస్త్రం'గా నిర్వచించవచ్చు. అనుభవాల ద్వారా, అధ్యయనం ద్వారా, వాస్తవాల ద్వారా అజ్ఞానాన్ని ఛేధించి, జ్ఞానాన్ని వెలికితీసే ఒక ప్రయోగాత్మక పద్ధతి సైన్స్. వంటచేయడం, గృహాలు నిర్మించుకోవడం, ఆయుధాలను తయారు చేయడం... ఇలా ఒకటేమిటి ప్రతీ ఆలోచన అర్థవంతమైన ఫలితాలకు దారితీసిన క్రమంలో సైన్స్ కీలక భూమిక పోషించింది. సైన్స్ అంటే నిజం. మన కళ్లెదుట కనిపించే ప్రత్యక్ష సాక్ష్యం సైన్స్. వర్తమాన ప్రపంచంలో మనం అనుభవిస్తున్న సౌకర్యవంతమైన జీవితానికి మూలం సైన్స్. నింగి, నేల, నిప్పు, నీరు, కాంతి అన్నింటా విజ్ఞానమే అగుపిస్తుంది. ప్రతీ విషయాన్ని ఆకళింపు చేసుకుంటే అంతా జ్ఞానమే. పరిశోధిస్తే అంతటా విజ్ఞానమే తాండవమాడుతుంది. వెయ్యి సంవత్సరాల పాటు భూమి ఈ విశ్వానికి కేంద్రమని నమ్మడమే కాకుండా, సూర్యుడితో పాటు గ్రహాలు, నక్షత్రాలుకూడా భూమి చుట్టూ తిరుగుతాయని పేర్కొంటూ ఈజిప్టుకు చెందిన ఖగోళశాస్త్రవేత్త టోలెమీ "జియో సెంట్రిక్ థియరీ" ని ప్రతిపాదించాడు. 16 వ శతాబ్దం వరకు మనం నివసిస్తున్న భూమి ఈ విశ్వాన్ని శాసిస్తున్నదని నమ్మడం జరిగింది. కాలక్రమంలో ఈ ప్రతిపాదన అవాస్తవమని, సూర్యుడు విశ్వానికి కేంద్రమని నికోలస్ కోపర్నికస్ "హీలియో సెంట్రిక్ థియరీ" ద్వారా నిరూపించాడు. నేడు నిజమనుకునినమ్మిన అంశం కొంతకాలానికి నిజం కాకపోవచ్చు. పరిశోధనలు, ఆధారాలు సత్యాసత్యాలకు కొలమానాలు. ఒకప్పుడు భూమి బల్లపరుపుగా ఉందని భావించేవారు. కాలక్రమంలో భూమి గుండ్రంగా ఉందని నిరూపితమైనది. సూర్యుడు ఒక పెద్ద నక్షత్రమని, నవగ్రహాలు లేవని కేవలం ఎనిమిది గ్రహాలే విశ్వంలో తిరుగుతున్నాయని సైన్స్ నిరూపించింది. ప్లూటోను నవ గ్రహాల జాబితాలో నుంచి తొలగించి, అదొక మరుగుజ్జు గ్రహంగా అభివర్ణించారు. ఎన్నో పరిశోధనల ద్వారా కొత్త కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిరంతర పరిశోధనా ఫలితాలే సైన్స్ మనుగడను సుస్థిరం చేస్తున్నాయి. మనిషికీ, జంతువుకీ మధ్య వ్యత్యాసం లేని రాతి యుగం నాటి మానవ ప్రస్థానం నుండి ఆధునిక మానవ పరివర్తనం వరకు అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. నేడు మనం అనుభవిస్తున్న సైన్స్ ఫలాల వెనుక ఎంతటి చరిత్ర ఉందో గమనించాలి. నాటి మూఢవిశ్వాసాల నుండి దుర్మార్గాల నుండి ప్రజలను కాపాడడానికి ఎంతో మంది శాస్త్రవేత్తలు అహరహం శ్రమించారు. తమ జీవితాలను పణంగా పెట్టి ప్రజల జీవితాల్లో విజ్ఞాన కాంతులను విరబూయించారు. సైన్స్‌కు, మోఢ్యానికి మధ్య జరిగిన సంఘర్షణలో ఎంతోమంది శాస్త్రవేత్తలు ఎన్నోశిక్షలకుగురైనారు. ఎంతో మంది నిర్దాక్షిణ్యంగా హతులైనారు. నిజం చెబితే ద్రోహంగా పరిగణించడం, పరిశోధనలు చేస్తే కఠిన శిక్షలు అమలు చేయడం వంటి అత్యంత దారుణమైన పరిస్థితులున్న నాటికాలంలో తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా వదిలేసి, శాస్త్రీయ ఫలితాలతో రాబోయే తరాలకోసం శ్రమించిన, అలనాటి శాస్త్రవేత్తల చరిత్రను పరిశీలించి, శాస్త్రీయ కోణంలో ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. టెలిస్కోప్‌ను కనిపెట్టి, కోపర్నికస్ సూర్య కేంద్ర సిద్ధాంతానికి





మద్దతునిచ్చాడనే అభియోగంతో గెలిలియోకు నాటిసమాజం దైవద్రోహం పేరుతో, యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. వాస్తవాలను వివరించిన గెలిలియో శిక్షాకాలం లోనే మరణించాడు. విశ్వం అనంతమైనదని, ఇతర గ్రహాల్లో కూడా జీవం ఉండే అవకాశాలున్నాయని, సూర్యుడు విశ్వానికి కేంద్రమని ఆధునిక విజ్ఞానానికి పునాదులు వేసిన 'బ్రూనో' నాటి మత పెద్దల కోపాగ్నికి గురయ్యాడు. శాస్త్రీయ దృక్పథానికి ప్రాధాన్యత నిచ్చే కోణంలో ఆలోచించాలని పేర్కొంటూ, సత్యం కోసం పోరాడిన బ్రూనో ఒక గొప్ప తత్వ, గణిత శాస్త్రవేత్త. ఆయన సత్యశోధనకు అప్పటి మతమోఢ్యం అనేక సంవత్సరాలు జైలు శిక్ష విధించింది. అయినా సత్యపథాన్ని విడనాడక పోరాడిన బ్రూనోను కర్కశంగా సజీవ దహనం చేసారు. బ్రూనో సజీవ దహనమైనా అతని ఆలోచనలు సజీవంగానే ఉన్నాయి. గ్రీకు తత్వ వేత్త, విజ్ఞానగని సోక్రటీస్‌ను కూడా నిజాలను నిర్భయంగా చెప్పినందుకు విషమిచ్చి చంపారు. ఇలా ఒకరుకాదు, ఎందరో, మరెందరో నాటి మత పెద్దల మూఢనమ్మకాలకు బలైపోయి, ప్రపంచానికి తమ త్యాగాల ద్వారా సైన్స్ వెలుగులను ప్రసాదించారు. శాస్త్రీయ పరిశోధనా ఫలితాలను అనుభవిస్తూ, సైన్సును తప్పుబట్టడం అవివేకం, అజ్ఞానం. భారతీయ ప్రతిభ అణగ ద్రొక్కబడుతున్న కాలంలో తన ఆలోచనా పరిధిని సైన్స్‌కు జతపరచి, ఆధునిక శాస్త్రవిజ్ఞానంలో, భౌతికశాస్త్రంలో అంతుబట్టని విషయాలను తన మేథస్సుతో, అతి తక్కువ ఖర్చుతో పరిశోధనలు చేసి సత్ఫలితాలు సాధించి భారత ఖ్యాతిని ఇనుమడింప చేసిన చంద్రశేఖర్ వెంకటరామన్ చిన్న వయసులోనే భౌతికశాస్త్రంలో బంగారు పతకంసాధించి, భౌతిక శాస్త్రంపట్ల మొక్కవోని మక్కువ ప్రదర్శించాడు. భౌతిక శాస్త్ర అధ్యాపకుడిగా పని చేసిన తన తండ్రిప్రభావం రామన్ పై విశేషంగా చూపించింది. చిన్న వయసులోనే కాంతికి సంబంధించిన వివిధ అంశాలపై, తీవ్రంగా అధ్యయనం చేసి, కాంతి ధర్మాలను విశ్లేషించి "రామన్ ఎఫెక్ట్"కు ఊపిరి పోసాడు. సముద్రాలు నీలిరంగు సంతరించుకోవడానికి కారణం సముద్రపు నీటిపై పడే కాంతి కిరణాల్లో నీలిరంగు అధికంగా పరిక్షేపం చెంది, మన కంటికి చేరడమే. సర్. సి.వి రామన్ పరిశోధనల్లో వెల్లడైన ఈ వాస్తవాన్ని రామన్ ఎఫెక్ట్ లేదా రామన్ స్కాటరింగ్ అంటారు. మొదట్లో రామన్ ఆలోచనలను, సిద్ధాంతాలను హేళన చేసిన శాస్త్ర ప్రపంచం తుదకు ఆయన పరిశోధనలను ధృవీకరించడం జరిగింది. భారతీయ శాస్త్ర ప్రతిభ ప్రపంచ పటంలో సగర్వంగా తలెత్తుకు తిరిగింది. నోబెల్ బహుమతి పొందిన మొదటి భారతీయ శాస్త్రవేత్తగా చరిత్ర సృష్టించాడు. ఇంతటి ప్రతిభగల శాస్త్రవేత్తను స్మరించుకోవడం మన కనీసబాధ్యత. ఒకప్పటికీ, ఇప్పటికీ సైన్స్‌ను గుర్తించడంలోను, సైన్స్ ద్వారా చేకూరిన ఫలితాలను అనుభవించడంలోను గణనీయమైన మార్పులొచ్చాయి. సైన్స్ లేనిదే మానవ మనుగడ లేదు. ఇది అక్షర సత్యం. అయితే విజ్ఞాన శాస్త్ర ఫలాలను ఆరగిస్తూ, అందుకు కారణమైన శాస్త్రవేత్తల కృషిని మరవడం క్షంతవ్యం కాదు. సైన్స్ ప్రపంచ గమనాన్ని మార్చేసింది. మూఢనమ్మకాల వలన అభివృద్ధి అడుగంటుతుందని, శాస్త్ర విజ్ఞానం సమాజాన్ని పురోగతిలో నడిపిస్తుందని నిరూపితమైనది. ఎంతో మంది తమ ప్రాణాలను బలిపెట్టి, సైన్స్‌కు పట్టిన గ్రహణాన్ని తొలగించారు. తమ పరిశోధనా ఫలితాలతో జన జీవనాన్ని సమూలంగా మార్చేశారు. సైన్స్ కారణంగా ప్రపంచంలో ఎన్నో ఆవిష్కరణలు జరిగాయి. సౌకర్యవంతమైన జీవన విధానం అలవడింది. భారత దేశంలో సైన్స్ సాధించిన ప్రగతి, ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక యుగం వరకు భారతీయ శాస్త్రవేత్తలు సాగించిన కృషి, పోషిస్తున్నపాత్ర అనిర్వచనీయమైనది. ఎంతో మంది శాస్త్రవేత్తలు భారతీయ ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పి, గుర్తింపు తెచ్చారు. యువతను సైన్స్ దిశగా ప్రోత్సహించడానికి, శాస్త్ర విజ్ఞానం పట్ల అవగాహన పెంపొందించడానికి రామన్ చేసినస్ఫూర్తి ఎంతగానో దోహదం పడుతుంది. జీవించి, మరణించడం సహజ ప్రక్రియ. మరణించినా చరిత్రలో సజీవంగా మిగలడం కొంతమందికే సాధ్యం. అటువంటి ప్రతిభావంతుల్లో సర్.సి.వి. రామన్ అగ్రగణ్యుడు. భౌతిక శాస్త్రంలో అవిశ్రాంత కృషిసల్పి దేశానికి ఎనలేనికీర్తిప్రతిష్టలు సంపాదించి పెట్టిన సి.వి.రామన్‌స్ఫూర్తి యువవిద్యార్థులకు, వర్తమాన యువ శాస్త్రవేత్తలకు ఆదర్శం కావాలనే ధ్యేయంతో రామన్ పరిశోధనలను ప్రపంచం అధికారికంగాగుర్తించిన ఫిబ్రవరి 28 వ తేదీని భారత ప్రభుత్వం "నేషనల్ సైన్స్ డే" గా నిర్వహిస్తున్నది. దేశం ఆర్థికంగా ఎదగాలంటే యువత విజ్ఞాన శాస్త్ర రంగంలో పురోగతి సాధించాలి. •

# ఢిల్లీ కాలుష్య చెరువులో కమలం వికసించేనా!

పూసాల సత్యనారాయణ

దేశ రాజధానిని కాలుష్య కొండచిలువ చుట్టేసి ఎముకలు పిండి పిండి చేసి ధారపడుతుంటే చావు కేకలు వినిపించడంలేదా! ఈ దృశ్యం భూగోళమంత స్క్రీన్‌పై మనుషులంతా శతాబ్దాలుగా వీక్షించుతున్న మన పాలకులకు మాత్రం పట్టడం లేదు. గతంలో సుప్రీం కోర్టు సీరియస్‌గా తీసుకొని ప్రభుత్వాలకు చురకలంటించినా కదలిక లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం. కాలుష్య రహితవాతావరణంలో జీవించడం ప్రతి భారతీయుడి ప్రాథమిక హక్కు. అందుకు తగిన చర్యలు చేపట్టాల్సినఅవసరం ఎంతేని ఉంది. ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రమాణాలను పాటించింది ఎక్కడా ! కాలుష్య నివారణ చర్యలకు ఖర్చు చేయవలసిన నిధులు దారులు తప్పుతున్నాయని సోషల్‌మీడియా కోడై కూసినా, జనం ఫిర్యాదు చేసినా పాలకులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. ప్రార్థనా మందిరాలకు మహాకుంభ మేళాలకు కోట్లు ఖర్చుపెట్టడానికి నిధులు మాత్రం ఊటలు ఊరుతాయి. మనిషి జీవిత కాలం తగ్గించడం తప్ప పెరిగింది అంత కన్నా లేదు. గుడ్డి మూఢనమ్మకాలను విడనాడి విజ్ఞాన స్పృహ కలిగి ఉంటే నిప్పు లాంటి నిజాలు తెలుస్తాయి. ఆర్థిక క్రమశిక్షణ తుంగలోతొక్కి జనాకర్షణ ఉచిత పథకాలు ప్రవేశపెట్టి ఆదాయానికి మించిన ఖర్చులుచేసి ప్రభుత్వ ఖజానా ఖాళీచేయడమే కాకుండా అప్పులు చేసి మోయలేనంత వివిధరకాల పన్నులు ప్రజలపై రుద్ది అధికారంకొరకు రాజకీయాలు చేస్తున్నారు. అర్జంట్ పనులుపక్కకు పెట్టి అన్‌వాంటెడ్ పనులపై ఎగబడుతున్నారు. శ్వాస ఆడకుండా చేసే కాలుష్యాన్ని ఎందుకు తరిమికొట్టడడంలేదు. అందుకే 'ఇది యదార్థవాది లోకవిరోధి' అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఎందుకు ఉన్నట్లు. సంస్కృతి ,సంప్రదాయాల ముసుగులో కులమతాలలో చిచ్చురగిలించి మూఢనమ్మకాలను చిగురింప చేసే ప్రభుత్వ రథసారథులు ఉన్నంతవరకు మానవీయ విలువలు తగ్గడమేకాక దేశంలో ఆకలి చావులు కూడా తప్పడం లేదు. క్రిమినల్ కేసులలో జైల్‌కుపోయి వచ్చినోట్లతో ఓట్లనుకొని చట్టసభలోకి అడుగుపెట్టిన వారికి రాజ్యాంగం గురించి ఏమితెలుసు! ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసే వారికి శాస్త్రీయ దృక్పథం ఎక్కడా! పిల్లికి ఎలుకమీద కన్నుఉన్నట్లు నాయకులకు డబ్బు సంపాదనపైనే దృష్టిఅంతే మరి. ప్రజాసంక్షేమం వారికెందుకు? మేడ్ ఇన్ ఇండియా అన్న నినాదంతో ముందుకెళ్లే ప్రధానమంత్రిపరిశోధనసంస్థలకు నిధులెందుకు కేటాయించడం లేదు. యువతను ప్రోత్సహించి కొత్తఆవిష్కరణలకు శ్రీకారం చుడుతున్నారా? భూగోళంపై నివసించే మానవాళిని కాలుష్యం నుండి రక్షించితే అంతకంటే ఇంకేముంది. సంక్షేమం, పార్ల మెంట్ భవనాలను, రాష్ట్రపతి నిలయాలను, గేట్ వే ఆఫ్ ఇండియాను ఎర్రకోటను కాలుష్యం చుట్టుముట్టి ఊపిరి ఆడకుండా చేస్తున్నా ఇవేమీ పట్టించుకోవడం లేదు. భారతదేశ గొప్పతనాన్ని చాటడానికి ఏముంది? హిందూ భావజాలంతప్ప. సామాన్య మానవుడికి కావల్సింది రోటీ, కపడా, ఔరమ్‌ఖాన్. అంతేకాని సంస్కృతి సంప్రదాయం లేకుండా బతకలేమా! గుడ్డివానికి కళ్లుకావాలి విలాసాలు వారికెందుకు? స్వచ్ఛమైన దేశంలో స్వచ్ఛమైన గాలిపీల్చుకొంటే కొంతకాలమైన ఊపిరి ఉంటుం దేమో అన్న చిన్నిఆశ ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేయాలి. అప్పుడే కమలాలు వికసించి కన్నుల పండుగగా దేశమంతా ఆనంద నాట్యం చేస్తాయి. •

# ప్రజావాక్కు



### ఐక్యత ముఖ్యం

రెండువేల ఇరవై నాలుగు లోక్‌సభ ఇండియా కూటమి పార్టీలు ఐక్యంగాపనిచేసి మంచిఫలితాలను సాధించాయి. అధికారంలోకి రాలేకపోయినా బిజెపిని నిలువరించగలిగాయి. ఆపార్టీకి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే పరిస్థితులు లేకుండా చేశాయి. అదే అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి ఆ పార్టీ విచ్ఛిన్నమైపోయింది. పరస్పరం విమర్శించుకున్నాయి. ఎవరికి వారు ఒంటరిగా పోటీ చేసి బిజెపికి అవకాశం కల్పించాయి. వీరి తీరుమారకుంటే భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ బిజెపికే అవకాశం కలుగుతుంది. ఇండియా కూటమిలోని పార్టీలకు పుట్టగతులు లేకుండాపోతాయి.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### బస్సులకు అనుమతి ఇవ్వాలి

హన్మకొండ జిల్లా నయీమ్‌నగర్ పెద్ద మోరీపై ఏడు కోట్లతో నిర్మితమైన బ్రిడ్జి పనులు పూర్తయి ఆటోలు, కార్లు, ప్రైవేట్ వాహనాలు నెలరోజులనుండి రాకపోకలు సాగిస్తున్నాయి. కానీ అధికారులు ఆర్టీసీబస్సులను ఈ బ్రిడ్జి మీద నుండి నడపకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. హనుమకొండ నుంచి నిజామాబాద్, ఆదిలాబాద్, సిద్ధిపేట, సిరిసిల్ల, కరీంనగర్ వేములవాడకు వెళ్లే బస్సులు వయా ములుగు రోడ్డు పెద్దమ్మ గడ్డ హనుమాన్ నగర్ నుండి వెళ్లడం వల్ల అదనంగా డబ్బులు చెల్లించడంతోపాటు సమయం అంతా వృధా అవుతుంది. బ్రిడ్జి పనులు పూర్తయి అన్ని వాహనాలు నడుస్తుంటే ఆర్టీసీ బస్సులు ఎందుకు అనుమతించడం లేదో అర్థంకావడం లేదు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి నయీమ్ నగర్ బ్రిడ్జి మీద నుండి బస్సులు నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలి.

- కామిడి సతీష్‌రెడ్డి, భూపాలపల్లిజిల్లా

### చెట్లను పెంచాలి

మనదేశంలో ఏడుగురికి ఒక చెట్టు ఉండాల్సి ఉండగా ఏడువందల మందికి ఒకటి ఉంది. దీన్నిబట్టి పరిస్థితి ఎంత తీవ్రంగా ఎంతదారుణంగా ఉందో అందరూ ఊహించుకోవాలి. ఇకనైనా పర్యావరణ పరిరక్షణ కోసం పచ్చదనాన్ని పెంపొందించడం కోసం అందరూ చెట్లను పెంచాలి. వచ్చేది ఎండాకాలం.

- మా.శ్రీ.రాజు, పాల్వంచ

### తస్మాత్ జాగ్రత్త

అవినీతి మరకలు అంటిన నాయకులను ప్రజలు ఎప్పటికిప్పుడు తిరస్కరిస్తున్నారు. ఓటు ఆయుధంతో సమాధానం చెబుతున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలను యేడాది క్రితం కెసిఆర్‌ను నిన్నగాక మొన్న కేజ్రీవాల్‌ను పదవుల నుంచి దింపేసి ఇంటి ముఖం పట్టించారు. ఇప్పుడు పాలన చేస్తున్న కొన్ని ప్రభుత్వాలు వీరిని చూసి బుద్ధి తెచ్చుకోవాలి. తమ హయాంలోఅవినీతి జరక్కకుండా జాగ్రత్త పడాలి. అధికారంలో ఉన్నాం కదా అందినంతా దండుకుందాం అనుకుంటే కుదరదు. చేసిన అవినీతి పనులు ఎప్పుడో అప్పుడు బయటపడక తప్పదు. ప్రజలు అన్ని గమనిస్తుంటారనే విషయాన్ని రాజకీయ నాయకులు మరిచిపోకూడదు.

-మిథునం, హైదరాబాద్

### పెరుగుతున్న మధుమేహం

దేశంలోపెరిగిపోతున్న మధుమేహం ,గ్యాస్ట్రిక్ వ్యాధుల తగ్గుదలకువాడుతున్న స్టెరాయిడ్, అసిడిటీ వగైరా మందులు నాణ్యత పరీక్షలో నిర్ణీత ప్రమాణాలు లేవని సంబంధిత సంస్థ తేల్చి చెప్పింది. దీనితో 84రకాల ఇతర మందులు కూడా ఉన్నవి. జీవిత కాలం వాడాల్సిన మందు కారణం ఏదైనా నాణ్యత లేనిది వాడకం జరిగితే ,ఉన్న రోగం తీవ్రత తగ్గక కొత్త రోగం రావొచ్చు. క్లినికల్ ట్రయల్స్ పక్కగా ఉండాలి. తర్వాతే వాటి విడుదల. ధర ఎక్కువైనా మందు పనితీరు బాగుంటే దేవుని వరం పొందినట్లు. కొత్త మార్గదర్శకాలు అన్ని స్థాయిలలో సరిగా ఉంటేనే తప్ప శాస్త్రజ్ఞులు కనుగొన్న మందుకోసం, కృషి ,కష్టము, ఖర్చు మనకు సద్వినియోగం అయినట్లు. ఆ రీతిలో ముందు జాగ్రత్తలు అత్యావశ్యకం.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### ప్రజాధనం వృధా

రాజ్యసభ, శాసనమండలి వలన ప్రజాధనం వృధా అని లోక్‌సభ సభ్యులుశశిథరూర్ పేర్కొన్నారు. ఎగువ సభలు రాజకీయ నిరుద్యోగులకు పునరావాసం కేంద్రంగా మారాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో శాసన మండలి వ్యవస్థ లేదు. తెలివైన వారు శాసన మండలి వ్యవస్థను కోరుకోరు అని ప్రొ. సాల్క్ క్రిస్టల్ నాథన్ పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ఎగువ సభ వ్యవస్థని రద్దు చేయాలి. ప్రజాధనాన్ని కాపాడాల్సిన బాధ్యత పాలకులపై ఎంతో ఉంది. పాలకులే ఇలా ప్రజాధనాన్ని ఖర్చు చేస్తే ప్రజలను పట్టించుకునేదెవరు?

- పుట్లూరి రాంనర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వ్యవస్థ ఏదైనా ధనవంతులే పాలకులా?

పుల్లెంల గణేష్

నేటి ఆధునిక సమాజంలో ఏ దేశ చరిత్ర చూసిన ధనవంతులే పాలకవర్గంలో ఉంటున్నారు. నిరుపేదలు పాలితులుగానే ఉంటున్నారు. అది పెట్టుబడిదారీ వ్యవస్థతో కూడిన దేశమైనా, ప్రజాస్వామ్య దేశమైనా, కమ్యూనిస్టు భావాలు కలిగిన దేశమైనా ఏ సిద్ధాంత విలువలతో ప్రభుత్వాలు నడిచినా ఆఖరికి పాలకులుగా మాత్రం కోటీశ్వరులే. తమ అధిపత్యాన్ని చూపిస్తున్నారని సమకాలిన రాజకీయ పరిస్థితులను బట్టి నిరూపణ కాబడుతుంది. మొన్నటికి మొన్న ప్రపంచానికి పెద్దన్నగా పేరుగాంచిన అమెరికా దేశ ఎన్నికలను చూస్తే ప్రతి అభ్యర్థి కూడా లక్షల కోట్ల ధనం ఉన్న వ్యక్తులే పోటీచేశారు. అమెరికా నూతన అధ్యక్షుడైన డొనాల్డ్ ట్రంప్ కోట్ల ధనం ఉన్న బడా వ్యాపార వర్గం నుండి వచ్చిన వ్యక్తి కావడం గమనార్హం. ఇక అభివృద్ధిలో రెండో అతి పెద్ద దేశమైన చైనా పాలన వ్యవస్థని పరిశీలిస్తే చైనాలో కమ్యూనిజం సిద్ధాంతంతో పాలన ఉన్నప్పటికీ లక్షల కోట్లు ఉన్న జిన్ పింగ్ అధ్యక్షుడిగా ఉండి, చైనా పాలన వ్యవస్థ కొనసాగుతూ సామాన్యులు పాలితులుగా ఉంటున్నారు. ఇక మరో అతి పెద్ద కమ్యూనిస్టు దేశమైన రష్యాని తీసుకుంటే అక్కడ కూడా లక్షలకోట్లు ఉన్న వ్లాదిమిన్ పుతిన్ దేశ అధ్యక్షుడు ఎన్నో యేండ్లుగా తన ఆధిపత్యాన్ని చూపిస్తున్నాడు. ఇలా ఏ ఆధునిక దేశ రాజకీయాల్ని పరిశీలించిన అతి కటిక పేదరిక దేశమైన పాలకులు మాత్రం కోట్లధనం ఉన్న వ్యక్తులే. ఆయా దేశ పాలనవ్యవస్థలో అధిపత్యాన్ని చూపిస్తున్నారు. ఇక ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ప్రజాస్వామ్య గణతంత్ర దేశమైన భారతదేశ రాజకీయాల్ని క్షుణ్ణంగా గమనిస్తే మనదేశంలో రెండు వైరుధ్యాలతో కూడిన పాలకులు చలమనవుతున్నారు. భారతీయ సామాజిక కులవ్యవస్థలో జనాభాలో అత్యల్ప శాతం ఉన్న అగ్రవర్ణ సమాజం నుండి కోటీశ్వరులుగా ఉన్న వ్యక్తులే పాలకులుగా అవుతున్నారు. తాజాగా జరిగిన ఢిల్లీ ఎన్నికల ప్రక్రియని గమనిస్తే పోటీ చేసినఅభ్యర్థులంతా కోట్ల ధనం ఉన్నవారే కావడం గమనార్హం. అంతేకాకుండా ఢిల్లీమంత్రిమండలిలో మొత్తం కోటీశ్వరులైన వ్యక్తులే ఉన్నారు. కానీ భారతదేశం ఏమో ఉన్నతమైన విలువలతో కూడిన అతిపెద్ద లిఖిత రాజ్యాంగం కలిగిన ప్రజాస్వామ్య గణతంత్ర దేశం. ప్రజాస్వామ్యం అనగా ఏంటి? మాజీ అమెరికా అధ్యక్షుడు అబ్రహం లింకన్ ప్రకారం ప్రజలకొరకు ప్రజల చేత ప్రజలే ఎన్నుకునే వ్యవస్థని ప్రజాస్వామ్య దేశంగా భావిస్తారు. ఇక గణతంత్రదేశం అనగా దేశ సమస్త సంపదలో రాజ్యంలో భూభాగంలో ప్రతి తలకి సమాన వాటా పంపిణీ చేసుకునే విలువలు కలిగిన రాజ్యాన్ని గణతంత్ర రాజ్యాంగా భావిస్తాము. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రపంచంలో ఏ దేశానికి లేని అత్యున్నతమైన భారత రాజ్యాంగాన్ని రాసి మనకి అందించారు. కానీ దేశంలో తరతరాలుగా సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా సాంస్కృతికంగా అత్యల్ప శాతం ఉన్న అగ్రవర్ణాలచేత దోపిడికి గురవుతున్న కటిక పేదలైన సామాన్యులైన 90శాతం పైగా ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలే రాజ్య సింహాసనం మీద కూర్చోవలని పాలకులుగా నాయకులుగా



కావాలని భారత రాజ్యాంగ ఆత్మ తెలుపుతుంది. అందుకు నిదర్శనమే లక్షల కోట్ల ధనవంతులు అయినప్పటికీ కూడు, గుడ్డ, ఇల్లు లేని నిరుపేదలైనవారికి కూడా సరి సమానంగా ఓటు ఉంటుంది. అంటే కోటీశ్వరుడైన, నిరుపేద వ్యక్తి ఐన ఒక మనిషికి ఒకటే ఓటు, ఒకటే విలువ ఉంటుంది. కాబట్టి ప్రజాస్వామ్య గణతంత్ర దేశమైన భారతదేశంలో సామాన్యులు కూడా సింహాసనం మీద కూర్చోని రాజ్యపాలన చేయొచ్చనని అంబేద్కర్ రాజ్యాంగం తెలుపుతుంటే, అందుకు పూర్తి విరుద్ధంగా దేశాన్నిపాలిస్తున్న ఏపార్టీ వ్యక్తులైన లక్షల కోట్లు ఉన్న భూస్వామ్య పెట్టుబడిదారీ ఆధిపత్య భావజాలాన్ని సమర్థించే వారే నాయకులుగా పాలకులుగా అవుతున్నారు. మరి అంబేద్కర్ భారత రాజ్యాంగం ఏమో సామాన్యులే సింహాసనం మీద కూర్చొని పాలించాలని చెప్తుంటే అందుకు పూర్తి వ్యతిరేకంగా లక్షల కోట్లు ఉన్న భూస్వామ్య పెట్టుబడిదారీ ఆధిపత్య భావజాలం ఉన్న వ్యక్తి పాలకుడు ఐతే నిరుపేదలైన సామాన్యులైన తరతరాలుగా దోపిడీకి గురవుతున్న అత్యధిక శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీల మేలు కోరుతారా.? సామాన్యులకి మౌలిక సదుపాయాలు ఐన విద్య వైద్యం ఉపాధి ఇల్లు భూమి దొరకకుండా నిరుపేదల్ని మరింత పేదరికంలోకి నెట్టివేసేలా ప్రణాళికలు రచిస్తాడు. ఎందుకనగా పెట్టుబడిదారి భూస్వామ్య అధిపత్య భావాలని సమర్థించే అమలు చేసే వ్యక్తి సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక పరివర్తనకి బద్ధ వ్యతిరేకిగా ఉంటాడు కాబట్టి, నిరుపేదల జీవితాలు అభివృద్ధి పరచడంలోనిబద్ధతని మానవత్వాన్ని చూపించలేడు. ఎందుకంటే లక్షలకోట్లు ఖర్చుపెట్టి ఎన్నికల్లో గెలిచిన వ్యక్తి తాను ఖర్చు చేసిన లక్షల కోట్లు ఏ విధంగా తిరిగి సంపాదించుకొని తన వ్యాపార సామ్రాజ్యాన్ని కాపాడుకోవడానికి ప్రణాళికలు పథకాలు రచిస్తాడు కానీ నిరుపేదలని సింహాసనం మీద కూర్చోబెట్టడానికి ప్రణాళికలు రచించడు కదా! నిరుపేదలని సింహాసనం మీద కూర్చోబెట్టే వ్యక్తిఐతే భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య, గణతంత్ర భావాలకి వ్యతిరేకంగా ఎన్నికల్లోనే పోటీ చేయడుకదా..! భారత దేశంలో వర్గబేధం కన్న అన్ని తారతమ్యాలని అత్యధికంగా ప్రభావితం చేసేదిమొదటి సామాజిక రుగ్మత మాత్రం కులం అనేది జగమెరిగిన సత్యం. మరి భారతదేశంలో రాజ్యం సంపద భూమి సమస్త రంగాల్లో ఆధిపత్యం ఎవరిది ఉన్నది అనేది క్షుణ్ణంగా పరిశీలిస్తే, ఎవరు అవునన్నా కాదన్నా లక్షల కోట్లుఉన్న భూస్వామ్య పెట్టుబడిదారి ఆదిపత్య భావజాలం ఉన్న అగ్రవర్ణాలదే అనేది అనేక సర్వేల ప్రకారం నిరుపితమవుతుంది. ఏదో అంబేద్కర్ భారత రాజ్యాంగ పుణ్యమా ఎస్సీ ఎస్టీలకి రాజకీయ రిజర్వే షన్లు ఉండబట్టి కొందరు నిరుపేదలైన ఎస్సీ ఎస్టీ వ్యక్తులు ఎమ్మెల్యే, ఎంపీలుగా గెలువ గలుగుతున్నారు. ఇక సామాన్యులైన నిరుపేదలైన ఒబిసిలు భారతీయ సమాజంలో దా దాపు 60శాతం ఉన్నప్పటికీ రాజకీయ రిజర్వేషన్లు లేకపో వడం మూలంగా వారి జనాభా దామాషా ప్రకారంఎమ్మెల్యే, ఎంపీ సీట్లలో తగిన వాటాని పొందలేకపోతున్నారు. ఓటుబలం లేని అగ్రవర్ణాలు ధనబలంతో ఓటు బలమున్న బీసీ, ఎస్సీ, ఎస్టీల ఓట్లు కొనుగోలుచేసి ఎన్నికల్లో గెలిచిన తర్వాత అదేఅగ్రవర్ణ నాయకులు బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి వ్యతిరేకంగానే తమ ప్రణాళికలు రచిస్తారు. ఎందుకంటే నిరుపేద లైన బీసీ ఎస్సీ ఎస్టీలు ఎల్లప్పుడు ఓట్లు అమ్ముకుంటేనే కోటీశ్వరులైన దేశంలో సామాజిక రాజకీయఆర్థికసాంస్కృతిక విప్లవం వచ్చేలా అత్యున్నత చట్టాలు రాగలవు తద్వారామాత్రమే సామాజిక పరివర్తన సాధ్యమవుతుంది. అప్పుడే దేశంలో సామాజిక అసమానతలు పోయి భారత రాజ్యాంగ ఆత్మచెప్పున్న విధంగా స్వేచ్ఛ సమానత్వ సోదరభావ ప్రజాస్వామ్య గణతంత్ర విలువలతో కూడిన మానవ అభివృద్ధి సూచీలో, అభివృద్ధిలో ముందుండే విధంగా భారతదేశాన్ని చూడగలం. •

# అక్రమవలసదారులంతా క్రిమినల్సే..


## వారిపై సానుభూతి చూపించనక్కర్లేదు: కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్



**ఛండీగర్, ఫిబ్రవరి 27:** అమెరికాలో అక్రమ వలసదారులుగా ముద్రపడి ఆదేశ విమానంలోనే భారత్‌కు వచ్చిన వలసదారులను నేరస్తులని వారంతా క్రిమినల్స్ అని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ చేసిన వ్యాఖ్యలు ఇపుడు సర్వత్రా విమర్శలు ఎదురవుతున్నాయి. వారిపట్ల మనం ఎంతమాత్రం సానుభూతి చూపించ కూడదని కూడా చేసిన వ్యాఖ్యలు వైరల్ కావడంతో ఆయనపై మండిపడుతున్నారు. ఎవరు ఏదేశంలో అక్రమంగా ప్రవేశించినా వారంతా క్రిమినల్సే నని వారిపట్ల మనం సానుభూతి చూపించాల్సిన అవసరం లేదన్నారు. మనం వారిస్తున్న కొందరు ఆదేశానికి ఇలా అక్రమ రూట్లలో వెళుతున్నారని ఇదొక డ్రగ్స్ అలవాటులా మారిందని అలాంటివారిపట్ల మనం ఎందుకు సానుభూతి చూపించాలని మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ప్రశ్నించారు. అమెరికాలో అక్రమవలసాదరులపట్ల అక్కడి పోలీసులు అనుసరించిన వైఖరిపై ప్రశ్నించిన మీడియాకు మంత్రి ఈతరహాలో వ్యాఖ్యలు చేయడం విస్మయం కలిగించింది. తిరిగి వచ్చిన వారికి ఎలా పునరావాసం కల్పించాలన్నది కూడా ఇపుడు చిక్కుసమస్యగానే ఉంటుందన్నారు. ఏ రూటులో వారిని వెనక్కి పంపించినా ఇపుడు వారికి పునరావాసం కల్పించడం మన బాధ్యత అని ఖట్టర్ అన్నారు. అమెరికాలో పత్రాలులేని భారతీయులపట్ల అనుసరిస్తున్న ఆమానవీయ చర్యలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జోక్యంచేసుకోమని చెప్పడంపై నిరసనలు వ్యక్తం అవుతున్న సంగతి తెలిసిందే.

ఈక్రమంలోనే మంత్రి ఖట్టర్‌చేసిన వ్యాఖ్యలు ఇపుడు బిజెపిపై వ్యతిరేకతను పెంచుతున్నాయి. మొత్తం ఇప్పటి వరకూ 333 మంది అక్రమ వలసదారులను అమెరికా వెనక్కి పంపించేసింది. వీరిపట్ల అమెరికా మానవహక్కుల ఉల్లంఘనకు పాల్ప డిందని, అయినా కేంద్రంజోక్యం చేసుకో లేదన్న వాదనలు వస్తున్నాయి. హర్యానాలోని కర్నాల్ ప్రాంతం సమీపంలోని డబ్రీ గ్రామం నుంచే 300 మంది యువత ఇలా డంకీ రూటులోనే వెళ్లారని అన్నారు. పార్లమెంటు ఎన్నికల సమయంలో తాను ఆగ్రామం సందర్శించి ఆశ్చర్యానికి లోనయ్యానన్నారు. ఆగ్రామంలో ఒకే ఒక్క వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నాడన్నారు.

ఇలా డంకీ రూట్లలో వెళ్లడం అనేది చట్ట విరుద్ధమని, తిరిగి వస్తారన్న గ్యారంటీ కూడా ఉండదన్నారు. వచ్చేనెల 2వ తేదీ మున్సిపల్ ఎన్నికల ఓటింగ్‌ఉన్న క్రమంలో ఖట్టర్ వ్యాఖ్యలు ప్రభావం చూపిస్తాయని బిజెపి భావిస్తోంది. మొత్తం 113 మంది అక్రమంగా వలసలు వెళ్లారని వారంతా వెనక్కి వచ్చారు. హర్యానాలోని అంబాలా, కురు క్షేత్ర, కర్నాల్, కైథాల్, హిసార్ ప్రాంతాలకు చెందినవారే ఉన్నారు. ఒక్కొక్కరూ 40 లక్షలు, 70 లక్షలుకూడా వెచ్చించారు. ఇద్దరు మైనర్ల కోసం కురుక్షేత్రలోని ఒక కుటుంబం 1.20 కోట్లరూపాయలు వెచ్చించిందంటే అమెరికా పిచ్చి ఏస్థాయిలో ముదిరిపోయిందోనని తెలుస్తోంది.



## తుర్కియేలో రష్యా, అమెరికా దౌత్యవేత్తల భేటీ!

**వాషింగ్టన్, ఫిబ్రవరి 27:** అమెరికా, రష్యాలు శాంతి చర్చల దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాయి. ఇరు దేశాలకు చెందిన కీలక దౌత్యవేత్తలు నేడుతుర్కియేలో భేటీఅయ్యారు. ఇందుకు అమెరికా రాయబార కార్యాలయం వేదికగా మారింది. రష్యా అధికారుల బృందం అక్కడకు చేరుకుంది. ఇరు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపరచుకొనేందుకు చేస్తున్న యత్నాల్లో భాగంగా వాషింగ్టన్, మాస్కోలోని దౌత్య కార్యాలయాల్లో ఉన్న వివాదాలను ఈ సందర్భంగా చర్చించుకొన్నారు. దౌత్య సిబ్బంది ఇరు దేశాల్లో పనిచేసే వాతావరణంపై చర్చించనున్నారు. దీనిలో ఉక్రెయిన్, ఇతర రాజకీయ, భద్రతా పరమైన అంశాలను చేర్చలేదు. ఈ చర్చలపై అమెరికా విదేశాంగశాఖ మాట్లాడుతూ ఈ చర్చలు చాలా నిర్మాణాత్మకంగా కనిపిస్తున్నాయి. అసలు సమస్యలు పరిష్కారం అవుతాయా? లేదా అన్నది తేలిపోతుంది. దీంతోపాటు రష్యా మంచి ఉద్దేశంతోనే చర్చలకు వచ్చిందా అనే విషయం కూడా తెలుస్తుంది అని పేర్కొంది. మరోవైపు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీవ్ లవ్రోవ్ మాట్లాడుతూ తమ దేశ దౌత్య వేత్తలకు మెరుగైన పరిస్థితులను కల్పించేందుకు ఈ చర్చలు జరుగుతున్నాయన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధ్యక్ష కార్యాలయంలో అడుగుపెట్టిన అయిదు వారాల్లోనే భౌగోళిక రాజకీయ పరిస్థితులు మారిపోయాయి. రష్యా అధినేత పుతిన్‌తో ఫిబ్రవరి 12న ఫోన్‌కాల్‌లో మాట్లాడారు. ఆ తర్వాత 18వ తేదీన సౌదీ అరేబియాలో అత్యున్నత స్థాయి దౌత్యవేత్తలు, మంత్రులు భేటీ అయ్యారు. ఈ పరిణామాలతో కీవ్, ఐరోపా సమాఖ్య మిత్రులు అప్రమత్తమయ్యారు. ఉక్రెయిన్‌లో శాంతి కోసం ట్రంప్ శరవేగంగా తీసుకొంటున్న చర్యలపై పుతిన్ ఈ వారం స్పందించారు. అమెరికా, రష్యాల మధ్య విశ్వాసాన్ని పునరుద్ధరించకపోతే ఏమీ సాధించలేరని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో తాజాగా ఇరుదేశాలు దౌత్యస్థాయిలో సమస్యల పరిష్కారానికి తుర్కియేలో భేటీ అయ్యాయి. ఇక రష్యాతోకూడా ట్రంప్ ఖనిజాల డీల్ చేసుకొంటారన్న వార్తలు వెలువడుతుండడంతో ఈ చర్చలకు ప్రాధాన్యం పెరిగింది.

## అయుధాలు స్వచ్ఛందంగా అప్పగిస్తున్న మెయితీ మిలిటెంట్లు!

**ఇంపాల్, ఫిబ్రవరి 27:** మైయిటీ వర్గం ప్రజలను ఎస్టీజాబితాలో చేర్చాలని మొదలయిన ఆందోళన చివరకు ముఖ్యమంత్రి గద్దెదిగి రాష్ట్రపతి పాలన వరకూ వచ్చిన మణిపూర్‌లో ఇపుడు తాజాగా మిలిటెంట్లు స్వచ్ఛందంగా వచ్చి ఆయుధాలను అప్పగిస్తున్నారు. వారం రోజుల్లోగా మిలిటెంట్లు తమవద్ద ఉన్న దోచుకున్న ఆయుధాలను అప్పగించాలని, అలాచేస్తే వారిపై ఎలాంటిచర్యలు తీసుకోబోమని, లేనిపక్షంలో కఠిన చర్యలకు సిద్ధం కావాల్సిందేనని గవర్నర్ అజయ్ కుమార్ భల్లా హెచ్చరించడంతోమిలిటెంట్లు భారీ ఎత్తున వచ్చి స్వచ్ఛందంగా ఆయుధాలను సరెండర్ చేస్తున్నారు. రాష్ట్రంలోని ఆరుజిల్లాల్లో 104 తుపాకులు మందుగుండు సామగ్రిని ప్రభుత్వానికి సరెండర్‌చేసారు. ప్రభుత్వదళాలనుంచి అక్రమంగా లూటీచేసిన ఆయుధాలను వారం రోజుల్లోగా సరెండర్‌చేయాలని ఈనెల 20వ తేదీ ఇచ్చిన గవర్నర్ సూచనకు స్పందన భారీ స్థాయిలోనే వచ్చిందని పోలీసులు భద్రతా దళ అదికారులు తెలిపారు. గురువారం అరంబై తెంగోల్ గ్రూపుసభ్యులు ఆయుధాలను అప్పగించారు. తమ షరతులను అంగీకరిస్తే ఆయుధాలు సరెండర్ చేస్తామని మైయిటీ గ్రూప్ వెల్లడించింది. ఆ సంస్థ పిఆర్‌వో రాబిన్ మాన్‌గంగ్ కవైరక్‌పార్, గ్రూపు తరపున గవర్నర్‌ను కలిసారు. ఆయుధాల అప్పగింతకు గడువు వెల్లడించలేదు. గవర్నర్ భల్లాకు అరంబై తెంగోల్ మెమొరాండం అందించింది. మెజార్టీ మైయిటీ వర్గానికి ఎస్టీ హోదా ఇవ్వాలని ఆలేఖలో డిమాండ్ చేసారు.

# ఆప్ ఎమ్మెల్యేలను అడ్డుకున్న పోలీసులు

### ఢిల్లీ అసెంబ్లీ చరిత్రలో ఇలాంటి దారుణం ఎన్నడూ చోటుచేసుకోలేదు

### తీవ్రంగా స్పందించిన మాజీ సిఎం అతిశీ!



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ సమావేశాల వేళ బిజెపి సర్కార్‌పై ప్రతిపక్ష ఆమ్ ఆద్మీ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ ప్రాంగణంలోకి రానివ్వకుండా బారికేడ్లు పెట్టి మరీ అడ్డుకుంటున్నారని ఆరోపించింది. ఈ మేరకు మాజీ సిఎం, శాసనసభా ప్రతిపక్ష నేత అతిశీ ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై మండిపడ్డారు. బిజెపి నేతలు అధికారంలోకి రాగానే నియంతృత్వంలో అన్ని హద్దులు దాటేశారు. సభలో జై భీమ్ అనే నినాదాలు చేసినందుకు మా పార్టీ ఎమ్మెల్యేలను మూడు రోజులపాటు సస్పెండ్ చేశారు. ఇప్పుడు విధాన సభ ప్రాంగణంలోకి రాకుండా మమ్మల్ని అడ్డుకుంటున్నారు. ఢిల్లీ అసెంబ్లీ చరిత్రలో ఇలాంటి దారుణం ఎన్నడూ చోటుచేసుకోలేదు అని ఆమె దుయ్యబట్టారు. మద్యం కుంభకోణంపై కాగ్ నివేదికను నిరసిస్తూ ఇటీవల ఆప్ ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో అతిశీ సహా 21 మంది ప్రతిపక్ష సభ్యులను మూడు రోజలపాటు సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే అతిశీ సహా పలువురు ఆప్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ వద్దకు రాగా పోలీసులు అడ్డుకున్నారు. స్పీకర్ ఉత్తర్వుల నేపథ్యంలో లోనికి వెళ్లేందుకు అనుమతి లేదని తెలిపారు. దీంతో మాజీ సిఎం వారితో వాగ్వాదానికి దిగారు. అనంతరం ఎక్స్ వేదికగా బిజెపి సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. మద్యం కుంభకోణంపై గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న 14 కాగ్ నివేదికలను బిజెపి సర్కార్ అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఆమ్ ఆద్మీ ప్రభుత్వం హయాంలో 2021, 22లో తీసుకొచ్చిన మద్యం విధానం కారణంగా ఢిల్లీ ప్రభుత్వానికి రూ.2000 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కాగ్ తేల్చింది. నిపుణుల అభిప్రాయాలు తీసుకోకపోవడం, ఫిర్యాదులు వచ్చినా బిడ్డింగును అనుమతించడం, ఉల్లంఘనలకు జరిమానా వేయకపోవడం, విధానాల రూపకల్పనలో పారదర్శకత లేకపోవడం వంటివి చోటుచేసుకున్నాయని తెలిపింది. ఈ నివేదికను ఆప్ ఖండిస్తోంది.

# వైట్‌హౌస్ ప్రవేశంపై మీడియాకు ఆంక్షలు

### ట్రంప్ తొలి కేబినెట్ సమావేశం

**వాషింగ్టన్, ఫిబ్రవరి 27:** అమెరికా అధ్యక్ష బాధ్యతలుచేపట్టిన తర్వాత డొనాల్డ్‌ట్రంప్ మొదటిసారిగా కేబినెట్ సమావేశం నిర్వహించారు. ఈ భేటీని కవర్‌చేసేందుకు కొన్ని మీడియా సంస్థలపై వైట్‌హౌస్ ఆంక్షలు పెట్టింది. వారిలో రాయిటర్స్, అసోసియేటెడ్‌ప్రెస్, హఫ్‌పోస్ట్ వంటి పలు సంస్థల రిపోర్టర్లు, ఫోటోగ్రాఫర్లను ఓవల్ ఆఫీస్‌లోనికి వెళ్లనీయలేదు. కొత్త విధానాలకు లోబడే వారిని అనుమతించలేదని శ్వేతసౌధం వెల్లడించింది. ఓవల్ ఆఫీస్ వంటి చిన్న చిన్న ప్రదేశాల్లో ఏఏ మీడియా సంస్థలు కవర్‌చేయాలన్న దానిపై వైట్‌హౌస్ నిర్ణయం తీసుకుంటుందని ట్రంప్‌యంత్రాంగం ప్రకటించింది. ఏబిసి, న్యూస్‌మ్యాక్స్, బ్లూంబర్గ్, ది బ్లేజ్, యాక్సియోస్, ఎన్‌పిఆర్‌సంస్థ ప్రతినిధులను మాత్రమే అనుమతించారు. వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ మాట్లాడుతూ ట్రంప్ రోజువారి మీడియా మీట్ కవర్‌చేసేందుకు సాంప్రదాయ సంస్థలన్నింటినీ అనుమతిస్తున్నామని, కానీ స్థలాభావం కారణంగా కొన్ని ఆఫీసుల్లోకి మాత్రం అందరినీ పంపించడం లేదన్నారు. వీటిపై మీడియా సంస్థలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేసాయి.

# మాకు ఉపన్యాసాలిచ్చే స్థాయిలో పాకిస్థాన్ లేదు

### ఐరాసలో దాయాది దేశం ఆరోపణలకు భారత్ ఘాటు స్పందన



**జెనీవా, ఫిబ్రవరి 27:** అంతర్జాతీయ వేదికలపై తరచూ పాకిస్థాన్ భారత్‌పై తన అక్కసు వెళ్లగక్కుతూనే ఉంది. తాజాగా జమ్మూకాశ్మీర్‌లో ప్రజాస్వామ్యం అణచివేతకు గురవుతోందని, మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిలో దాయది దేశం ఆరోపించింది. ఈ ఆరోపణలను భారత్ ఖండించింది. అంతేకాక.. మాకు ఉపన్యాసాలు ఇచ్చేస్థాయిలో ఆ దేశంలేదని స్పష్టంచేసింది. జెనీవాలో జరిగిన ఈ సమావేశంలో జమ్మూకాశ్మీర్‌ను ఉద్దేశించి పాక్ న్యాయ, మానవ హక్కుల మంత్రి అజం నజీర్ తరార్ వ్యాఖ్యలు చేశారు. దీనిపై భారత రాయబారి క్షితిజ్ త్యాగి ధీటుగా స్పందించారు. 'కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకాశ్మీర్, లద్ధాఖ్‌లు ఎప్పుడూ భారత్‌లో అంతర్భాగమే. దశాబ్దాల తరబడి పాకిస్థాన్ ఉగ్రవాదం కారణంగా దెబ్బతిన్న ఆ ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. మానవ హక్కుల ఉల్లంఘన, మైనారిటీలను హింసించడంతో సహా ప్రజాస్వామ్య విలువలను పాటించని దాయాది దేశం భారత్‌కు ఉపన్యాసాలు ఇచ్చే స్థాయిలో లేదు. ఆ దేశ వాక్‌చాతుర్యంలోనే కపటత్వం కన్పిస్తోంది. ఐరాస జాబితాలోని పలు ఉగ్రవాద సంస్థలకు ఆ దేశం ఆశ్రయం కల్పిస్తోంది. ప్రజాస్వామ్య పురోగతి, ప్రజలకు గౌరవం కల్పించడం వంటి వాటిపై భారత్ దృష్టి సారిస్తుంది. ఆ దేశంచ మాపై ఆరోపణలు చేయడం మానేసి.. తమ దేశంలోని ప్రజలకు సుపరిపాలనను అందించడంపై దృష్టి పెట్టాలి' అని త్యాగి పేర్కొన్నారు.

ఇక, ఇటీవల చైనా అధ్యక్షతన జరిగిన భద్రతామండలి సమావేశంలోనూ పాకిస్థాన్ విదేశాంగ మంత్రి మహమ్మద్ ఇషక్ దార్ జమ్మూకాశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. దీనికి సైతం భారత్ ఘాటుగా స్పందించింది. జైషే మహమ్మద్ వంటి సంస్థలను ప్రోత్సహించే పాక్.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పడం అత్యంత హాస్యాస్పదమని ఆగ్రహం వ్యక్తం చేసింది.

# ట్రంప్‌ను కెనడాలోకి రానీయొద్దు

### ఎన్‌డిపి నేత జగ్మీత్‌సింగ్ పిలుపు



**ఒట్టావా, ఫిబ్రవరి 27:** కెనడా ప్రతిపక్ష ఎన్‌డిపి (నేషనల్ డెమోక్రటిక్ పార్టీ) నేత, ఖలిస్థానీ సానుభూతిపరుడు జగ్మీత్‌సింగ్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను నేరస్థుడిగా అభివర్ణించారు. ఆయనను జి-7 సదస్సు కోసం కెనడా భూభాగంపై అడుగుపెట్టనీయకుండా బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. ట్రంప్‌పై గతంలో నేర నిర్ధారణ జరిగిన అంశం, ప్రపంచ దేశాలకు ఆయన బెదరింపులను ఇందుకు ఓ కారణంగా పేర్కొన్నారు. బుధవారం జగ్మీత్‌సింగ్ మాంట్రియాల్ కౌన్సిల్ ఆఫ్ ఫారెన్ రిలేషన్స్ సమావేశంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

'ట్రంప్‌ను జి-7 సమావేశాల్లో పాల్గొనకుండా నిషేధం విధించాలని నేను నమ్ముతున్నాను. ఆయనను ఇక్కడికి పిలవకూడదు. నేరనిర్ధారణ జరిగిన వ్యక్తిని మన దేశంలోకి ఎందుకు రానివ్వాలి. మన ప్రజాస్వామ్యానికి, సార్వభౌమత్వానికి ముప్పుగా మారి, మన ఆర్థిక వ్యవస్థను, మన మిత్రులను, ప్రపంచాన్ని బెదరించిన వ్యక్తిని ఎందుకు అనుమతించాలి. డొనాల్డ్ ట్రంప్‌ను ఎలా అడ్డుకోవాలి అన్న దానిపైనే నేటి సమావేశం' అని వ్యాఖ్యానించారు. ట్రంప్‌ను ఆపేందుకు జి-7 వేదికను వాడుకోవాలని కెనడా ప్రభుత్వాన్ని, మిత్రదేశాలను ఆయన అభ్యర్థించారు. ఆయనను ఎదుర్కోడానికి మెక్సికో, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వంటి భావ సారూప్యత ఉన్న దేశాలతో జట్టు కట్టాలన్నారు. అత్యాధునిక ఆయుధాలతో కెనడా సైన్యాన్ని బలోపేతం చేయడానికి ఎన్‌డిపి మద్దతు ఇస్తుందన్నారు.

సింగ్ ప్రకటనపై ఇప్పటివరకు కెనడా ప్రభుత్వం స్పందించలేదు. ప్రధాని కార్యాలయ ప్రతినిధి సైమన్ లాఫార్చ్యూ స్పందిస్తూ దీనిపై తాము ఎటువంటి వ్యాఖ్యలు చేయబోమని వెల్లడించారు. ఇక ఇంధనశాఖ మంత్రి జోనాథన్ విల్కిన్సన్ మాట్లాడుతూ జగ్మీత్ ప్రతిపాదనలో అంతగా విషయం లేదన్నారు. అంతేకాదు.. ఆలోచించి సలహాలు చెప్పేవారిని తాము కొత్త అడ్వైజర్లుగా నియమించుకోమని హితవు పలికారు. అంతేకాదు.. ట్రంప్ చేసిన వ్యాఖ్యల్లో చాలావరకు తనకు కోపం తెప్పించాయన్నారు. అదే సమయంలో కలిసి పనిచేసే మార్గాలను వెతకాలని సూచించారు. 'మనం తెగదెంపులు చేసుకొని సముద్రంలో మరోచోటుకు వెళ్లిపోలేము కదా. వారు మన పొరుగువారు. కలిసే ముందుకెళ్లాలి' అని ఆయన పేర్కొన్నారు. జూన్ 15 నుంచి 17 వరకు అల్బర్టాలో జి-7 సమావేశాలు జరగనున్నాయి.



# చంద్రునిపైకి డ్రోన్!

### ఓ ప్రైవేటు కంపెనీ అరుదైన ప్రయోగం

**కేప్ కెనవెరాల్, ఫిబ్రవరి 27:** అంతరిక్ష రేసులో ప్రైవేటు భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేసేందుకు అమెరికా కీలక చర్యలు చేపడుతోంది. మరోసారి మానవసహిత జాబిల్లి యాత్ర చేపట్టేందుకు సిద్ధమైన నాసా.. అంతకంటే ముందు చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్‌కు వరుసగా ప్రయోగాలు చేస్తోంది. తాజాగా చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద దిగేలా ఓ ప్రైవేట్ కంపెనీ అభివృద్ధి చేసిన లూనార్ ల్యాండర్‌ను ప్రయోగించింది. దీని ద్వారా జాబిల్లిపై సూర్య కిరణాలు ఎన్నడూ పడని ఓ బిలంపైకి డ్రోన్‌ను పంపించేందుకు ప్రణాళిక చేసింది.

ఇంట్యూటివ్ మెషీన్స్ సంస్థ అభివృద్ధి చేసిన అథీనా ల్యాండర్‌ను స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్‌లో పంపించింది. నాసా కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి దూసుకెళ్లిన ఈ రాకెట్.. మార్చి 6న చంద్రుడి ఉపరితలంపై దిగేలా రూపొందించారు. 15 అడుగుల ఎత్తయిన ఈ అథీనా ల్యాండర్.. దక్షిణధ్రువానికి 100మైళ్ల దూరంలో ల్యాండ్ అయ్యేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ ప్రాంతం జెట్ బ్లాక్ బిలానికి కేవలం 400 మీటర్ల దూరంలోనే ఉంటుంది.

చంద్రుడిపై సూర్యకిరణాలు ఎన్నడూ పడని ప్రాంతంగా జెట్ బ్లాక్ బిలాన్ని అభివర్ణిస్తారు. ఈ బిలంపైకి 'గ్రేస్' అనే డ్రోన్‌ను పంపించడమే అథీనా ల్యాండర్ మిషన్ లక్ష్యం. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ దిగ్గజం గ్రేస్ హోపర్ గుర్తుగా ఈ డ్రోన్‌కు ఆయన పేరు పెట్టారు. మూడు అడుగులు ఉంటే ఈ డ్రోన్.. జాబిల్లి ఉపరితలంపై మూడు కీలక పరీక్షలు నిర్వహించనుందట. ఇందులో హైడ్రోజన్ ఫ్యుయెల్డ్ థ్రస్టర్లను ఉపయోగించారు. దీంతో డ్రోన్ ఎగురుతుంది. నావిగేషన్ కోసం కెమెరా, లేజర్లను ఏర్పాటు చేశారు. డ్రోన్ ఎగురుతుండగా దీనిలోని పరికరాలు జాబిల్లి ఉపరితలాన్ని అన్వేషిస్తాయి.

ఈ ల్యాండర్‌తోపాటు ఫాల్కన్ 9 రాకెట్‌లో లూనార్ ట్రయల్‌బ్లేజర్ స్పేస్‌క్రాఫ్ట్‌ను కూడా నాసా చంద్రుడిపైకి పంపించింది. ఇది చంద్రుడి కక్ష్యలో తిరుగుతూ జాబిల్లిపై నీడ జాడను అన్వేషిస్తుందని నాసా వెల్లడించింది.

# హిందీవల్లే ఉత్తరాదిలో 25 భాషల కనుమరుగు

### తమిళనాడు సిఎం స్టాలిన్ ధ్వజం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, తమిళనాడులోని అధికార పార్టీ డిఎంకెలమధ్య హిందీభాషపరంగా మాటల యుద్ధమే నడుస్తోంది. తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్ మరో వివాదానికి తెరలేపారు. హిందీ కారణంగా 25 ఉత్తరభారతీయ భాషలు కనుమరుగైపోతున్నాయని విమర్శించారు. గురువారం ఆయన తన సోషల్ మీడియాలో పోస్టుపెడుతూ ఇతర రాష్ట్రాల సోదరసోదరీమణులారా హిందీ కారణంగా ఎన్ని భారతీయ భాషలు కనుమరుగయ్యాయో ఎప్పుడైనా ఆలోచించారా అని ప్రశ్నించారు. 100 ఏళ్లలో ఉత్తం భారతంలో 25 భాషలు కనుమరుగయ్యాయి. భోజ్‌పూరి మైథిలీ, బుందేలి గర్వాలీ, కుమావోని, మాగాహి, మార్వారీ, మాల్వీ, ఛత్తీస్‌గఢీ, సంథాలి, అంజికా ఇలా అనేక భాషలు మనుగడకోసం ఎదురుచూస్తున్నాయని అన్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలు హిందీ రాష్ట్రాలు కావని, వాటి అసలుభాషలు గతంలో కలిసిపోయాయన్నారు. తమిళనాడుకు అలాంటి పరిస్థితి రాకూడదనే ప్రతిఘటిస్తున్నామని జాతి, సంస్కృతిని నాశనం చేయడానికి భాషలపై దాడి చేస్తున్నారని స్టాలిన్ వెల్లడించారు. జాతీయ విద్యావిధానం ఎన్‌ఇపిలో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం వెల్లడించింది. తాము ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డిఎంకె ప్రభుత్వం స్పష్టంచేస్తోంది. తమిళభాషకు రాష్ట్రానికి ప్రజలకు నష్టంకలిగించే చర్యలను అనుమతించబోమని స్టాలిన్ అన్నారు. దీనిపై గత కొన్ని రోజులుగా మాటల యుద్ధం నడుస్తోంది. మరోవైపు బిజెపి డిఎంకెలమధ్య వివాదం చిన్నపిల్లల కొట్లాటలా ఉందంటూ టివికె అధ్యక్షుడు నటుడు విజయ్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

# రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలో భారతీయ విద్యార్థిని

### అత్యవసర వీసా కోసం తండ్రి దరఖాస్తు

### అనుకూలంగా స్పందించిన అమెరికా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** కోమాలో ఉన్న భారతీయ విద్యార్థిని కుటుంబం అభ్యర్థనపై అమెరికా నుంచి స్పందన వచ్చింది. భారత ప్రభుత్వం సంప్రదింపుల నేపథ్యంలో వీసా ఇంటర్వ్యూకు యూఎస్ అవకాశం కల్పించింది. వీసా కోసం బాధితురాలి తండ్రి చేస్తోన్న ప్రయత్నాలు తమ దృష్టికి రావడంతో భారత విదేశాంగ శాఖ అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అగ్రరాజ్యం సానుకూలంగా స్పందించింది. వీసా లేక అత్యవసర ప్రయాణానికి అనుమతి ఇవ్వాలంటూ భారత విదేశాంగశాఖకు చెందిన అమెరికా విభాగం అక్కడి ప్రభుత్వాన్ని సంప్రదించినట్లు సమాచారం. కాలిఫోర్నియా యూనివర్సిటీలో పిజీ చేస్తోన్న నీలమ్ శిండే ఫిబ్రవరి 14న రోడ్డు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. కారు ఢీకొనడంతో శిండే తల, ఛాతి భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఉంటున్న ఆమె కుటుంబానికి ఫిబ్రవరి 16న ఈ విషయం తెలిసింది. నీలమ్ తండ్రి వెంటనే వీసా కోసం దరఖాస్తు చేసుకున్నా అది ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఎన్‌సిపి ఎంపి సుప్రియాసూలె చేసిన పోస్టు ద్వారా ఆ కుటుంబం ఆవేదన అందరి దృష్టికి చేరింది. నీలమ్ శిండే అనే విద్యార్థి యుఎస్‌లో ప్రమాదానికి గురై అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా కుమార్తె వద్దకు వెళ్లేందుకు ఆమె తండ్రి ప్రయత్నిస్తున్నారు. ఆయన అత్యవసర వీసా కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు సహాయం చేయాలని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్, భారత దౌత్య కార్యాలయాన్ని కోరుతున్నా అని ఎంపి సుప్రియా సూలె ఎక్స్ వేదికగా కోరారు.



# పారిశుధ్యకార్మికులతో సిఎం యోగి సహపంక్తి భోజనం



**ప్రయాగరాజ్, ఫిబ్రవరి 27:** ప్రయాగరాజ్‌లో 45రోజులపాటుసాగిన మహాకుంభ్ మహాశివ రాత్రితో ముగిసింది. ఈ క్రమంలో గురువారం రాష్ట్రముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ త్రివేణి సంగమంలోని అరైల్‌ఘాట్‌వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోటులో ప్రయాణంచేసి గంగా హారతిలో పాల్గొన్నారు. యూపి కేబినెట్ మొత్తం ఈ కార్యక్రమంలో పాల్గొన్నది. డిప్యూటి సిఎం బ్రజేశ్‌పాఠక్, కెపి మౌర్యలతోపాటు మంత్రులు కూడా ఉన్నారు. ఆ తర్వాత పారిశుధ్య కార్మికులతో కలిసి సిఎం యోగి సహపంక్తిభోజనం చేసారు. లంచ్‌లో మంత్రులు పోలీసులు అధికారులు కూడా పాల్గొన్నారు. మహాకుంభ్‌లో పాల్గొన్న శానిటేషన్ హెల్త్‌వర్కర్లకు పదివేల బోనస్ ఇస్తున్నట్లు సిఎం యోగిప్రకటించారు. ఏప్రిల్ నెలనుంచి శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనం 16వేలు అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తాత్కాలిక హెల్త్‌వర్కర్లకు నేరుగా నగదును బ్యాంకు ఖాతాలకు బదిలీచేయనున్నట్లు చెప్పారు. ఆ కార్మికులకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యబీమా వసతి కల్పిస్తామన్నారు.

## రైతులకు అందుబాటులో 10.36 లక్షల టన్నుల యూరియా

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** ప్రస్తుత యాసంగి 2024-25 సీజన్లో ఇప్పటి వరకు 10.36 లక్షల టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంచడం జరిగినదని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు రైతులు 9.21 లక్షల టన్నుల యూరియా ఎరువులను కొనుగోలు చేసారని చెప్పారు. హైదరాబాద్ సచివాలయంలో గురువారం సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు వరకు 1.08 లక్షల టన్నుల యూరియా నిల్వ వుందని వివరించారు. రాష్ట్రానికి కావలసిన ఎరువులను ఎప్పటికప్పుడు రైతులకు సరఫరా చేసేటందుకు కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు చేస్తున్నట్టు తెలిపారు. వివిధ కంపెనీలకు చెందిన సుమారు 41 వేల టన్నుల యూరియా రాష్ట్రానికి రానుందని, అదికాకుండా, త్వరితగతిన మరో 30 వేల టన్నుల యూరియా సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. ఎరువుల కొనుగోలు కేంద్రాలను తెరిచి రైతులకు అందుబాటులో వుండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కోరారు. రాష్ట్ర ప్రభుత్వము ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకొంటూ, పంటకాలము కంటే ముందే మార్క్ ఫెడ్ దగ్గర ప్రారంభ నిల్వలు ఉంచుకుందని వెల్లడించారు. అన్ని జిల్లాలకు రానున్న పదిరోజులకు సరిపడా యూరియాను ముందుగానే సరఫరా చేసి, పంపిణీలో నిరంతరం పర్యవేక్షి స్తున్నామన్నారు.



గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

## దుబాయ్‌లో కేదార్ మృతి.. రాష్ట్రంలో సంచలనం

### మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** దుబాయ్‌లో కేదార్ మృతి రాష్ట్రంలో సంచలనంగా మారిందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. కేదార్ జూబ్లీహిల్స్ లో గతంలో పబ్‌లను నడిపిన వ్యక్తి అన్నారు. గతంలో డ్రగ్స్ కేసులో దొరికాడని, ఆయనతో పాటు డ్రగ్స్‌లో ఉన్న వ్యక్తులు ఎవరో తెలియాలన్నారు. తెలంగాణలో సంపాదించిన అక్రమ సంపాదన వేల కోట్లు దుబాయ్ తరలించబడ్డాయన్నారు. అక్రమ డబ్బులు ఎవరు దుబాయ్‌కి తరలించారో ప్రజలకు తెలియాలన్నారు. కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలతో దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో ఉన్న బినామిలు ఇప్పుడు ఎక్కడికి పోయారో తెలియాలన్నారు. వేలకోట్లు విదేశాలకు తరలిపోతుంటే రాష్ట్రంలో విచారణ సంస్థలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి 14నెలలు అవుతున్నా విచారణ సంస్థలు ఇప్పటి వరకు ఒక్క హవాలా వ్యక్తి ని కూడా పట్టుకోలేదన్నారు. డ్రగ్స్ దందాలో సినీ ప్రముఖుల ప్రమేయం ఉందని ప్రచారం జరుగుతుందని, ఇప్పటికైన హవాలా దందాపై యాక్షన్ తీసుకోకపోతే భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సినీ ప్రముఖులు, బ్రాండ్ అంబాసిడర్ పేరుతో సంపాదించిన సొమ్ము విదేశాలలో పెట్టుబడులు పెడుతున్నారని, చీటర్స్ చేతిలో సూపర్ స్టార్స్ మోసపోతున్నారన్నారు. సంపాదించిన సొమ్ముతో కొంత తెలంగాణకు కేటాయించాలని, ప్రభుత్వం విద్యా వ్యవస్థను అభివృద్ధి చేస్తుందని, మీ సంపాదనలో కొంత తెలంగాణ విద్యానిధికి కేటాయించాలన్నారు. తెలంగాణ పిల్లల భవిషత్తును అందంగా తీర్చి దిద్దడానికి సహకరించాలన్నారు.

**మాజీమంత్రి కెటిఆర్ ఎందుకు స్పందించడం లేదు?**

**'పిసిసి మీడియా చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి**

ట్విట్టర్‌లో ఏ అంశంపైనా అయినా స్పందించే మాజీమంత్రి కెటిఆర్ దుబాయ్ లో చనిపోయిన సినీనిర్మాత విషయంలో ఎందుకు మాట్లాడడం లేదని'పిసిసి మీడియా చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కెటిఆర్ సిని నిర్మాత దుబాయ్‌లో చనిపోయినప్పుడు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నీ నమ్మిన బంటు అక్కడే ఉన్నాడట.. ఉన్నాడా లేదా?? అంటూ ప్రశ్నించారు. కేదార్ మీకు పరిచయమా కాదా, కేదార్ రాడిసన్ బ్లూ డ్రగ్స్ కేస్‌లో ఏ4గా ఉన్నారు. కేదార్‌కు మీ బావమరిది రాజ్ పాకాలకు దగ్గరి సంబంధం ఉన్నట్లు గతంలో ప్రచారం జరిగిందని, కేదార్ ఘటనపై విచారణ చేయాలని కెటిఆర్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు.

## ఇందిరమ్మ ఇంటి ఖర్చు తగ్గించుకునే యోచనలో అధికారులు

### నిర్మాణ బాధ్యత మేస్త్రీలకే.. వారికి న్యాక్‌లో శిక్షణ

### ఇప్పటికే 7 జిల్లాల్లో 82 మందికి పూర్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ఇండ్లు లేని పేదల కోసం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. జనవరి 26న ఈ పథకం ప్రారంభం కాగా.. తొలి విడతగా రాష్ట్రవ్యాప్తంగా పలువురు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ పథకం కింద ప్రతి లబ్ధిదారుడికి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు నాలుగు విడతల్లో ఇవ్వనున్నారు. అర్హుల ఎంపిక ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే అన్ని జిల్లాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయనున్నారు.

కాగా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అధికారులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ ఖర్చును సాధ్యమైనంత తగ్గించే దిశగా వారు కసరత్తు చేస్తున్నారు.అందులో భాగంగా.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం మేస్త్రీలకు శిక్షణ ఇవ్వాలని గృహ నిర్మాణ శాఖ డిసైడ్ అయింది. తొలి విడతలో మంజూరు చేసిన 72,045 ఇళ్లను సత్వరం నిర్మించి పూర్తి చేయడానికి ఇండ్ల నిర్మాణంలో గట్టితనం, నాణ్యత ఉండేలా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం, వ్యయాన్ని తగ్గించడం. ఇంటి నిర్మాణ సామగ్రి వృథా కాకుండా సద్వినియోగం చేసుకోవడం, భద్రత తదితర అంశాలపై మేస్త్రీలకు శిక్షణ ఇవ్వనున్నారు. తెలంగాణలోని 12,672 గ్రామాల నుంచి ఒక్కో మేస్త్రీని ఎంపిక చేసి వారికి ఇళ్ల నిర్మాణంపై ట్రైనింగ్ ఇచ్చేందుకు ప్రణాళికలు రెడీ చేశారు. హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో ప్రస్తుతం ఏడు జిల్లాల పరిధిలో 82 మంది మేస్త్రీలకు మొదటి బృందంలో ట్రైనింగ్ పూర్తిచేశారు. మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే గ్రామాలకు ఈ మేస్త్రీలను ఎంపిక చేసి ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఇక ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే పేదలపై భారం పడకుండా.. ఒక్కో ఇంటికి కావాల్సిన 8 ట్రాక్టర్ల ఇసుకను ఫ్రీగా ఇచ్చేందుకు ఇప్పటికే ప్రభుత్వం సిద్ధమైంది.

రాష్ట్రంలోని మహిళా సంఘాలకు ఉపాధి కల్పించేలా ఇటుక తయారీ యూనిట్లు ఏర్పాటు చేసి సరఫరా చేయడానికి కూడా అధికారులు చర్యలు చేపట్టారు. 400 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో ఇంటిని నిర్మించుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఇందుకోసం మూడు నమూనాలను సర్కార్ విడుదల చేసింది. తాజాగా.. ఇండ్లు నిర్మించే మేస్త్రీలకు ట్రైనింగ్ ఇచ్చే అంశంపై గృహ నిర్మాణ శాఖ దృష్టిసారించింది.

## గిరిజన ఉత్పత్తుల మార్కెటింగ్‌పై నిర్లక్ష్యం

### సంస్థను కాపాడాలని గిరిజన నేతల డిమాండ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** అటవీ ఉత్పత్తులను సొంతంగా తయారు చేసిన వస్తువుల విక్రయంపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులకు ప్రభుత్వం నుంచి ఆదరణ కరువైందనే విమర్శలు వస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార సంస్థను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కాని కార్పోరేషన్‌కు చైర్మన్‌ను నియమంచిన ప్రభుత్వం సంస్థ బలోపేతం దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

అడవుల నుంచి సేకరించే ఉత్పత్తు లతో పాటు తాము స్వయంగా తయారు చేసిన వస్తువుల వర్కెటింగ్‌ను మాత్రం గిరిజన సంక్షేమ అధికారులు గాలికి వదిలేశారని గిరిజన బిడ్డలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ పరిధిలో గత ప్రభుత్వం 301 పైగా పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసింది. ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నది. కానీ ప్రస్తుత ప్రభుత్వం కార్పోరేషన్‌ను పట్టించుకోవడం లేదని లేదని సంస్థ ఉద్యోగులు వాపోతున్నారు.

కార్పొరేషన్‌కు నిధులు లేక పోవడంతో ఉద్యోగులు, సిబ్బంది అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.30 నుంచి 40 కోట్లు విడుదల చేస్తే కార్పొరేషన్ బలోపేతం సాధ్యమ వుతుందని, లేకపోతే సంస్థను మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.గిరిజన సహకార సంస్థ పరిధిలో జీసీసీ చైర్మన్‌తో పాటు పాటు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 280 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వారి జీతాల కోసం ప్రభుత్వం ఏటా దాదాపు రూ.80 కోట్ల వరకు వెచ్చిస్తున్నది. కానీ కార్పొరేషన్ ద్వారా వచ్చే ఆదాయం అంతంత మాత్రంగానే ఉంటోంది. ప్రభుత్వం సహకరిస్తూ, సంస్థ అభివృద్ధి కోసం నిధులు విడుదల చేయాలని, మార్కెటింగ్ పరంగా చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ నాయక్ డిమాండ్ చేస్తున్నారు.కార్పొరేషను బలోపేతం చేసి అటవీ ఉత్పత్తులు ప్రజలకు చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేసిన మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గురువారం జరిగిన కరీంనగర్- నిజామాబాద్- ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంత్రితోపాటు మంత్రి భార్య, కుమారుడు, కోడలు కూడా ఓటు వేశారు. ఓటింగ్ సందర్భంగా వేరు వేరు క్యూలైన్లలో నిలబడి మంత్రి దంపతులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంత్రి ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులపై కేంద్రంతో మాట్లాడారని మంత్రి తెలిపారు. తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులు గత 10 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీకి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీ లు మమ్మల్ని సంప్రదించలేదు రాష్ట్రానికి ఏం కావాలో అడగలేదన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ముఖ్య మంత్రి, మంత్రులు ఎంపీలు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని ఫెడరల్ సిస్టంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అనే సంబంధాల దృశ్య రాష్ట్రానికి అవసరమైన అన్ని ప్రాజెక్టులు అడుగుతున్నామని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ఏ ప్రాజెక్టు రాకపోయినా రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధ్యులవుతారని ప్రజలు భావించాల్సి వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర విభజనకు సంబంధించిన హామీలు నెరవేర్చల్సి ఉందన్నారు.



## 10లోగా యుడైస్‌లో పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలి

### సమాచారంలో తప్పలుంటే మీరే బాధ్యత వహించాలి

### డిఇఒలకు ఆదేశాలిచ్చిన పాఠశాల విద్యాడైరక్టర్ నరసింహారెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న పాఠశాలలకు సంబంధించిన పూర్తి వివరాలను మార్చి 10లోగా అప్‌డేట్ చేయాలని పాఠశాల విద్యా డైరక్టర్ ఇవి నరసింహారెడ్డి జిల్లా విద్యా శాఖ అధికారుల(డీఈవో)ను ఆదేశించారు. విద్య శాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు మార్చి 10లోగా పూర్తి సమాచారాన్ని ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉన్నందున .. ఆ లోపుగా యుడైస్‌లో వివరాలను అప్‌లోడ్ చేయాలని డీఈవోలను ఆదేశించారు. స్కూల్స్ వివరాలు.. ఉపాధ్యాయుల వివరాలతో పాటు విద్యార్థుల వివరాలను 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన వివరాలను అప్ డేట్ చేయాలన్నారు. స్కూల్ ఇన్ఫర్మేషన్‌లో క్లాస్‌రూమ్‌లు ఎన్ని ఉన్నాయి, ఫర్నిచర్ ఎంత ఉంది, ఐసీటీ, డిజిటల్ ఇన్ఫర్మేషన్‌ను ఇవ్వాలని సూచించారు. వారు సమర్పించిన వివరాలపై థర్డ్ పార్టీ పరిశీలన చేయనున్నదని.. ఎవరైనా వివరాలను తప్పుగా అప్‌డేట్ చేసినట్టు పరిశీలనలో తేలితే వారిపై చర్యలు తప్పవని .. అందుకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని పాఠశాల విద్య డైరక్టర్ ఉత్తర్వులో స్పష్టం చేశారు. పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలను అప్‌డేట్ చేయాల్సి ఉన్నందున డీఈవోలు.. ఎంఈవోలు, హెడ్మాష్టర్లకు చెప్పి పూర్తి వివరాలను తెప్పించుకొని యుడైస్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు.

## కవిత... మీ కాకమ్మ కథలు బంద్ చేయండి

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోడి కలిసి ఏం మాట్లాడుకున్నారో ఏమో అక్కడైతే మూడో వ్యక్తి లేడు మరి ఎమ్మెల్సీ కవితకు ఎలా తెలిసిందో చెప్పాలని ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆ చర్చ నుండి బయటకు వచ్చాక అబాండాలు మోపుతున్నా రన్నారు. తెలంగాణ ప్రజలకు మీ వంతుగా అంటే రోజుకు ఒకరు మీ కుటుంబంలో నుండి మాట్లాడాలి కదా అన్నారు. ఈరోజు మీ వంతుగా బయటకు వచ్చి మాట్లాడుతున్నారా అన్నారు. టిఆర్ఎస్ పార్టీ గురించి నెగిటివ్‌గా మాట్లాడు తున్నారని అంటున్నారు, బిఆర్ఎస్ పార్టీ అంటే తెలంగాణకు కట్టుబడి ఉంటుంది అని చెప్తున్నారు కానీ మీరు తెలంగాణకు కట్టుబడి ఉండలే పది సంవత్సరాలలో తెలంగాణను పెట్టుబడిగా పెట్టి ఏడు లక్షల కోట్లు రాష్ట్రంలో అప్పులు చేసి వేల కోట్లు దండుకొని విదేశాల్లో పెట్టుబడి పెట్టడమే మీరు తెలంగాణ కట్టుబడి ఉండడం అని తెలంగాణ ప్రజలకు మీ గురించి తెలిసిపోయిందని అన్నారు. కాంగ్రెస్, బిజెపి కలిసి డ్రామాలు ఆడుతున్నాయి వాళ్ళిద్దరూ ఒకటే జట్టు అంటున్నారు కానీ ఎవరు ఎవరి జట్టు తెలంగాణ ప్రజలు చూశారన్నారు. 8 ఎంపి సీట్లు గెలవడానికి ఎవరికి ఎవరు ప్రోత్సహించిరు ఇప్పుడు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎలక్షన్లో క్యాండిడేట్స్‌ను నిలబెట్టకుండా ఇంటర్నల్‌గా ఎవరికి సపోర్ట్ చేశారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. చీమ చిటుక్కుమన్న మాట్లాడే మీరు, మీకు అత్యంత సన్నిహితుడు గతంలో మీ అన్నగారైనటువంటి కెటిఆర్‌కి అన్ని విధాలుగా ఉన్నటువంటి వ్యక్తి దుబాయిలో మరణించినప్పుడు దాని గురించి ఖచ్చితంగా చర్చ వస్తుందని, ఒక మనిషికి దగ్గరగా వ్యవహారాలు నడిపి దగ్గరగా పెట్టుబడులను చూసుకొని ఆ రోజుల్లో ఉన్నటువంటి ఐ లైఫ్ పబ్బు లాంటి మేజర్ కార్యక్రమాలను హైదరాబాదులో నడిపినటువంటి వ్యక్తి మీకు అత్యంత సన్నిహితుడు అని తెలంగాణ ప్రజలందరికీ తెలుసిన వ్యక్తి ఈరోజు దుబాయిలో చనిపోతే దాని గురించి విచారణ కావాలని, విచారణకు ఇస్తే బాగుంటుందని వాస్తవాలు తెలుసుకోవాలని లేదా అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులపాలు చేయడమే కాక మీరు ఢిల్లీకి వెళ్లి వ్యాపారం చేయాలనే పిచ్చి ఆలోచనతో అక్కడ కూడా ప్రభుత్వాన్ని కూల్చడం మీ వల్లనే జరిగిందన్నారు.

## మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు పదవులు ఇవ్వాలి

### రేపు మాదిగ అమరవీరుల దినోత్సవం: మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణ జరిపి మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 1న మాదిగ అమరవీరుల దినోత్సవం గ్రామ మండల, జిల్లా, కేంద్రాలలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అలాగే మాదిగ అమరవీరుల త్యాగాల గుర్తుగా ఒక స్థూపాన్ని నిర్మించాలని హైదరాబాద్ సమీపంలో 5 ఎకరాలస్థలంలో మాదిగ అమరవీరుల గుర్తుగా ఒక మ్యూజియం నిర్మించాలన్నారు.అలాగే షమీమ్ అక్తర్ కమిషన్ నివేదికలో లోపాలను సవరించాలని ఎస్సీలను ఏబిసిడిలుగా గుర్తించి అభివృద్ధి చెందని కులాలకు మొదటి ప్రాధాన్య ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్చి 10తేదీలోపు ఎస్సీలను గ్రూపులుగా విభజించకుండా లోపాలను సవరించకుండా నిర్లక్ష్యం చేస్తే 11వ తేదీ నుంచి ఎమ్మార్పీఎస్, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాంని మందకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, ఇంజన్ వెంకటస్వామి, బోర్ర బిక్షపతి మాదిగ, మచ్చ దేవేందర్ మాదిగ, హోలియోదాసరి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జహం గీర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, టీవీ నరసింహ మాదిగ, దప్పు మల్లి కార్జున్ మాదిగ, మంథని సామెల్, దుప్పల్లి అనీల్, మునిరతి అరుణ్, కోడ్రుపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.



గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

**ఏ రాజకీయ పార్టీలో చేరే ప్రసక్తి లేదు**

**హైదరాబాద్ (సైఫాబాద్):** తాను ఏ రాజకీయ పార్టీలో చేరేది లేదని, మాదిగ కండువాను మార్చే ప్రసక్తి లేదని ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ స్పష్టం చేశారు. తాను కేవలం వర్గీకరణ కోసమే ప్రధాని నరేంద్రమోడీ, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి, ఎన్.చంద్రబాబునాయుడు, కెసిఆర్, రేవంత్‌రెడ్డిని కలిశానని తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో భారత్ మైనార్టీస్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆవిర్భావ సభలో ఆయన ప్రసంగించారు. ముస్లింల సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

## ప్రైవేట్ వర్సిటీల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాలి

### ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డికి బిసి సంక్షేమ సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రైవేటు యూనివర్సిటీల్లోనూ రిజర్వేషన్లను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ గురువారం తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బూర శ్రీనివాస్, ఓయూ జెఏసి చైర్మన్ బండి నరేష్, మాల మహానాడు సంక్షేమ సంఘం అధ్యక్షులు చంద్రమోహన్ రాయ్ బీసీ విద్యార్థి సంఘం ఓయూ ఇన్‌ఛార్జ్ గోదా రవీందర్ పాల్గొన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధనార్జనే ధ్యేయంగా పేద ప్రజల రక్తాన్ని జలగల్లా పీడిస్తూ లక్షలకు లక్షల రూపాయలు బడుగు బలహీన వర్గాల విద్యార్థుల దగ్గర వసూలు చేస్తున్నారని.. కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రైవేట్ యూనివర్సిటీలు విఫలమయ్యాయని మండిపడ్డారు. కొన్ని యూనివర్సిటీలు ఏలాంటి అర్హతలు లేకుండా అక్రమార్గంలో దొంగ పత్రాలు సృష్టించి అధికారులను మచ్చిక చేసుకొని, ముడుపులు ఇచ్చి న్యాక్(ఎన్ఏఏసీ), ఎన్‌బీఏ అక్రిడేషన్ పొంది విద్యార్థుల దగ్గర లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని.. అటువంటివాటినీ గుర్తించి క్షణంగా తనిఖీలు చేయాలనీ కోరారు. ప్రైవేటు యూనివర్సిటీల్లో రిజర్వేషన్లను అమలు చేస్తే.. బడుగు, బలహీన వర్గాల వారు కూడా అక్కడ చదివే అవకాశం ఏర్పడుతుందన్నారు. అందుకే ప్రైవేటు యూనివర్సిటీల్లో రిజర్వేషన్లను అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

## ప్రభాస్ సినిమా వివాదంలో నిర్మాత దిల్ రాజుపై చర్యలొద్దు

### సుప్రీంకోర్టు ఆదేశాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎఫ్డీసీ) చైర్మన్ దిల్ రాజుకు సుప్రీంకోర్టు ఊరట లభించింది. దిల్ రాజుపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. దిల్ రాజు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జేబీ పార్తీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. నిర్మాత దిల్ రాజు సహా మిగిలిన వారిపై కాపీరైట్ చట్టంలోని సెక్షన్ 63 ప్రకారం విచారణ కొనసాగించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ధర్మాసనం స్టే విధించింది. రెండు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. మార్చి 18న సుప్రీంకోర్టులో మరోసారి విచారణ జరగనుంది. కాగా తాను రాసిన నా మనసు నిన్ను కోరే కథ ఆధారంగానే మిస్టర్ పర్ఫెక్ట్ సినిమాను చిత్రీకరించారని ఆరోపిస్తూ 2017లో దిల్ రాజుతో పాటు, మరి కొందరిపై రచయిత్రి ముమ్మిడి శ్యామల రాణి హైకోర్టును ఆశ్రయించారు. సమగ్ర విచారణ జరిపిన తర్వాత ఛార్జిషీట్ దాఖలు చేయాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. కేసును కొట్టివేయాలని దిల్ రాజు సహా మరో నలుగురు 2019లో హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. వాదనల తర్వాత గత ఏడాది డిసెంబర్ లో దిల్ రాజు, సహా మరికొందరిపై ఛార్జిషీట్ లో దాఖలైన సెక్షన్ 420 ను తొలగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సెక్షన్ 63 పై మాత్రం కింది న్యాయస్థానంలో యథావిధిగా విచారణ జరగాలని హైకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును ఈ నెల 6న దిల్ రాజు సుప్రీంకోర్టులో సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు సెక్షన్ 420 నుంచి విముక్తి కల్పించిందని, అలాగే సెక్షన్ 63 కేసును సైతం క్వాష్ చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## మైనింగ్‌లో సంస్కరణలు

### గనుల శాఖలో నూతన పాలసీ

### కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో మైనింగ్ లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీలో గురువారం మైనింగ్ శాఖపై ఆయన మీడియాతో మాట్లాడారు. గనుల శాఖలో నూతన పాలసీ తీసుకొచ్చామన్నారు. ఇదే సమయంలో 12 ఖనిజాలకు సంబంధించిన రాయల్టీని పెంచినట్లు వెల్లడించారు. ఈ ఏడాది జీఎస్ఐ 448 ప్రాజెక్టుల్లో గనుల అన్వేషణ చేపట్టిందని పేర్కొన్నారు. గనుల అన్వేషణలో ప్రైవేట్ రంగాన్ని కూడా భాగస్వామ్యం చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది 12 ప్రైవేట్ కంపెనీలు గనుల అన్వేషణలో భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. అలాగే ఆఫ్ షోర్ ఏరియాలో ఖనిజాల ఉత్పత్తిని పెంచుతున్నామన్నారు. పలు ఆఫ్ షోర్ మినరల్స్ గుర్తించి వేలం వేయబోతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 103 బ్లాకుల గనులను వేలం వేశాయని వివరించారు. ఈ వేలం ప్రక్రియలో 14 రాష్ట్రాలు భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై దృష్టి సారించామన్నారు. ప్రపంచంలోనే బొగ్గు ఉత్పత్తిలో భారత్ రెండో స్థానంలో ఉందని తెలిపారు. బొగ్గు నిల్వల్లో ప్రపంచంలోనే 5వ స్థానంలో ఉండటంతో పాటు, రెండో అతిపెద్ద బొగ్గు వినియోగదారుగా భారతదేశం నిలిచిందని అన్నారు. 2047 వికసిత భారతఖ లక్ష్యాల్లో బొగ్గు రంగం చాలా కీలక పాత్ర వహిస్తుందని పేర్కొన్నారు. దేశంలో బొగ్గు ద్వారానే 74 శాతం విద్యుదుత్పత్తి జరుగుతోందన్నారు. రానున్న దశాబ్దాల్లోనూ బొగ్గు ఒక కీలకమైన ఇంధనంగా ప్రత్యేకతను సంతరించుకుంటుందపి వివరించారు. బొగ్గు రంగంలోనూ మౌలికమార్పులు, విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తు తెలిపారు. కోల్ బ్లాక్స్ వేలం విషయంలో పారదర్శకంగా వ్యవహరించామని అన్నారు. ఇప్పటివరకు 10 విడతల పాటు పారదర్శక వేలం పూర్తయి 184 బ్లాక్స్ వేల నిర్వహించినట్లు పేర్కొన్నారు. కమర్షియల్ కోల్ మైనింగ్, కోల్ గ్యాసిఫికేషన్, టెక్నాలజీ వంటి వినియోగం పెరిగిందని పేర్కొన్నారు. భారత బొగ్గు ఉత్పత్తి సామర్థం పెరిగిందని తెలిపారు. 2023.24లో 998 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని చెబుతూ 2014లో ఇది కేవలం 609 కోట్ల బొగ్గు ఉత్పత్తి మాత్రమే జరిగిందని గుర్తు చేశారు. బొగ్గు రంగంలో ప్రైవేట్ రంగం భాగస్వామ్యం పెరిగిన తర్వాత మరింత పోటీ పెరిగిందని స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న వి.సంధ్య

## హైదరాబాద్‌లో ప్రపంచ అందాల పోటీలను అడ్డుకుంటాం

### పిఒడబ్ల్యు జాతీయ నాయకురాలు సంధ్య హెచ్చరిక

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** హైదరాబాద్ వేదికగా అంగాంగ ప్రదర్శనగా సాగే 72వ ప్రపంచ అందాల పోటీలను అడ్డుకుంటామని ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) జాతీయ నాయకురాలు వి.సంధ్య హెచ్చరించారు. ఒకవైపు నీటికరవుతో సాగునీరు, తాగునీరు లేక పంటలు, గొంతులు ఎండి పోయి ప్రజలు అల్లాడుతుంటే ప్రపంచ సుందరి పోటీలకు హైదరాబాద్ వేదికగా మార్చడం ప్రభుత్వానికి ప్రజలపై ఉన్న బాధ్యతారాహిత్యాన్ని తెలియ జేస్తున్నదని ఆమె ఆరోపించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం జాతీయ కార్యదర్శి జి.ఝాన్సీ, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.అనసూయ, అందె మంగతో కలిసి సంధ్య మాట్లాడారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం, మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామనే నినాదంతో మార్చి 1వ తేదీ నుంచి 8 వరకు మహిళా శ్రామిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా, మహిళా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నదని విమర్శించారు.

## 325 హాస్టళ్ల అద్దె బకాయిలు చెల్లించాలి

### ముఖ్యమంత్రికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** 'రాష్ట్రంలోని 325 బిసి కాలేజీ హాస్టళ్లు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. వీరికి గత 36 నెలలుగా అద్దె చెల్లించడం లేదు. విపరీత జాప్యం మూలంగా అద్దె భవనాల యజమానులు భవనాలు ఖాళీ చేయమని అధికారులపై వత్తిడి తెస్తున్నారు. ఒకవైపు పరీక్షలు సమీపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అద్దె బకాయిలు చెల్లించాలి' అని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. బకాయిలు చెల్లించకపోతే హాస్టళ్ళు మూసివేస్తామని బెదరిస్తున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కాలేజీ హాస్టళ్లు 325 ఉన్నా ఇందులో 50వేల మంది విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్, పిజి, డిగ్రీ, ఇంటర్ తదితర ప్రాముఖ్యత కోర్సులు చదువుచున్నారు. హాస్టళ్లకు స్వంత భవనాలు కట్టాలని ఆయన కోరారు. కూరగాయలు, మాంసం, గుడ్లు, పప్పులు, నూనెలు, ఇతర నిత్యావసర వస్తువుల బిల్లులు గత ఐదు నెలలుగా చెల్లించడం లేదని, హాస్టళ్లకు సరఫరా చేసే సరుకుల కాంట్రాక్టర్లు వ్యాపారస్తులు నిత్యావసర వస్తువులు సరఫరా నిలిపి వేస్తామని అంటున్నారని ఆయన లేఖలో పేర్కొన్నారు. సింఎ వెంటనే జోక్యం చేసుకొని బడ్జెట్ విడుదల చేయాలని కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

# హరీశ్‌వన్నీ అసత్యాలే..

## జగన్‌తో కుమ్మక్కై తెలంగాణకు అన్యాయం

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మాజీ మంత్రి హరీష్‌రావు మాటలు పూర్తి అబద్దాలు, గోబెల్స్ ప్రచారమేనని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ద్వారా 30 టీఎంసీల నీళ్లు వచ్చేవని.. కానీ బీఆర్ఎస్ హయాంలో పనులు పూర్తి చేయకుండా వదిలిపెట్టారని మండిపడ్డారు. ఆ పనులు పూర్తి చేసి ఉంటే నల్గొండలో నాలుగు లక్షల ఎకరాలు సాగులోకి వచ్చేవని అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాదాన్నిఅందరికీ చూడటానికి అనుమతిస్తున్నామని... ఎవరినీ తమ ప్రభుత్వం అడ్డుకోవడం లేదని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ఎన్ని ప్రమాదాలు జరిగినా ప్రతిపక్షంలో ఉన్న తమకు ఎలాంటి అనుమతులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రెండు, మూడు నెలల్లో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పున ప్రారంభిస్తామని తెలిపారు. రెండు మూడు రోజుల్లో సహాయక చర్యలు పూర్తి చేస్తామని అన్నారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ అధికారంలో ఉందని.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ అనుమతుల గురించి మాట్లాడుతున్నారని చెప్పారు. అప్పుడు మాట్లాడని నేతలు ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ హయాంలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చుపెట్టి నామమాత్రపు పనులు చేశారని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. వాళ్ల హయాంలో నీటిపారుదల శాఖను నిర్వీర్యం చేసిన ఘనత కేసీఆర్, హరీష్ రావులకు దక్కుతుందని విమర్శించారు. తాము ప్రజాస్వామ్యయుతంగా, పారదర్శకంగా ముందుకు పోతున్నామని చెప్పారు. కేసీఆర్ హయాంలో శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం బ్లాస్ట్ జరిగి.. 9 మంది చనిపోతే ఒక్కరూ కూడా ఎందుకు పరామర్శకు రాలేదని ప్రశ్నించారు. ఆరోజు రేవంత్ రెడ్డి వస్తుంటే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని గుర్తుచేశారు. హరీష్‌రావు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు వచ్చి పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జగన్‌తో కుమ్మక్కై ప్రగతిభవన్‌లో విందులు, వినోదాలు చేసుకుంటుంటే జగన్ కృష్ణానదిని దోచుకువెళ్లారని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు చెప్పిన మాటలు అబద్ధాలు అని.. ఆ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నానని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.

# ఆస్కార్ విజేత,హాలీవుడ్ నటుడు, భార్య అనుమానాస్పద మృతి



**మెక్సికో, ఫిబ్రవరి 27:** రెండుసార్లు ఆస్కార్ విజేతగా నిలిచిన హాలీవుడ్‌న టుడు జెనెహ్యాక్‌మాన్ ఆతనిభార్య అరకావాలు తమ ఇంట్లోనే విగతజీవులుగా పడి ఉన్న వైనాన్ని పోలీసులు గుర్తించారు. న్యూమెక్సికోలోని వారి సొంత ఇల్లు శాంతాఫేలోనే 95 ఏళ్ల హ్యాక్‌మాన్, 63 ఏళ్ల భార్య బెట్సీలు చనిపోయి ఉన్నట్లు తేలింది. శాంతాఫే కౌంటీ షరీఫ్ అదన్ మెన్‌డోజా వీరిద్దరి మరణాలను ధృవీకరించారు. ప్రస్తుతం విచారణ జరుగుతున్నదని అన్నారు. సూర్యాస్తమయం సమయంలోనే వీరు చనిపోయినట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం దరానయప్తును ముమ్మరంచేసామని ఈ అనుమానాస్పద మృతికి గలకారణాలు ముందు వెలికి తీయాల్సి ఉందన్నారు. సెర్చ్ వారంట్‌కు అనుమతి లభించిన తర్వాత వీరి మృతిలో కొంత క్లూ లభించవచ్చని తెలుస్తోంది. 1930లో జన్మించిన హ్యాక్‌మాన్ సుమారు 100కుపైగా కీలకపాత్రలు పోషిం చారు. ఆయనకు ఉత్తమనటునిగా జిమ్మి పోపెయేడోయిల్‌గా, ఫ్రెంచ్ కనెక్షన్ చిత్రానికి, ఉత్తమ సహచర నటుడిగా లిటిల్‌బిల్ డాగ్గెట్‌గా అన్‌ఫర్గివెన్‌లో నటించినందుకుగాను లభించాయి

# సెంట్రల్ వర్సిటీలో కుప్పకూలిన నిర్మాణంలో ఉన్న భవనం

## ఏడుగురు కార్మికులకు గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

## అడ్మిన్ కార్యాలయానికి కొత్తగా చేపడుతున్న భవనంలో దుర్ఘటన



సెంట్రల్ వర్సిటీలో కూలిన నిర్మాణంలో ఉన్న భవనం

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నూతనంగా చేపడుతున్న భవనం గురువారం రాత్రి ఒక్కసారిగా కుప్పకూలింది. నిర్మాణంలో ఉన్న అడ్మినిస్ట్రేటీవ్ కార్యాలయం స్లాబ్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో భవన నిర్మాణంలో పనిచేస్తున్న 7గురు కార్మికులు గాయపడగా, వారిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వీరిలో ఓ కార్మికుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గురువారం రాత్రి చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్న అడ్మినిస్ట్రేటీవ్ కార్యాలయం ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో అడ్మిన్ కార్యాలయాన్ని విస్తరిస్తూ కొత్తగా భవన నిర్మాణం చేపడుతున్నారు. వర్సిటీకి చెందిన పిడబ్ల్యుడీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ పనుల్లో భాగంగా కొత్తగా చేపడుతున్న భవనం పోర్టికో కోసం పిల్లర్లను ఏర్పాటు చేసి పిల్లర్ల మీద స్లాబ్‌ను గురువారం వేశారు. 8నెలల్లో నిర్మాణం పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకోవడంతో రెండు షిఫ్టుల వారిగా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓ షిఫ్టుగా పనులు చేపట్టిన కార్మికులు సాయంత్రం 6 గంటల తరువాత మరో బ్యాచ్ కార్మికులు రెండవ షిఫ్ట్ కోసం పనుల్లోకి దిగారు. ఇదే సమయంలో సెంట్రింగ్ స్లాబ్ బరువును తట్టుకోలేక పిల్లర్లు రాత్రి 7 గంటల సమయంలో ఒక్కసారిగా కూలిపోయాయి. దీంతో ఒక్కసారిగా కొత్తగా వేసిన స్లాబ్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో నిర్మాణంలో ఉన్న భవనంలో పనిచేస్తున్న 7గురు కార్మికులు కూలిన శిథిలాల కింద చిక్కుకుపోయారు. భవనం స్లాబ్ కూలిన విషయం తెలుసుకున్న యూనివర్సిటీ యాజమాన్యం వెంటనే అప్రమత్తమైంది. పోలసులు, రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకొని కూలిన శిథిలాల తొలగింపు చేపట్టి, అందులో చిక్కుకున్న కార్మికులను బయటకు తీశారు. గాయపడిన కార్మికులను నల్లగండ్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, కార్మికులు చికిత్స పొందుతున్నారు. వీరిలో ఓ కార్మికుడి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తుంది. గాయపడిన వారిలో సంజయ్(26), కరణ్(25), ఈశ్వర్(35), ధీనా(25), యూనిస్(25), మాధవ్(28), మనోజ్(28)లు ఉన్నారు. వీరిలో ఓ కార్మికుడి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. త్వరగా నిర్మాణం చేపట్టాలనే తొందరలో నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించకపోవడమే భవనం స్లాబ్ నిర్మాణ దశలోనే కూలిపోయేందుకు కారణమైందని తెలుస్తుంది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మీద చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. భవనం కూలిన ఘటనపై పలువురు విద్యార్థులు వర్సిటీ ప్రధాన గేటు ముందు ఆందోళన వ్యక్తం చేశారు.

# మహిళా యూనివర్సిటీకి కావలసిన నిధులు సమకూరుస్తాం

## దేశంలోనే ఉత్తమ వర్సిటీగా తీర్చిదిద్దుతాం

### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** తెలంగాణ మహిళా యూనివర్సిటీగా కొనసాగుతున్న వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీకి కావలసిన నిధులు సమకూరుస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఐలమ్మ యూనివర్సిటీని దేశంలోనే ఉత్తమ యూనివర్సిటీగా తీర్చిదిద్దుతామన్నారు. యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న హెరిటేజ్ బిల్డింగ్స్‌ను పరిరక్షించి పునరుద్ధరణ చేస్తామని తెలిపారు. యూనివర్సిటీ నూతన భవన నిర్మాణ ప్రదేశాలు, నమూనాలను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోఠిలోని యూనివర్సిటీ క్యాంపస్‌లో గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ క్యాదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పూజారి గౌతమి, తెలంగాణ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఈడబ్ల్యుఐడీసీ) మేనేజింగ్ డైరెక్టర్ గణపతి రెడ్డి, యూనివర్సిటీ ఇంచార్జ్ వీసీ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్, ప్రిన్సిపల్ లోక పావని పాల్గొన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీని దేశంలోనే ఉత్తమ వర్సిటీగా తీర్చిదిద్దడానికి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు కావలసిన నిధులను సమకూరుస్తామని భట్టి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న హెరిటేజ్ బిల్డింగ్స్‌ను పరిరక్షించడంతోపాటు.. పునరుద్ధరణ చేయడానికి కావలసిన నిధులను ప్రభుత్వం ఇస్తుందని వెల్లడించారు. మహిళా విద్యార్థులకు కావలసిన తరగతి గదులు, ల్యాబ్స్, లైబ్రరీ, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉండడానికి కావలసిన వసతి గృహాలు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కార్యాలయం, అతిథి గృహం, ఆడిటోరియం, పరిపాలన విభాగానికి సంబంధించిన భవనాల నిర్మాణాలకు సంబంధించిన ప్రదేశాలను భట్టి విక్రమార్క పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులు రూపొందించిన భవన నిర్మాణ నమూనాలను పరిశీలించారు. ఇటీవల పునరుద్ధరణ చేసిన దర్బార్ మహల్ హెరిటేజ్ బిల్డింగును ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. దర్బార్ మహల్ పైఅంతస్తులో 1779, 1947 మధ్య, హైదరాబాదులో పనిచేసిన 57 మంది బ్రిటిష్ రెసిడెంట్లకు సంబంధించిన చిత్రపటాలు, వారి పదవీ కాలంలో హైదరాబాద్ నగర రాజకీయ, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో చేసిన అభివృద్ధికి సంబంధించి ప్రదర్శించిన చిత్రపటాలను ఆసక్తిగా తిలకించారు. యూనివర్సిటీలో నూతనంగా నిర్మాణం చేసే భవనాలు.. రాబోయే తరాలకు వారసత్వ కట్టడాలుగా చరిత్రలో మిగిలిపోయే విధంగా ఉండాలని, ఆ విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు.



కోఠిలోని యూనివర్సిటీ క్యాంపస్‌లో గురువారం నూతన భవన నిర్మాణ ప్రదేశాలు, నమూనాలను పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

# తాగునీటికి ప్రాధాన్యం-రెండు రాష్ట్రాలకు బోర్డు సూచన

## నీటి పంపిణీ.. ఎపి, తెలంగాణకు కేటాయింపులు

## నీటి వినియోగంపై కెఆర్ఎంబి దిశానిర్దేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 27:** శ్రీశైలం,నాగార్జున సాగర్ జలాశయాల్లోని నీటిని ఉభయ తెలుగు రాష్ట్రాలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని గురువారం జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయించారు. త్రాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పంటల సాగును దృష్టిలో ఉంచుకుని నీటిని వినియోగించుకోవాలని చైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలోని బోర్డు నిర్ణయించింది. గురువారం ఈ బోర్డు సమావేశం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగింది. తెలంగాణ నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్సీ వెంకటేశ్వరరావు, ఇతర ఇంజినీర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. శ్రీశైలం,నాగార్జున సాగర్ జలాశయాల్లో నీటి వినియోగంపై ఈ సమావేశంలో చర్చించారు. మే నెలాఖరు వరకు తెలంగాణ రాష్ట్రానికి 63 టీఎంసీల నీరు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, 55 టీఎంసీల నీరు అవసరమని ఆయా రాష్ట్రాలు కోరాయి. ప్రస్తుతం రెండు జలాశయాల్లో వినియోగ మట్టానికి 70 టీఎంసీలకు పైగా నీరు అందుబాటులో ఉంది. అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని బోర్డు సూచించింది. రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ వివాదాలు లేకుండా, సహకారంతో సమస్యలను పరిష్కరించుకోవాలని బోర్డు సూచించింది. నీటిని వ్యవసాయ అవసరాలకు సమర్థవంతంగా ఉపయోగించాలని, ప్రస్తు ఖరీఫ్,రబీ సీజన్లలో సాగు కీలక దశలో ఉన్నందున వ్యవసాయ అవసరాలకు నీటిని సరిగ్గా వినియోగించుకోవాలని బోర్డు పేర్కొంది.

నీటి నిల్వలు పొదుపుగా వినియోగించాలి. ప్రస్తుత నీటి నిల్వలు గరిష్టంగా వేసవి సరిపడేలా జాగ్రత్తలు తీసుకోవాలని బోర్డు రాష్ట్రాలను ఆదేశించింది. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులలో కలిసి 70 టిఎంసీల నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయి. వేసవి ముగిసేంతవరకు ఈ నీటిని జాగ్రత్తగా వినియోగించాలని కెఆర్ఎంబీ హెచ్చరించింది. కృష్ణా జలాల పంపిణీ వివాదం పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం మరింత చొరవ తీసుకోవాలని బోర్డు పేర్కొంది. ఈ సమావేశంలో ప్రస్తుతం నీటి నివ్వల ఆధారంగా ఏపీ,తెలంగాణకు పంపిణీ వివరాలను ఖరారు చేశారు.

**నాగార్జునసాగర్ ప్రాజెక్టు..**

ఎపి: 7,000 క్యూసెక్కుల నీటి వినియోగం

తెలంగాణ: 9,000 క్యూసెక్కుల నీటి వినియోగం

**శ్రీశైలం ప్రాజెక్టు..**

ఏపీ: 2,200 క్యూసెక్కుల నీరు వినియోగం

తెలంగాణ: కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 2,400 క్యూసెక్కుల నీరు వినియోగం.

# టెక్నాలజీని బాధ్యతాయుతంగా వాడుకోకుంటే భారీ విధ్వంసమే

## డ్రోన్ టెక్నాలజీని వ్యవసాయానికి, యుద్ధానికి వాడుకోవచ్చు

## అది అందరికీ సమానంగా అందినప్పడే సమాన అవకాశాలు

### బెంగళూరులో ఎంట్రప్రెన్యూర్ టెక్ ఇన్నోవేషన్ సమ్మిట్‌లో మాజీమంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 27:** టెక్నాలజీని బాధ్యతాయుతంగా వాడుకోకుంటే భారీ విధ్వంసం జరిగే అవకాశం ఉంటుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. డ్రోన్ టెక్నాలజీని వ్యవసాయానికి, యుద్ధానికి వాడుకోవచ్చని, అయితే దానిని నిర్ణయించు కోవాల్సింది మనమే అని పేర్కొన్నారు. అందరికీ సాంకేతిక అక్షరాస్యత (డిజిటల్ లిటరసీ) లేకుంటే అందరికీ సమాన అవకాశాలు అందించలేమని తెలిపారు. దేశంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ జూదం ఘోరాలు భారీగా పెరుగుతున్నాయని తెలిపారు. కేవలం కాలర్ ట్యూన్ పెట్టి వీటిని అరికట్టలేం అని కేటీఆర్ స్పష్టం చేశారు. బెంగళూరులో గురువారం జరిగిన ఎంట్రప్రెన్యూర్ టెక్ అండ్ ఇన్నోవేషన్ సమిట్‌లో ఆయన ప్రసంగించారు. టెక్నాలజీ ప్రపంచాన్ని మలచడంలో ఉన్న అవకాశాలను వినియోగించుకునే విధంగా నూతన ఆవిష్కరణలు సాగాలని అన్నారు. సాంకేతికత అభివృద్ధి కావాలని అదే సమయంలో అది సమాజానికి మేలు చేయాలని అభిప్రాయపడ్డారు. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్నదని, కానీ ప్రతి సాంకేతిక ఆవిష్కరణ వెనుక మానవ అవసరాలు, నైతిక విలువలు నిలకడగా ఉండాలని సూచించారు. భవిష్యత్తు నిర్మాణం అంటే కేవలం రేపటి రోజుల్లో జీవించడం కాదు రేపటిని నిర్మించడం అని కెటిఆర్ చెప్పారు. ఇదే స్పూర్తితో సామాజిక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని టెక్నాలజీ అభివృద్ధి జరగాలన్నారు. డ్రోన్స్ వ్యవసాయాన్ని సమర్థవంతంగా మార్చగలవనే సందేశాన్ని ఆయన వినిపించారు. అదే డ్రోన్స్ విధ్వంసానికి ఉపయోగిస్తే అది ప్రమాదకరం. అందుకే ప్రతి టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది అని కేటీఆర్ పేర్కొన్నారు. టెక్నాలజీ సామర్థం అధికంగా ఉన్న యువత సైబర్ నేరాలకు ఎందుకు పాల్పడుతున్నారో ఆలోచించాలని కెటిఆర్ కోరారు. సైబర్ నేరాలపైన కేవలం ఒక కాలర్ ట్యూన్ పెట్టి ఆపలేమని స్పష్టం చేశారు. అంతేకాక, ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ వలన జరుగుతున్న దుష్ప రిణామాలను ఆపడం ప్రభుత్వాలు నడిపే వారికి పెద్ద సవాలుగా మారిందని అన్నారు. టెక్నాలజీ వల్ల పర్యావరణంపై కలిగే ప్రభావం గురించి తగిన అధ్యయనం లేకుండా ముందుకు వెళితే భవిష్యత్తు ఇబ్బందికరంగా మారుతుందన్నారు. ఐఓటీ, మొబైల్ యాప్‌లు, డేటా స్టోరేజ్ ఇవన్నీ పెరుగుతున్నాయి. కానీ, అవి ఎంతగా పర్యావరణ భంగాన్ని కలిగిస్తున్నాయో ఆలోచించాలని చెప్పారు. ప్రస్తుతం తమ మాతృభాషల పట్ల జరుగుతున్న వివక్ష గురించి మాత్రమే కాకుండా టెక్నాలజీ తెలిసినవారు టెక్నాలజీ తెలవని వారు అని సమాజంలో ఏర్పడు తున్న సరికొత్త విభజనపైన దృష్టి సారించాలని చెప్పారు. డిజిటల్ విభజన పెరుగుతున్నకొద్దీ సమాజంలో మరింత విభజన వస్తుందని, టెక్నా లజీ అందరికీ సమానంగా అందినప్పుడే సమాన అవకాశాలు ఏర్పడతాయని కేటీఆర్ తెలిపారు.





# బిజెపి చీఫ్ సమక్షంలోనే నాయకుల బాహాబాహీ

**జైపూర్, ఫిబ్రవరి 27:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలోనే ఇరువురు బిజెపినాయకులు చొక్కాలు పట్టుకున్న వైనం బయటికి రావడంతో బిజెపి తీవ్రంగా పరిగణించింది. రాజస్థాన్ బిజెపి కార్యాలయంలోజరిగిన సమావేశంలోనే ఈసంఘటనచోటుచేసుంది. ఇద్దరునేతలు ఒకరి కాలర్ ఒకరు పట్టుకుని తోసుకోవడం, ఆపై ఒకరినొకరు కొట్టుకోవడం వంటివి వైరల్ అయ్యాయి. ఒకరితలపై ఒకరు పిడిగుద్దులతో దాడిచేసుకుంటున్న విడియోలు వైరల్ కావడంతో బిజెపి హైకమాండ్ రాష్ట్రయూనిట్‌కు చురకలువేసింది. ఈసంఘటనతో వెంటనే ఇతర బిజెపి నాయకులు జోక్యంచేసుకుని ఇరువురినీ పక్కకు తీసుకుపోయారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మదన్ రాథోర్‌కు సన్మాన కార్యక్రమంలోనే ఈ సంఘటన జరిగిందని తేలింది. బిజెపి కార్యవర్గంలోని మైనార్టీమోర్చానాయకుడు ప్రస్తుత ఆఫీస్ బేరర్‌పై దాడికి దిగినట్లు తేలింది. ఇందుకు ప్రతిగా ఆఫీస్‌బేరర్‌కూడా దాడిచేసాడు.మాజీ మైనార్టీ నాయకుడు జాకీ రాష్ట్ర అధ్యక్షుడిని వేదికవరకూఎస్కార్టుగా తీసుకొచ్చారు. వేదికపైకి ఎక్కుతున్న సమయంలోనే మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జావేద్ ఖురేషి ఆతడిని అడ్డగించాడు. దీనితోనే ఘర్షణకు దారితీసి జావేద్‌ను జాకీ చెంపదెబ్బలు కొట్టడం కనిపించింది.

# ఫిబ్రవరి 4న తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం

## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి27:** తెలంగాణ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. సమాజంలోని అన్ని వర్గాలకు సమానత్వం, సాధికారత సూత్రాలను సమర్థించడంలో తన అంకిత భావాన్ని పునరుద్ధరించటానికి ఇకపై ప్రభుత్వం ప్రతి ఏటా ఫిబ్రవరి 4వ తేదీన తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సామాజిక న్యాయం, సమానత్వం,సమ్మిళిత అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వ నిబద్ధతను గుర్తించిందని ఆమె తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 ఫిబ్రవరి 4న కులగణన చేయాలని క్యాబినెట్‌లో తీర్మానం చేశారు. 2025 ఫిబ్రవరి 4న అసెంబ్లీలో బీసీ కులగణనకు సంబంధించి చర్చించి వివరాలను వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 4న తెలంగాణలో సామాజిక న్యాయ దినోత్సవం జరపనున్నట్లుగా గతంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ప్రభుత్వం జీవో జారీ చేసింది. ప్రధానంగా ఈ ఏడాది ఫిబ్రవరి 4న సామాజిక ఆర్థిక,విద్యా, ఉపాధి,రాజకీయ,కులాల సర్వేకు సంబంధించి తీసుకున్న నిర్ణయాల దృష్ట్యా,షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణకు సంబంధించిన సిఫార్సులను తెలంగాణ ప్రభుత్వం ఆమోదించడం జరిగిందన్నారు. సామాజిక న్యాయంపై తెలంగాణ నిబద్ధతను తెలిపేందుకు అధికారికంగా వేడుకలు,అవగాహన కార్యక్రమాలు,ఉపన్యాసాలు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గుర్తింపు అవార్డులు,సంక్షేమ శిబిరాలు వంటి ప్రత్యేక కార్యక్రమాలు సైతం చేపట్టడం జరుగుతుందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా బీసీ సంక్షేమ శాఖ ఈ కార్యక్రమాలను సమన్వయం చేయడంతోపాటు నోడల్ ఏజెన్సీగా ఉండి,. ప్రభుత్వంలోని అన్ని సంక్షేమ శాఖలతో నిర్వహించడం జరుగుతుందన్నారు. తద్వారా అన్ని సంబంధిత శాఖలు ఈ ఉత్తర్వును అమలుకు అవసరమైన చర్య తీసుకోవాలని ఈ సందర్భంగా సిఎస్ శాంతికుమారి ఆదేశించారు.

# 9 గంటల పాటు పోసాని విచారణ

## ఓబులవారిపల్లి పిఎస్‌లో ప్రశ్నించిన పోలీసులు

## రైల్వేకోడూరులో మరో కేసు నమోదు

**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై గతంలో వివాదాస్పద వ్యాఖ్యలతో పాటు రెచ్చగొట్టే విధంగా, కులాల మధ్య చిచ్చు పెట్టే విధంగా, కుటుంబ సభ్యులను అసభ్యంగా మాట్లాడిన కేసులో నిందితుడైన సినీ నటుడు పోసాని మురళీకృష్ణను 9 గంటల పాటు పోలీసులు సుదీర్ఘంగా విచారించారు. రైల్వే కోడూరు జూనియర్ సివిల్ జడ్జి పీజే తేజ సాయి ఎదుట రాత్రి సుమారు 9 గంటల సమయంలో హాజరు పరిచారు. హైదరాబాదులోని పోసాని మురళీకృష్ణ నివాసంలో బుధవారం రాత్రి సంబేపల్లి ఎస్సై భక్త వత్సలం అదుపులోకి తీసుకొని నేరుగా గురువారం ఉదయం ఓబులవారిపల్లె పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చారు. వెంటనే వైద్యులు గురు మహేష్ పరీక్షలు నిర్వహించారు. పోలీసు విచారణకు ఎలాంటి ఇబ్బంది లేదని వైద్యుడు సర్టిఫికెట్ జారీ చేశారు. అనంతరం పోలీసులు విచారణ ప్రారంభించారు.

మధ్యాహ్నం మూడు గంటలకు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్ వచ్చారు. పోలీసులు 9గంటల పాటు పోసానిని సుదీర్ఘంగా విచారించారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ను దూషించేందుకు గల కారణాలను ప్రశ్నించినట్లు తెలిసింది. పోలీసులకు ఏమాత్రం సహకరించలేదని సమాచారం. ఉదయం ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్ కు చేరుకున్న వెంటనే రైల్వే కోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, హైకోర్టు న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి, కడప న్యాయవాది నాగిరెడ్డి, పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు తరలి వచ్చాయి. మాజీ ఎమ్మెల్యే, న్యాయవాదులు పోసానిని కలిసేందుకు ప్రయత్నించారు. పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఈ సందర్భంగా స్వల్ప వాగ్వాదం జరిగింది. విచారణకు సహకరించాలని, విధి నిర్వహణకు అడ్డు తగిలితే సహించేది లేదని స్పష్టం చేశారు.

# రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ ముఖ్యమంత్రి

## ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 27:** ప్రధాని నరేంద్ర మోడీ డైరెక్షన్‌లో సిఎం రేవంత్‌రెడ్డి కలిసి పని చేస్తున్నారు.. ఆయన ఆర్ఎస్ఎస్ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. ప్రతీ విషయంలో బీజేపీతో సీఎం రేవంత్ రెడ్డి కలిసి పనిచేస్తున్నారు. అహంకారానికి, కుటుంబ పాలనకు కేరాఫ్ అడ్రస్ రేవంత్‌రెడ్డి. బీజేపీ నాయకులే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దగ్గరుండి కాపాడుతున్నారు. మేము వాస్తవాలు బయటపెట్టగానే బీజేపీ నాయకులు మమ్మల్నే విమర్శిస్తారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ మధ్య భాగస్వామ్యం ఉంది. బీజేపీ, కాంగ్రెస్ మధ్య దోస్తీ బట్టబయలైంది. ప్రధానిని కలిసిన తర్వాత కేసీఆర్, కేటీఆర్‌పై కేసులు పెడుతామని రేవంత్‌రెడ్డి అంటున్నారు. లేనిపోని విషయాలు తెచ్చి మాకు అంటగడుతున్నారు. కల్వకుంట్ల కుటుంబాన్ని, బీఆర్ఎస్ పార్టీని టార్గెట్ చేయడమే తప్పా సీఎంకు ఇంకో ఆలోచన లేదు అని కవిత మండిపడ్డారు. కల్వకుంట్ల కుటుంబం అంటే కట్టుబాట్లతో కూడిన కుటుంబం. మేము ఎప్పుడూ ప్రొటోకాల్‌ను ఉల్లంఘించలేదు. కానీ రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారు. ప్రధానిని కలిసిన తర్వాత తన సోదరుడు తిరుపతిరెడ్డి తన నియోజకవర్గ ఇంచార్జి అని సీఎం చెప్పుకున్నారు. ముఖ్యమంత్రి సోదరులు ఇష్టారీతినా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. గుమ్మడి నర్సయ్య వంటి మహోన్నతమైన వ్యక్తిని గేటు బయట నిలబెట్టి రేవంత్ రెడ్డి తన అహంకారాన్ని ప్రదర్శించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి తెలంగాణకు రక్షణకవచంగా ఉన్న బీఆర్ఎస్‌పై కుట్రలు చేస్తున్నాయి.

రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి అంతులేని అబద్ధాలు చెబుతున్నారని కవిత విమర్శించారు. నెలకు రూ. 6500 కోట్ల వడ్డీ కడుతున్నామని అబద్దాలు చెబుతున్న సీఎం.. కాగ్ నివేదిక ప్రకారం ఏ నెల కూడా రూ.2600 కోట్లకు మించి వడ్డీ కట్టలేదు. మరి 6500 కోట్లు కడుతున్నామని సీఎం ఎందుకు అబద్ధాలు చెబుతున్నారు..? అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కనీసం ఇప్పుడైనా నిజాలు చెప్పాలి. అబద్దాలు పదేపదే చెబితే నిజమవు తాయేమోనన్న భ్రమలో సీఎం ఉన్నారు. రాష్ట్ర ఆదాయంపై కూడా రేవంత్ రెడ్డి తప్పుడు లెక్కలు చెబు తున్నారు. ఆదాయం పడిపోవడానికి ప్రధాన కారణం హైడ్రా. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా 18 వేల కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. కానీ హైడ్రా విధ్వంసం వల్ల దాని ద్వారా ఆదాయం 5800 కోట్లకు పడిపోయింది.టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు 30 ఏళ్లలో ఈ ప్రాజెక్టుపై పెట్టిన ఖర్చు 3340 కోట్లు. కానీ కేవలం 10 ఏళ్లలో కేసీఆర్ పెట్టిన ఖర్చు 3890 కోట్లు. ఇంత ఖర్చు పెట్టి 11 కీమీ మేర టన్నెల్ తవ్విస్తే ముఖ్యమంత్రి అబద్దాలు చెబుతున్నారని కవిత మండిపడ్డారు.

# అందుబాటులోకి రానున్న మరికొన్ని వర్ధమాన్ కో ఆపరేటివ్ బ్యాంక్‌లు

## బ్యాంక్ సీనియర్ వైస్ చైర్మన్ నిర్మల దాగ

**హైదరాబాద్, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త :** బ్యాంక్ విస్తరణలో భాగంగా మరికొన్ని శాఖలను త్వరలో ప్రారంభించనున్నట్లు వర్ధమాన్ (మహిళా) కో ఆపరేటివ్ బ్యాంక్ సీనియర్ ఛైర్‌పర్సన్ నిర్మల దాగ తెలిపారు. గురువారం రామ్ కోటిలోని కుచ్చిభవన్‌లో బ్యాంక్ 58 జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం బ్యాంక్‌ల ఆర్‌బిఐ బ్యాంక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించడం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది, వినియోగదారుల సహాకారం బ్యాంక్‌ల అభివృద్ధికి ఎంతో ముఖ్యమైనవన్నారు. బ్యాంక్ విస్తరణ కార్యక్రమంలో భాగంగా మణికొండ, మారేడ్ పల్లిలో రెండు శాఖలను ప్రారంభించామని, త్వరలో అత్తాపూర్ ప్రారంభిస్తామన్నారు. తమ బ్యాంక్‌లను కేవలం నగరానికి పరిమితం చేయకుండా రానున్న ఆర్థిక సంవత్సరంలో కరీంనగర్‌తో పాటు మరి కొన్ని ప్రాంతాల్లో బ్యాంక్‌లను ప్రారంభించనున్నట్లు తెలిపారు.బ్యాంక్‌ల ఆర్థిక లావాదేవీలు తగ్గడంతో గతంలో 1926 కో ఆపరేటివ్ బ్యాంక్‌ల ఉండగా అది నేటి 1472 తగ్గినట్లు తెలిపారు. కాని మన బ్యాంక్ టర్నోవర్ 65 శాతం నుంచి 75కు చేరడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.ఈ ఆర్థిక సంవత్సరం రూ.925 కోట్లు టర్నోవర్‌కు చేరిందని దీనికి కస్టమర్లకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపుతున్నా అన్నారు. ఈ సమావేశం బ్యాంక్ డైరక్టర్లు, రాజకుమారి చోర్డియా, తుషార్ సావ్లా , మహేందర్ కుమార్ జైన్ గోలేచా తదితరులు పాల్గొన్నారు.

# 'ఆదిత్య 369' గ్రాండ్ రీ-రిలీజ్

నటసింహం నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సమర్పణలో శ్రీ దేవి మూవీస్ సంస్థ నిర్మించిన తొలి భారతీయ సైన్స్‌ఫిక్షన్ చిత్రం ఆదిత్య 369 నేటి సాంకేతికతలకి అనుగుణంగా డిజిటలైజ్ చేయబడి ఈ సమ్మర్‌లో గ్రాండ్ రీరిలీజ్‌కి సిద్ధం అవుతోంది. టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ నేపథ్యంలో వచ్చిన మొదటి సినిమాగా పేరొందిన ఈ చిత్రం శివలెంక కృష్ణప్రసాద్ నిర్మాణంలో సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో రూపొందింది. శ్రీ కృష్ణదేవరాయలుగా నందమూరి బాలకృష్ణ నటన, సింగీతం దర్శక నైపుణ్యం, ఎస్. పి బాల సుబ్రహ్మణ్యం గాత్రం సమర్పణ, జంధ్యాల సంభాషణలు, ఇళయరాజా అద్భుత సంగీతం, శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మాణవిలువలు, ఇతర నటీనటుల ప్రతిభ, అబ్బురపరిచే సెట్స్, ఫైట్స్, దుస్తులు, నృత్యం ఇలా ప్రతీ ఒక్కరు చరిత్రలో నిలిచిపోయేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్ద డంలో ముఖ్య పాత్రలు పోషించారు. చలన చిత్ర పరిశ్రమలో ఎన్నోసినిమాలు ఉన్నా, కొన్ని ప్రజల హృదయాల్లో, కళాభిమానుల లైబ్రరీలలో ఉండి పోయేవి, వాళ్లు ఎప్పుడూ మాట్లాడుకునేవి ఉంటాయి. ఆ కోవకు చెందిన చిత్రమే ఆదిత్య 369. రీ రిలీజ్ సందర్భంగా నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, "ఆదిత్య 369 మొదటిసారి విడుదల సమయంలో ఎంతఉత్సాహంగా, ఆసక్తిగా ఉన్నానో, ఇపుడు రీ రిలీజ్‌కి కూడా అలాగే ఉన్నాను. ఎన్ని సార్లు చూసినా కనువిందు చేసే ఈ ట్రెండ్ సెట్టింగ్ చిత్రాన్ని డిజిటల్ 4కెలో ఇంకా అద్భుతంగా తీర్చదిద్దాం. అన్ని వయసుల, వర్గాల ప్రేక్షకులని, నందమూరి అభిమానులను అలరించిన ఈ చిత్రాన్ని మళ్ళీ మీ ముందుకు తీసుకు వస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఎన్నో మంచి చిత్రాలు తెరకెక్కించిన నాకు, మా నిర్మాణ సంస్థకి ఒక గొప్ప గుర్తింపు, అద్భుతమైన పునాది ఆదిత్య 369తోనే. ఈ సమ్మర్‌లో గ్రాండ్‌గా రీరిలీజ్ చేయడానికి పూర్తి సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు.



# 'చంద్రేశ్వర' నుంచి శివుని సాంగ్

శివ బాలాజీ ఫిలింస్ పతాకంపై బేబీ అల సమర్పణలో సురేష్ రవి, ఆశా వెంకటేష్ హీరో హీరోయిన్లుగా జీవి పెరుమాళ్ వర్ధన్ దర్శకత్వంలో డాక్టర్ రవీంద్ర చారి నిర్మించిన ఎమోషనల్ ఎంటర్‌టైనర్ చంద్రేశ్వర. ఈ సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా చంద్రేశ్వర సినిమాలోని శివుని పాటను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నటుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ, మహా శివరాత్రి పర్వదినం రోజు చంద్రేశ్వర సినిమా నుంచి శివుని పాటను రిలీజ్ చేయడం గొప్ప సందర్భం. శివుని పాట చాలా బాగుంది. ఆ శివుడి దయ మీ మీద ఉండాలి. ఇలాంటి మంచి ప్రయత్నం చేసిన నిర్మాత రవీంద్రచారి, దర్శకుడు పెరుమాళ్ వర్ధన్‌కు అభినందనలు. సినిమా అంటే ప్యాషన్ మాత్రమే కాదు డబ్బు కూడా నిర్మాతకు రావాలని కోరుకుంటున్నా. అన్నారు. డైరెక్టర్ కమ్ ఆర్టిస్ట్ ఈశ్వర్ మాట్లాడుతూ, నిర్మాత రవీంద్రచారి చంద్రేశ్వర మూవీతో మన సనాతన ధర్మం, దేవాలయాల నేపథ్యంతో మంచి సినిమా చేస్తున్నారు. ఈ సినిమాకు అంతా మంచే జరగాలని గత వారం ప్రయాగరాజ్ వెళ్లి పూజ చేసి వచ్చారు. ఆయన మన హిందూధర్మం గురించి ఎప్పుడూ మాట్లాడుతుంటారు. అలా నాకు ఆయన కనెక్ట్ అయ్యారు. ఇటీవల ఛావా సినిమా బాలీవుడ్‌లో సూపర్ హిట్ అయ్యింది. అలాగే చంద్రేశ్వర సినిమా పెద్ద విజయం సాధించాలి. రవీంద్రచారి ఇలాంటి మరిన్ని మంచి మూవీస్ చేయాలన్నారు. నటుడు గాలిపటాల సుధాకర్ మాట్లాడుతూ చంద్రేశ్వర వంటి మంచి మూవీ చేస్తున్న నిర్మాత రవీంద్రచారికి నా ప్రశంసలు అందిస్తున్నా. ఆయన ఇలాంటి మరెన్నో మంచి సినిమాలు చేయాలి. ప్రొడ్యూసర్స్ బాగుంటేనే ఇండస్ట్రీ బాగుంటుంది. మా లాంటి కొత్త వాళ్లకు అవకాశాలు వస్తాయి. శివుని పాట చాలా బాగుంది. అన్నారు. జబర్దస్త్ వినోదిని మాట్లాడుతూ, చంద్రేశ్వర పేరులో చంద్రుడు, ఈశ్వరుడు ఉన్నారు. అలాంటి మంచి టైటిల్‌తో ఈ సినిమా రావడం సంతోషంగా ఉంది. శివుని పాట చాలా బాగుంది అన్నారు. జబర్దస్త్ గడ్డం నవీన్ మాట్లాడుతూ, చంద్రేశ్వర సినిమా కంటెంట్ చూస్తుంటే సినిమా తప్పకుండా థియేటర్స్‌లో చూడాలి అనిపిస్తోంది. శివుని పాట చాలా బాగుంది. ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణ పొందాలని కోరుకుంటున్నా అన్నారు. నటి సంజనా చౌదరి మాట్లాడుతూ, చంద్రేశ్వర మూవీలోని శివుని పాట చూస్తుంటే శివరాత్రి పండుగ ఇక్కడే జరుగుతోంది అనిపిస్తోంది. ఈ మధ్య కంటెంట్ ఓరియెంటెడ్ మూవీస్ రావడం లేదు.



# 'ఛావా' తెలుగు రిలీజ్‌కు రెడీ



ఛత్రపతి శంభాజీ మహారాజ్ వీరగాధని వివరించే చారిత్రక ఇతిహాసం, అపూర్వమైన ప్రశంసలు అందుకొని సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతున్న బ్లాక్ బస్టర్ ఛావా తెలుగు రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. మొదట హిందీలో విడుదలైన ఈచిత్రం ప్రేక్షకుల డిమాండ్‌కు అనుగుణంగా ఇప్పుడు మార్చి 7, 2025న తెలుగులో డబ్ చేయబడి థియేటర్లలో విడుదల కానుంది. సౌత్ ఇండియన్ సినిమా పవర్‌హౌస్ అయిన ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్స్ ద్వారా ఛావా తెలుగులో రిలీజ్ కానుంది. 300 కంటే ఎక్కువ బ్లాక్ బస్టర్ తెలుగు, హిందీ, ఇంగ్లీష్ చిత్రాలను రిలీజ్ చేసిన ట్రాక్ రికార్డ్ వున్న గీతా ఆర్ట్స్ ఛావా సినిమాప్రతి మూలకు చేరేలా చూసుకోవడానికి పర్ఫెక్ట్ పార్ట్నర్. దినేష్ విజన్ మాడ్డాక్ ఫిల్మ్స్ నిర్మించిన ఛావాలో విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో నటించారు. రష్మిక మందన్న యేసుబాయి భోంస్లేగా, అక్షయ్ ఖన్నా ఔరంగజేబుగా, దయానా పెంటీ జినత్‌ఉన్‌నిస్సా బేగంగా, అశుతోష్ రాణా హంబిర్రావ్ మోహితేగా, దివ్య దత్తా సోయారాబాయిగా నటించారు. ఫిబ్రవరి 14న విడుదలైనప్పటి నుండి ఈ చిత్రం రికార్డు స్థాయిలో వసూళ్లు సాధించింది. అద్భుతమైన కథనం, పెర్ఫార్మెన్స్, ఛత్రపతి శంభాజీ మహారాజ్ వారసత్వానికి శక్తివంతమైన నివాళితో, ఛావా ప్రేక్షకుల హృదయాల్లో అత్యున్నత స్థానాన్ని సంపాదించుకుంది.

# 'తల్వార్' ఆడియో సూపర్

యంగ్ టాలెంటెడ్ హీరో ఆకాష్ జగన్నాథ్ నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ "తల్వార్". ఈ సినిమాను వార్నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై భాస్కర్ ఇ.ఎల్.వి నిర్మిస్తున్నారు.యువ దర్శకుడు కాశీ పరశురామ్ రూపొందిస్తున్నారు. ఈయన ఇంతకు ముందు అశ్వత్థామ, లక్ష్య సినిమాలకి రైటర్‌గా పని చేసి 'రణస్థలి' అనే సినిమా డైరెక్ట్ చేసారు. ఈచిత్రంలో పూరి జగన్నాథ్, ప్రకాష్ రాజ్, షిన్ టామ్ చాకో, అనసూయ భరద్వాజ్, అజయ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా "తల్వార్" సినిమా నుంచి పవర్ ఫుల్ ఆడియో గ్లింప్స్ రిలీజ్ చేశారు. 'తల్వార్' ఆడియో గ్లింప్స్ ఆద్యంతం ఆకట్టుకునేలా సాగింది. వాయిస్ ఓవర్‌లో ఆకాష్ జగన్నాథ్ తరతరాలుగా జరుగుతున్న యుద్ధం, రక్తపాతం గురించి పవర్ ఫుల్ డైలాగ్ చెప్పారు. యుద్ధం జరిగే తీరు మారినా..చివరకు రక్తపాతంతో ముగుస్తోందనే డైలాగ్ ఇంప్రెస్ చేయగా, అధర్మంతో అయినా ధర్మాన్ని గెలిపించేందుకు సిద్ధ మంటూ కథానాయకుడు చెప్పిన డైలాగ్ ఈ ఆడియో గ్లింప్స్‌కు హైలైట్‌గా నిలుస్తోంది. రీసెంట్‌గా షూట్ స్టార్ట్ అయిన "తల్వార్" సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వచ్చేందుకు సిద్ధమవుతోంది. నటీనటులు: ఆకాష్ జగన్నాథ్, ప్రకాష్ రాజ్, పూరి జగన్నాథ్, షిన్ టామ్ చాకో, అనసూయ భరద్వాజ్, అజయ్, తదితరులు





ఐశ్వర్య మీనన్ నయా లుక్

# 'యుఫోరియా' మేకింగ్ గ్లింప్స్

గుణ హ్యాండ్ మేడ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద నీలిమ గుణ నిర్మాణంలో గుణ శేఖర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'యుఫోరియా'. నూతన నటీనటులు, సీనియర్ యాక్టర్స్ కాంబోలో గుణ శేఖర్ ఓ ట్రెండీ టాపిక్ మీద ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. నేటి సమాజాన్ని ప్రతిబింబించేలా సాగే ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ తాజాగా పూర్తయింది. ఈ మేరకు మేకర్లు అప్డేట్ ఇచ్చారు. యుఫోరియా షూటింగ్ పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. యుఫోరియా టైటిల్ గ్లింప్స్, కాన్సెప్ట్ తెలియజేసేలా వదిలిన వీడియో అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంతో విఘ్నేశ్ గవిరెడ్డి టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండగా సీనియర్ నటి భూమిక ఇందులో ముఖ్య పాత్రలో కనిపించబోతోన్నారు. సారా అర్జున్, నాజర్, రోహిత్, లిఖిత యలమంచలి, పృథ్వీరాజ్ అడ్డాల, కల్పలత, సాయి శ్రీనిక రెడ్డి వంటి వారు ఇతర పాత్రల్లో నటించారు. షూట్ పూర్తి అంటూ మహా శివరాత్రి సందర్భంగా మేకింగ్ వీడియోను విడుదల చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను చిత్ర యూనిట్ ప్రారంభించింది. ఇక త్వరలోనే ఈ మూవీని ఆడియెన్స్ ముందుకు తీసుకు రాబోతోన్నారు. నటీనటులు: భూమిక చావ్లా, సారా అర్జున్, నాసర్, రోహిత్, విఘ్నేష్ గవిరెడ్డి, లిఖిత యలమంచలి, అడ్డాల పృథ్వీరాజ్, కల్ప లత, సాయి శ్రీనికా రెడ్డి, అశ్రిత వేముగంటి, మాథ్యూ వర్గీస్, ఆదర్శ్ బాల కృష్ణ, రవిప్రకాష్, నవీనా రెడ్డి.




# 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే' టైటిల్ లాంచ్

తెలుగు సినిమా ఇండస్ట్రీలోనే తొలి ప్రయత్నంగా, దేశముదురు హీరోయిన్ హన్సిక మోత్వాని లీడ్ రోల్‌గా "105 మినిట్స్" అనే సింగిల్ షాట్, సింగిల్ క్యారెక్టర్ మూవీతో ఒక వినూత్న ప్రయోగం చేసిన దర్శకుడు రాజా దుస్సా, ఇప్పుడు తన తదుపరి చిత్రంగా తెలంగాణ యాస భాష నేపథ్యంలో "అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే" అంటూ పూర్తి వినోదాత్మకమైన చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాని "శ్రీ రామకృష్ణ సినిమా" బ్యానర్‌లో గాలి కృష్ణ నిర్మిస్తున్నారు. సహ నిర్మాతలుగా నాంపల్లి సోమాచారి, అలూరి రాజిరెడ్డి, రూప కిరణ్ గంజి వ్యవహరిస్తున్నారు. ఈ కథ విషయానికి వస్తే 1980 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం వరంగల్ జిల్లాలో జరిగిన ఒక యదార్థ సంఘటనను తీసుకొని ఈ చిత్రాన్నిపూర్తి వినోదాత్మకంగా రూపొందిస్తున్నామని దర్శకుడు రాజా దుస్సా వెల్లడించారు. ఈ చిత్రానికి కెమెరామెన్‌గా వేణు మురళీధర్.వి, ఎక్జ్క్యూటివ్ ప్రొడ్యూసర్‌గా కార్తికేయ శ్రీనివాస్ (వాసు) పని చేస్తున్నారు. నటినటుల్ని మిగతా సాంకేతిక వర్గాన్ని త్వరలోనే తెలియ జేస్తామని చిత్రం యూనిట్ తెలిపింది. రచన, దర్శకత్వం: రాజా దుస్సా నిర్మాతలు: గాలి కృష్ణ.




# 'ది ఐ'తో హాలీవుడ్‌కు శృతిహాసన్

ప్రఖ్యాత భారతీయ నటి శ్రుతిహాసన్ డాఫ్నే ష్మోన్ దర్శకత్వం వహించిన సైకలాజికల్ థ్రిల్లర్ 'ది ఐ'తో గ్లోబల్ ఆడియెన్స్‌కు పరిచయం కాబోతోన్నారు. ఫిబ్రవరి 27 నుండి మార్చి 2, 2025 వరకు జరిగే హర్రర్, సైన్స్ ఫిక్షన్, ఫాంటసీ చిత్రాలను 5వ వెంచ్ ఫిల్మ్ ఫెస్టివల్ గ్రాండ్‌గా జరగబోతోంది.ఈ ఈవెంట్ ప్రారంభ ఫీచర్‌గా 'ది ఐ' చిత్రం ఇండియా తరుపున ప్రీమియర్ కానుంది. దయానా (శృతి హాసన్) తన భర్త ఫెలిక్స్ (మార్క్ రౌలీ) కోసం చేసే ప్రయాణమే ఈ 'ది ఐ'. చనిపోయిన తన భర్తను మళ్లీ తిరిగి తీసుకు వచ్చేందుకు వచ్చే ప్రయత్నాలు ఎంతో ఆసక్తిగా ఉండబోతోన్నాయని టీజర్ చూస్తేనే అర్థం అవుతోంది. తన భర్తను వెనక్కి తిరిగి తెచ్చుకునేందుకు భార్య చేసి త్యాగాలు ఏంటి? ప్రయత్నాలు ఏంటి? అన్నది ఆసక్తికరంగా మారింది. గ్రీస్, ఏథెన్స్, కోర్ఫులోని అందమ్కైన లొకేషన్‌లో చిత్రీకరించిన సీన్లు ఆడియెన్స్‌ను మెప్పించేలా ఉన్నాయి. 2023లో లండన్ ఇండిపెండెంట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో, గ్రీక్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'ది ఐ'ని ప్రదర్శించిన తర్వాత ప్రాజెక్ట్‌పై అందరిలోనూ మరింతగా ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా శృతిహాసన్ మాట్లాడుతూ, సైకలాజికల్ థ్రిల్లర్‌లు ఎప్పుడూ నన్ను ఆకర్షిస్తూనే ఉంటాయి. మానవ భావోద్వేగాలు, దుఃఖం, అతీంద్రియ శక్తులు వంటి కాన్సెప్ట్‌లతో తీసే సినిమాలంటే నాకు చాలా ఇష్టం. మొత్తం మహిళల నేతృత్వంలోని ప్రొడక్షన్ హౌస్‌లో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించడం విశేషం. చలనచిత్ర పరిశ్రమలో మహిళలకు మద్దతు ఇవ్వాలనే నా అభిరుచికి అనుగుణంగా ఈ ప్రాజెక్ట్ ఉంటుంది' అని అన్నారు. డాఫ్నే ష్మోన్ మాట్లాడుతూ, 'ది ఐ సినిమాలోని పాత్ర శృతి హాసన్‌కు అద్భుతంగా అనిపిస్తుంది. ఎమోషన్స్, సంఘర్షణ ఇలా అన్ని రకాల ఎమోషన్స్‌ను చూపించే దయానా పాత్రలో శృతిహాసన్ చక్కగా నటించారు. శ్రుతిహాసన్ ఎంతో పొటెన్షియల్ ఉన్న నటి. ఈ పాత్రకు ఆమె న్యాయం చేశారు. ఆమె అద్భుతమ్కైన నటన ప్రేక్షకుల్కపై శాశ్వత ప్రభావాన్ని చూపుతుంద'ని అన్నారు. పర్యా వరణానికి ఎలాంటి హాని కల్గించకుండా ఈ మూవీని షూట్ చేశారు. ప్రకృతిని హాని కల్గించకుండా సినిమాలుచేయడంలో భవిష్యత్ ప్రాజెక్ట్‌లకు ఇదొక ఉదాహరణగా నిలుస్తుంది. వేలిముద్ర కంటెంట్ గురించి ఫింగర్ ప్రింట్ కంటెంట్ అనేది అద్భుతమైన కంటెంట్‌ను ఆడియెన్స్‌కు ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తుంది. సామాజిక సమస్యలను తెర్కపెకి తీసుకు వచ్చి అందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతోంది. చిత్రీకరించే విధానంలో మార్పును తీసుకురావడం, ప్రపంచంలోని అత్యంత ఉత్తేజకరమైన కథకులకు వారి లోతైన అభిరుచిని తీసుకురావడం, అసమానత, జాతి, లింగం బేధాలు లేకుండా అందరినీ అలరించేలా ప్రాజెక్ట్‌లు రూపొందించడమే లక్ష్యంగా వెళ్తోంది.



# లక్కీ భాస్కర్ టాప్ రికార్డ్

దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం లక్కీ భాస్కర్. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. అక్టోబర్ 31, 2024 న విడుదలైన థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలతో పాటు, ప్రేక్షకుల మెప్పు పొందింది. బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురిపించిన లక్కీ భాస్కర్, దుల్కర్ సల్మాన్ కెరీర్ లోనే అత్యధిక వసూళ్లు రాబట్టిన చిత్రంగా నిలిచింది. తాజాగా ఈ చిత్రం మరో చరిత్ర సృష్టించింది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో లక్కీ భాస్కర్ చిత్రం స్ట్రీమింగ్ అవుతోంది. ఈ చిత్రానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు బ్రహ్మరథం పడుతున్నారు. దాంతో నెట్‌ఫ్లిక్స్‌లో వరుసగా 13 వారాల పాటు ట్రెండ్ అయిన మొదటి దక్షిణ భారతీయ చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. కట్టి పడేసే కథా కథనాలు, నటీనటుల అద్భుత నటన, సాంకేతిక నిపుణుల పనితీరు ఇలా అన్నీ తోడై లక్కీ భాస్కర్‌ను గొప్ప చిత్రంగా నిలిపాయి. అందుకే అప్పుడు థియేటర్లలో, ఇప్పుడు ఓటీటీలో ఈ స్థాయి స్పందన లభిస్తోంది. ఈ చిత్రం యొక్క వైవిధ్యమైన కథాంశం, భాషతో సంబంధం లేకుండా అందరి మన్ననలు పొందుతోంది. జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం కథకి ప్రాణం పోసింది. ఇక భాస్కర్ పాత్రలో ఒదిగిపోయిన దుల్కర్ సల్మాన్, తన అత్యుత్తమ నటనతో సినిమాని మరో స్థాయికి తీసుకెళ్ళారు. అలాగే చిత్రాన్ని ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయేలా చేశారు. నెట్‌ఫ్లిక్స్‌లో ప్రీమియర్‌ని ప్రదర్శించినప్పటి నుండి, లక్కీ భాస్కర్ చిత్రం స్ట్రీమింగ్ ట్రెండ్‌లలో ఆధిపత్యం చెలాయించింది. మిలియన్ల కొద్దీ వీక్షణలను పొందడంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా ఎందరో ప్రేక్షకులకు అభిమాన చిత్రంగా మారింది. మొదటి వారంలో ఏకంగా 15 దేశాలలో నెట్‌ఫ్లిక్స్ యొక్క టాప్ 10లో మొదటి స్థానాన్ని పొందింది. అలాగే 17.8 బిలియన్ నిమిషాల వీక్షణలతో, రెండు వారాల పాటు ప్రపంచవ్యాప్తంగా రెండవ స్థానంలో నిలిచింది. ఇక ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్‌లో వరుసగా 13 వారాల పాటు ట్రెండ్ అయిన తొలి సౌత్ ఇండియన్ సినిమాగా చరిత్ర సృష్టించింది. నెట్‌ఫ్లిక్స్‌లో లక్కీ భాస్కర్ చిత్రం సరికొత్త చరిత్ర సృష్టించడంతో చిత్ర బృందం సంతోషం వ్యక్తం చేసింది. మీలో ఎవరైనా ఇంకా ఎవరైనా లక్కీ భాస్కర్ చిత్రాన్ని చూడనట్లయితే వెంటనే నెట్‌ఫ్లిక్స్‌లో వీక్షించి, భాస్కర్ ప్రయాణాన్ని ఆస్వాదించండి.



# ఎమోషనల్ హారర్ ఫిల్మ్ 'శబ్ధం'

వైశాలితో సూపర్‌హిట్‌ని అందించిన హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్‌లు రెండోసారి మరో ఇంట్రస్టింగ్ సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ 'శబ్దం' కోసం చేతులు కలిపారు. 7బి ఫిల్మ్స్ శివ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సిమ్రాన్, లైలా, లక్ష్మీ మీనన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్‌తో సినిమాపై క్యురియాసిటీ పెంచాయి. ఈ సినిమా ఫిబ్రవరి 28న ఆంధ్రాలో ఎన్ సినిమాస్, నైజాంలో మైత్రి డిస్ట్రిబ్యూషన్ ద్వారా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో ఆది పినిశెట్టి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

**'శబ్దం' హారర్ సినిమాల్లో ఎంత డిఫరెంట్‌గా వుంటుంది?** శబ్దం మంచి కథా బలం ఎమోషన్ వున్న హారర్ జోనర్ సినిమా. రెగ్యులర్ హారర్ సినిమాలకి చాలా భిన్నంగా వుంటుంది. ఆత్మలని ఒక సైంటిఫిక్ మెథడ్‌లో అన్వేషించే విధానం చాలా కొత్త అనుభూతిని ఇస్తుంది. స్క్రీన్ ప్లే చాలా ఇంట్రస్టింగ్‌గా వుంటుంది. ఇలాంటి సినిమాలు తీయడం కూడా కష్టమే. ఇలాంటి వరల్డ్‌ని ఇంతకు ముందు ఎవరూ చూపించలేదు. హారర్ సినిమాల్లో వైశాలి ఎంత డిఫరెంట్ సినిమానో శబ్దం కూడా అంత డిఫరెంట్‌గా స్పెషల్‌గా వుంటుంది. టెక్నికల్‌గా సినిమా చాలా రిచ్‌గా వుంటుంది.

**శబ్దంలో సౌండ్ రోల్ ఏమిటి?** ఇందులో నాది పారానార్మల్ ఇన్వెస్టిగేటర్ క్యారెక్టర్. తను ఆత్మలని సౌండ్‌తోనే పసిగడుతుంటాడు. సౌండ్ అనేది ప్రతి సీన్‌లో ఇంపార్టెన్స్ వుంటుంది. నిజానికి నేను ఆత్మలని నమ్మను. కానీ ఈ సినిమా కోసం మెటీరియల్ చదువుతున్నపుడు నిజంగా అలాంటి అదృశ్యశక్తులు ఉంటాయోమో అనిపించింది.

**డైరెక్టర్ అరివళగన్ గురించి?** మా డైరెక్టర్ అరివళగన్‌కి థాంక్ యూ చెప్పాలి. వైశాలి ఇప్పుడు చూసిన రిలవెంట్‌గా వుంటుంది. కథలో వున్న నిజాయితీ అది. అదే నిజాయితీతో శబ్దం తీశాం. వైశాలి సినిమా కూడా హారర్. అది నా కెరీర్ స్పెషల్ మూవీ. అలాగే శబ్దం సినిమా కూడా స్పెషల్ మూవీ. మేము ఎప్పటినుంచో సినిమా చేయాలని అనుకున్నాం. వైశాలి లాంటి కొత్త కథ కాన్సెప్ట్ కుదరాలి. అలాంటి కథ శబ్ధంతో కుదిరింది. సినిమా థియేటర్స్ లో చూడాలనే ఆసక్తిని కలిగించేలా వుంటుంది. చాలా మంచి ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది.

**సిమ్రన్, లైలా పాత్రల గురించి?** సిమ్రన్, లైలా నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. వారి పాత్రలు సినిమాలో చాలా కీలకంగా వుంటాయి. క్యారెక్టర్స్ చాలా ఫ్రెష్‌గా అనిపిస్తాయి.

**నాని సినిమా చూసి ఏమన్నారు?** తెలుగులో ఈ సినిమాని నానికే ఫస్ట్ చూపించాను. హారర్ జానర్ తనకి చాలా ఇష్టం. తనకి చాలా నచ్చింది. హార్ట్ ఫుల్‌గా బావుందని చెప్పారు. ఇలాంటి సినిమాలకి నాని లాంటి స్టార్ వర్డ్ చాలా ముఖ్యం. ఆయన ప్రీరిలీజ్ ఈవెంట్‌కి రావడం మాకు చాలా హెల్ప్ అయ్యింది.

**హారర్ సినిమాలు మీకు ఇష్టమా?** మంచి కథా బలం స్క్రీన్ ప్లే వున్న హారర్ సినిమాలని ఇష్టపడతాను. ఈ జోనర్‌లో సినిమాలు చేయడానికి ఇష్టపడతాను.

**తమన్ మ్యూజిక్ గురించి?** ఇలాంటి సినిమాలకి మ్యూజిక్ చాలా ఇంపార్టెంట్. తమన్ మ్యూజిక్ మాకు చాలా ప్లస్ అయ్యింది. ఆయన పెద్ద సినిమాలు చేస్తూ కూడా మా సినిమాకి మ్యూజిక్ చేశారు. సినిమాకి ఎంతకావాలో అంతకంటే అద్భుతంగా చేశారు. సినిమా చూస్తున్నపుడు మ్యూజిక్‌ని చాలా ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమాకి టెక్నికల్ టీం అద్భుతంగా పని చేసింది. సౌండ్ డిజైన్ చాలా అద్భుతంగా వుంది. కెమరామెన్ అరుణ్ అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. ఆర్ట్ వర్క్ కూడా మెస్మరైజింగా అనిపిస్తుంది. ప్రతి క్రాఫ్ట్ చాలా ప్రేమతో సినిమా చేశారు.



# మనసారా నవ్వేద్దాం !



నవ్వు నాలుగు విధాల మంచిది అని కొందరంటే, నవ్వు నాలుగు విధాల చేటు.. అని మరికొందరంటారు. మెడ.. ఎవరెలా అన్నా.. అందమైన చిరునవ్వు ముందు అన్నీ దిగదుడుపే అనడంలో సందేహం లేదు. ఎందుకంటే మనసారా నవ్వే ఓ చిరునవ్వు ఇచ్చే అనుభూతిని, ఆత్మవిశ్వాసాన్ని మారేది ఇవ్వలేదు. మరి, నవ్వుతో ఇంకా ఎలాంటి ప్రయోజనాలున్నాయో తెలుసుకుందామా?!

**ఆనందం... ఆత్మవిశ్వాసం...** మీరు నిజంగా ఆనందంగా ఉన్న విషయం మీ ముఖ కవళికల ద్వారా తెలిసిపోతుంది. నవ్వు "మనసుకి ప్రశాంతతని, అహ్లాదాన్ని కలిగిస్తుంది. మనం ఇతరులను నవ్వుతూ పలకరిస్తే వారి. నుంచి జవాబు మరింత సానుకూలంగా వస్తుంది. మనలో ఆత్మవిశ్వాసం, ఆనందం రెట్టింపవుతాయి. మీ నవ్వు ద్వారానే మీలో ఉన్న సానుకూల గుణాలు బయటపడతాయి. దీనితో ఎదుటివారు కూడా మీకు నిజాయతీగా దగ్గరవుతారు. నవ్వు మన అందాన్ని ఇనుమడింపజేయడమే కాదు.. ఆరోగ్యం, పనిలో చురుకుదనాన్ని అందిస్తుంది. కళ ద్వారా ఎదుటివారి భావాలను ఎలా తెలుసుకోవచ్చో. అలాగే నవ్వుతో కూడా ఎదుటివారి భావాలు, ప్రవర్తనను ఇట్టే కనిపెట్టేయచ్చంటున్నారు నిపుణులు. అలాగే ఏదైనా చిన్న సమస్యలో ఉన్నప్పుడు ఓ చిరునవ్వు నవ్వితే చాలు.. మన సమస్యలన్నీ దూరమై మనసుకి ప్రశాంతత చేకూరుతుంది. ఇదే విధంగా ఇదేవిధంగా నవ్వుతో ఇతరుల సమస్యలను దూరం చేస్తూ వారిలో పాజిటివిటీని నింపచ్చు.



# ఆమె ధైర్యం ఎన్నో తరాలకు విజయం !



**ఒక మహిళ ధైర్యం చేసి ముందడుగు వేస్తే చాలు. తరవాత ఎన్నో తరాలు ఆమె బాటలో నిర్భయంగా సాగిపోతాయి. అందుకు సాంగ్వన్ కుటుంబమే ఉదాహరణ. ఒకటీ రెండూ కాదు. ఏకంగా నాలుగు తరాలు గెలుపు బాటపట్టాయి. ఊరికే స్ఫూర్తిగా నిలిచాయి. వాళ్ల కథేంటంటే..**

బ్లాక్ అండ్ వైట్ దుస్తుల్లో కాక్‌పిట్‌లోకి అడుగుపెట్టింది 22 ఏళ్ల జెనిత్ గెహ్లోవత్, కూర్చున్న సీటుబెల్టు పెట్టుకుని, టేకాఫ్ అంతా సరిగా ఉందా అని సీరియస్‌గా చెక్ చేస్తోంది. పక్కనుంచి 'నిజంగా భయంగా లేదా అని అడుగుతున్నారు కోచ్. ' భయమెందుకు? చాలా ఉత్సాహంగా ప్రదర్శించా అని సమాధాన మిచ్చింది. తొలిసారి సోలోగా విమానం నడప బోతోందామె. అయినా భయం లేదు.(బామ్మ రాంచీకి 108 ఏళ్లు. పరుగులో ప్రపంచ రికార్డులు బద్దలుకొట్టింది. జాతీయ అంతర్జాతీయ స్థాయుల్లో 300కుపైగా పతకాలు కొల్లగొట్టింది. అమ్మమ్మ సంతానం కూడా పరుగులో మేటే ప్రారంభించింది 2021లోనే అయినా పతకాలెన్నో గెలుచుకుంది. పచ్చని పొలాలు, ఇల్లే లోకంగా బతికిన వీళ్ల మలి వయసులో క్రీడాకారిణులయ్యారు. అందరి ధైర్యం.. షర్మిలా సాంగ్వన్. జెనిత్ వాళ్లమ్మ తను. వయసు 42 పన్నెండో తరగతి ఫలితాలు ఇంకా రానేలేదు... షర్మిలకి పెళ్లైంది. భర్త జైసింగ్ గెహ్లోవత్ బ్యాంకు ఉద్యోగి, జెనిత్‌కి అయిదేళ్లు, రెండోపాప జాస్మిన్ కడుపులో ఉండగా యాక్సిడెంట్‌లో ఆయన చనిపోయారు. ఇద్దరు పిల్లలు, ఇద్దరు పెద్దవాళ్లు తనపై ఆధారపడి ఉన్నారు. దీంతో బాధ దిగమింగుకుని భర్త ఉద్యోగంలో చేరారు షర్మిల పని కొత్త, దీనికితోడు వేధింపులు అయినా కుటుంబం కోసం తట్టుకుని నిలబడ్డాడు. నేర్చుకుంటూ ఉద్యోగంలో కొనసాగుతున్నారు. తన భర్తకి ఆమె ఏదైనా వాహనం నడిపితే చూడాలని కోరిక వ్యాపకంగా ఉంటుందని వాహనాలు నడపడం నేర్చుకున్నారు. అదామెకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఉద్యోగం చేస్తూనే భారీ వాహనాలు నడిపేవారు ఉద్యోగం ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో బస్‌గా చేరిన డ్రైవర్ షర్మిల బెస్ట్ డ్రైవర్ అవార్డు అందుకున్నారు. ఆత్మవిశ్వాసం తనవాళ్లకీ రావాలని తల్లినీ, బామ్మనీ ఆటల దిశగా ప్రోత్సహించారు. షర్మిల హరియాణ అనగానే ఆటలే గుర్తొస్తాయి కదా! కానీ వీళ్ల ఊరు జోజూ కాలాన్ మాత్రం వీటికి కాస్త దూరమే, దీంతో ఆటల పేరుతో రాంబీ, సంత్ర పరుగులు పెడుతోంటే ఊళ్లోవాళ్ళు అడ్డుకున్నారు. అయినవాళ్లు ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. అయినా పర్మల వాటిని పట్టించుకోలేదు. అమ్మనీ, బామ్మనీ ట్రక్‌లో ఎక్కించుకుని మరీ వివిధ రాష్ట్రాల్లో పోటీలకే కాదు. అంతర్జాతీయ పోటీలకు తీసుకెళ్లారు రాంబీ ఇంటర్వ్యూ జాతీయ, అంతర్జాతీయ మీడియా పోటీపడ్డాగానీ వాళ్లలో మార్పు రాలేదు. కూతుళలకు డ్రైవింగ్ నేర్పారు షర్మిల. చిన్న చిన్న కారు కాదు. టూరీ వాహనాలపై శిక్షణ ఇచ్చేవారు. అంత పెద్ద వాహనం తన ఆధీనంలో ఉందన్న ఆలోచనని ఇష్టపడవారమె జెనిత్‌కీ అదే అలవాటైంది. అయితే తన మరో అడుగు ముందుకేసి విమానాన్ని ఎంచుకుంది. తాజాగా ఆ శిక్షణలోనే ఉందామె ఇంకొన్ని నెలల్లో పైలట్ శిక్షణ పూర్తి చేసుకుంటుంది తను. అనారోగ్యం కారణంగా ప్రస్తుతం రాంచీ పోటీల్లో పాల్గొనలేదు కానీ ఈ నాలుగు తరాల సాంగ్వన్ కుటుంబం మాత్రం అప్పటిదాకా తెలియని ఆ ఊరుని ప్రపంచానికి పరిచయం చేసింది. ఒకప్పుడు పరువు తీస్తున్నారన్నవాళ్లే వాళ్లని పొగుడుతున్నారు. ఇంతటి పోరాటం చేసిన అమ్మ, ఘనత సాధించిన అమ్మమ్మ, బామ్మలు ఉన్నారు కాబట్టి, జెనిత్ అంత వైద్యం ఉద్యోగంలో చేరినప్పుడు, స్టీరింగ్ చేతిలో పట్టినప్పుడు మహిళవి... ఇవన్నీ నీకు కాయచేవారు. ఓవైపు ఒంటరినయ్యాననే బాధ అలాగని నాపై ఆధార పడిన కుటుంబాన్ని వదిలేయలేను. అందుకే ఎవరేమన్నా పట్టించుకోలేదు. ఎప్పుడైనా ఎవరైనా నిన్ను అడ్డుకుంటున్నప్పుడే మరింత ప్రయత్నించాలి. కాదన్న వారికి నిరూపించి చూపాలి. నేను నమ్మిన 'సూత్రమిది' అంటారు షర్మిల, కూతుళ్లకే ఇదే మారిపోయింది. కాబట్టి వాళ్లకే భయమన్నది తెలియదు. రెండో కూతురు జాస్మిన్ ఆటలతో పాటు కెరియర్ని ఎంచుకునే పనిలో ఉంది. అన్నట్లూ షర్మిల క్రీడాకారిణి కూడా. ఆమెకి కొత్తగా ఓ కోరిక. తనూ విమానం నడపాలని ఆదీ సాదుస్తారేమో.



# సైకిల్ సింకింగ్ ప్రయత్నించారా?

పీరియడ్..

**చాలామంది అమ్మాయిల మూడ్ స్వింగ్స్, పొత్తికడుపు నొప్పి, చిరాకు వంటి వాటితో ఇబ్బందిపడే సమయమిది. ఎంత బాధ చూస్తుంది 'ప్రతినెలా ఇది మామూలే కదా' అనుకుంటూ మౌనంగా భరిస్తూ ఉంటారు. కానీ, ఆ అవసరం లేదంటున్నారు. నిపుణులు. అందుకోసం "సైకిల్ సింకింగ్‌ను ప్రయత్నించమంటున్నారు. ఇంతకీ ఈ కొత్త ట్రెండేంటో తెలుసుకుందామా?**

సైకిల్ సింకింగ్ ప్రధాన ఉద్దేశం... నెలసరి శారీరకంగా, మానసికంగా మనల్ని ఎలా ప్రభావితం చేస్తుందో అర్థం చేసుకుంటూ దానికి తగ్గట్లు జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. అందుకోసం ముందుగా రుతుచక్రాన్ని అర్థం చేసు కోవాలి. సాధారణంగా మహిళల రుతుచక్ర కాలం సరాసరి 28రోజులు దీన్లో 4 దశలు ఉంటాయి. వాటి ప్రకారం ట్రెండ్ ఫాలో అయ్యే వాళ్లు ఏం చేస్తారంటే..



**ఫాలిక్యులర్ దశ...** ఈ సమయంలో విడుదలైన అండాలు వృద్ధి చెందుతూ ఉంటాయి. ఈ దశ 14 రోజుల వరకూ అంటే పీరియడ్ మొదటిరోజు నుంచీ మొదలవుతుంది. ఈస్ట్రోజన్ స్థాయులు ఎక్కువగా ఉంటాయి ఈ దశలో మెటబాలిజం వేగంగా ఉండదు. కాబట్టి తేలికైన ఆహారాలు తింటారు. సలాడ్లు, కూరగాయలు, నాట్స్, ఆలివ్ ఆయిల్, కాఫీ, టీ వంటివాటికి ప్రాధాన్యమిస్తారు.

**ఒవ్యులేషన్ ..** అండాశయం నుంచి అండాలు విడుదలయ్యే దశ ఇది 14లేదా 16వ రోజు ఇది జరుగుతుంటుంది. ఈ సమయంలో ఈస్ట్రోజన్, టెస్టోస్టెరాన్‌లు ఎక్కువగా ఉత్పత్తవుతాయి. ఇప్పుడే మన శరీరంలో ఒక్కసారిగా శక్తిస్థాయులు పెరుగుతాయి. ఉల్లాసంగా ఉంటాం. ఈ సమయంలో కాస్త కష్టతరంగా ఉండే రన్నింగ్, సైక్లింగ్ వర్కవుట్లను ప్రయత్నించారు. ఈ దశలో ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు తింటారు. తాజా ఆకుకూరలు, బ్రాకలీ, నట్స్, ఓట్స్ లాంటివాటిని డైట్‌లో చేర్చుకుంటారు.

**లూటియల్ దశ...** గర్భధారణ కోసం గర్భాశయాన్ని శరీరం సిద్ధం చేసే దశ ఇది 15-28 రోజులు ఉంటుంది. ఈ సమయంలో ఈస్ట్రోజన్, ప్రొజెస్టారాన్ హార్మోన్లు అధికంగా విడుదలవుతాయి శరీరంలో శక్తి అంతా చివర్లో స్ట్రా వేసుకుని పీల్చేసినట్లు ఒక్కసారిగా అలసట ఆవహిస్తుంది. ఇక పీరియడ్ ప్రారంభమయ్యే కొద్దిరోజుల ముందు ఈస్ట్రోజన్, ప్రొజెస్టారాన్ స్థాయులు పడిపోయి... ప్రీ మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్(పీఎమ్ఎస్) లక్షణాలు మొదలవుతాయి. ఇందులో భాగంగా బరువు పెరగడం, భావోద్వేగాల్లో మార్పులు, నిద్రలేమి, తలనొప్పి లాంటివి కొందరిలో ఉంటాయి. ఫుడ్ క్రేవింగ్స్ అధికంగా ఉంటాయి కాబట్టి, తృణ ధాన్యాలతో చేసిన ఆహారం, బీన్స్ లాటివి తింటూ, తేలికగా ఉండే వ్యాయా మాలను ఎంచుకుంటారు సైకిల్ సింకింగ్ వల్ల హార్మోన్ల సమతులవుతాయి. యాకే. పీరియడ్ సమయంలో వచ్చే నొప్పి తగ్గుతుంది.

**మెన్‌స్ట్రువేషన్ :** పీరియడ్ సమయం.. ఈ ఐదు రోజులు హార్మోన్ల స్థాయులు తక్కువగా ఉంటాయి. బ్లీడింగ్ కాళ్లు లాగడం.. వంటివి ఉంటాయి. వీటినుంచి ఉపశమనం పొందడానికి ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ఐరన్, విటమిన్ సి, కె అధికంగా ఉన్న ఆహారాలు ఎక్కువగా తింటారు. తేలికైన వ్యాయామాలు యోగా3, పిటాటీస్ వంటివి చేస్తారు. నీళ్ల అధికంగా తాగుతారు.

# యాపిల్ షీరా

**కావలసినవి:** ఊదలు లేదా మరేవైనా మిల్లెట్లు ముప్పావు కప్పు, యాపిల్‌పండ్లు 2, చిక్కటి పాలు ఒకటిన్నర కప్పు, బెల్లం పొడి అర కప్పు, నెయ్యి పావు కప్పు, యాలకుల పొడి ఆ చెంచా, కుంకుమపువ్వు కొద్దిగా, డ్రైఫ్రూట్స్ పలుకులు 2 టేబుల్ స్పూన్లు

**తయారీ:** కడిగి ఎండబెట్టిన మిల్లెట్లను దోరగా వేయించి, బరకగా గ్రైండ్ చేయాలి. యాపిల్స్ చెక్కు గింజలు తీసి గుజ్జు చేయాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో నెయ్యి వేడి చేయాలి. అందులో యాపిల్ గుజ్జు, మిల్లెట్ల రవ్వ, బెల్లం పొడి, కుంకుమపువ్వు, యాలకుల పొడి వేసి కలియతిప్పుతూ సన్న సెగ మీద ఉడికించాలి. చివర్లో డ్రైఫ్రూట్స్ పలుకులు జోడించి సెగ తీయాలి.



# వారిపై ఒత్తిడి చేయొద్దు..


పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులకు ఆశలు ఉండటం మామూలే. అందుకే, వారు సరిగా చదవడం లేదని తెలిసినా, మార్కులు రాకపోయినా.. మనం ఆందోళన చెందుతుంటాం. వాళ్లపైనా ఒత్తిడి పెడు తుంటాం. దీనివల్ల కోరుకున్న ఫలితం రాకపోగా అనర్థాలే ఎక్కువంటున్నారు మానసిక నిపుణులు. చిన్నప్పుడు తాము అనుకున్న కలలు నెరవేరక వాటిని బిడ్డల ద్వారా నెరవేర్చుకోవాలనుకుంటారు చాలా మంది. అందుకే, నువ్వు డాక్టర్వి కావాలీ, ఇంజినీర్వి అవ్వాలి అంటూ లక్ష్యాలు పెడతారు. అవి వాళ్లకి నచ్చితే సరి. లేక పోతే... ఎలా? మీలా వాళ్లూ వాళ్ల పిల్లల ద్వారా తీర్చుకోవాలా? కాదు. ముందు పిల్లల సామర్థ్యం, తర్వాత వారి అభిరుచి అర్థం చేసుకున్నాకే... కెరియర్ని నిర్ణయించండి. అప్పుడే ఉన్నతంగా ఎదగగలరు.



◆ అభిరుచులు ఉండటం, ఆసక్తి చూపించడం, ప్రతిభ కనబరచడం... వంటి వాటితోనే ఆయా రంగాల్లో సులువుగా రాణించొచ్చు అనుకుంటారు పిల్లలు. కానీ, ఏది అంత సులువుగా పట్టు చిక్కదనే విషయం వాళ్లకి అర్థమయ్యేలా వివరించాలి. వివిధ రంగాల్లోని విజేతల కృషి అర్థమయ్యేలా చెప్పాలి. సంబంధిత వీడియోలు చూపించాలి. అప్పుడే అపజయాలు ఎదురైనా తడబడరు. కష్టమని వెనుదిరగరు. అయితే, ఈ కోరిక వాళ్ల చిన్న చిన్న విజయాలను కూడా మీరు గుర్తించి ప్రోత్సహించాలి. అప్పుడే ఉత్సాహంగా ముందుకెళ్తారు.

◆ చిన్నప్పటి నుంచీ చూడు 'బంటీ రోజూ పొద్దున్నే లేచి చదువుతాడు... నువ్వు ఎప్పుడూ ఆటలే', 'చూడు నీతోటిది అక్షరం... తనెప్పుడూ మంచి మార్కులు తెచ్చుకుంటుంది'.... అంటూ పిల్లల్ని తోటివాళ్లతో పోల్చి చూపించే తల్లిదండ్రులు చాలామందే. అయితే, ఇలా ప్రతి విషయాన్నీ పోల్చి చూపడం వారిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది అంటున్నాయి పలు అధ్యయనాలు. బదులుగా ఎవరికి వాళ్ళు తమని తాము తెలుసుకునేలా చేయండి. వారు ముందుకెళ్లడానికి అడ్డుపడుతోన్న కారణాలను అధిగమించడానికి సాయపడండి. ఈ క్రమంలో ఎప్పుడైనా వెనకబడినా, ఓడిపోయినా... పోయేదేం లేదు. ప్రయత్నలోపం లేకుండా చూసుకోవడమే ముఖ్యమని వారికి అర్థమైతే చాలు. లోపాల్ని సరిదిద్దుకుని ముందడుగు వేయగలరు.


# ఉంగరాల జుట్టు సంరక్షణ ఇలా !



జుట్టు సిల్కీగా ఉన్న వారికి కర్లీగా ఉంటే బాగుంటుందనిపిస్తుంది.. అదే కర్లీ హెయిర్ ఉన్న వాళ్లేమో 'ఈ నిండిన జుట్టు నా వల్ల కాదు బాబోయ్ ' అంటూ సిల్కీ జుట్టును కోరుకుంటారు. నిజానికి ఎవరి జుట్టు తత్వం వారికి నచ్చదు. అయితే ఉంగరాల జుట్టు సాధారణంగానే పొడిగా ఉంటుంది. దాంతో నిర్జీవంగా కనిపిస్తుంది.. మెయింటెయిన్ చేయడం కూడా కొందరికి కష్టంగా అనిపిస్తుంది. ఇలాంటప్పుడు కొన్ని సింపుల్ చిట్కాలు పాటిస్తే కర్లీ హెయిర్ అందంగా కనిపించేలా చేయచ్చంటున్నారు నిపుణులు.

✦. కొంతమందికి రోజు తలస్నానం చేసే అలవాటు, కర్లీ హెయిర్ ఉన్న వారు కొందరు ఇలాగే ఉంటారు. దీనివల్ల జుట్టు మరింత పొడిబారుతుందంటున్నారు నిపుణులు. అది కూడా గాఢత తక్కువగా షాంపూని నీళ్లలో కలుపుకోసి చేయడం మంచిదని చెబుతున్నారు.

✦ తలస్నానం తర్వాత నాణ్యమైన కుడిషనర్‌ను రాయడం మర్చిపోవద్దు. ఇది కేశాలంకరణ పొడిబారిపోకండా చేస్తుంది. అలాగే తలస్నానానికి వేడి నీళ్లు కాకుండా గోరువెచ్చటి లేదంటే చల్లటి నీళ్లు ఉపయోగించడం మంచిది.



✦ కర్లీ హెయిర్ సంరక్షణ కోసం వారానికి మూడుసార్లు నూనె పెట్టుకోమంటున్నారు. నిపుణులు. ఈ కొబ్బరి నూనెను కుదుళ్ళ, వెంట్రుకలకు అప్లై చేసి కాసేపు మర్దన చేయాలి ఇలా రాత్రిళ్లు నూనె పెట్టుకొని మరుసటి రోజు ఉదయాన్నే తలస్నానం చేస్తే జిడ్డుగా కూడా అనిపించదు.

✦ ఒకవేళ ఇలా నూనె పెట్టుకున్న మరుసటి రోజు తలస్నానం చేయకపోతే.. జెల్ ఆధారిత కండిషనడిని కొద్దిగా తీసుకొని జుట్టుకు పట్టించాలి. ఇలా చేయడం ద్వారా నూనె వల్ల జుట్టు కప్పుగా అనిపించకుండా జాగ్రత్తపడచ్చు.



✦ తడిగా ఉన్న జుట్టును దువ్వడం. టవల్ గట్టిగా రుద్దుతూ తుడవడం, డ్రయర్‌తో అరబెట్టడం వంటివి అస్సలు చేయకూడదు. ఎందుకంటే ఇవి జుట్టు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. మెత్తటి కాటన్ క్లాత్‌తో జుట్టును పొడిగా తుడుచుకొని ఆరిన తర్వాత చెక్క దువ్వెనతో చిక్కు తీసుకోవడం మంచిది.

✦ తడిగా ఉన్న కర్లీ హెయిర్‌ను బిగుతుగా జడ వేసుకోవడం లేదంటే ముడేయడం.. వంటివి చేసేనత జుట్టు చివర్లు చిట్లిపోయే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు కాబట్టి జుట్టును ముడేసే ముందు సహజసిద్ధంగా ఆరనివ్వడం ఉత్తమం.

✦. షియా బటర్, నువ్వులనూనె వంటివి కర్లీ హెయిర్ సంరక్షణకు చక్కగా ఉపయోగపడతాయి.

✦ మనం రోజూ తాగే టీ/కాఫీ మన శరీరాన్నే కాదు.. జుట్టునూ పొడిబారిపోయేలా చేస్తుంది. కాబట్టి వీటికి బదులుగా, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు, నీటి శాతం ఎక్కువగా ఉండే కీరా, పుచ్చకాయ వంటి పండ్లు, కాయగూరలు తీసుకోవడం మంచిది.



✦ ఉంగరాల జుట్టు పొడిబారకుండా సహజసిద్ధంగా తయారుచేసుకున్న హెయిర్ స్ప్రే కూడా చక్కగా పనిచేస్తుంది. ఈ విధంగా ఒక స్ప్రే బాటిల్లో డిస్టిల్డ్ వాటర్ నింపి అందులో కొన్ని చుక్కల చొప్పున వెజిటబుల్ ఆయిల్, రోజే మేరీ ఆయిల్, లావెండర్ నూనె, వేసి ఒకసారి షేక్ చేసి పెట్టుకోవాలి. దీన్ని జుట్టుపై అప్పుడప్పుడూ స్ప్రే చేస్తుండడం వల్ల జుట్టు పొడిబారకుండా పట్టులా కనిపిస్తుంది.. ప్రకాశవంతంగా మెరిసిపోతుంది కూడా!

# నైవేద్యం




ఆధ్యాత్మికం

మొదటగా దైవానికిచ్చే సమర్పణ నైవేద్యం. ఇది సంస్కృత పదం. ఏదైనా తాము స్వీకరించుట కంటే ముందు భగవంతునికి నివేదించడమే నైవేద్యంగా చెప్పబడింది. అది కేవలం ఆహార పదార్థమో, వస్తువో మాత్రమే కానవసరం లేదు. మనస్ఫూర్తిగా దేవునికి అర్పించాలని భావించే విషయం ఏదైనా కావచ్చును. దానికి తాహతు, పరిమితులంటూ ఏమీ లేవు.పూజ కూడా నివేదనే. శ్రద్ధాసక్తులతో మమేకమై అర్చించే ఫలం, పుష్పం, తోయం, శుచిగా వండిన పదార్థములు మాత్రమే కాదు, శక్తి, భక్తి, అనురక్తితో అలౌకిక తాదాత్మ్యంతో దేన్నైనా భగవదర్పణం చేయవచ్చు.గోదాదేవి పాశురాలను, అన్నమయ్య పద సంకీర్తనలను అర్పిస్తే, కుబ్జ పూలను, కుచేలుడు అటుకులను ప్రీతితో సమర్పించారు. గోపికలు నవనీతాన్ని సమర్పించుకున్నారు. ఎవరు దేన్నయితే అత్యంత అనురక్తితో నివేదిస్తారో అదే వాళ్ళకు ప్రాప్తమోతుంది. ద్రౌపది ఎంతో స్నేహంతో గాయపడిన శ్రీకృష్ణుని వేలికి తన వస్త్రం చింపి చుట్టింది. అందుకే వస్త్రాపహరణం నుంచీ సురక్షితంగా కాపాడబడింది. కుచేలుడు సంపదను, కుబ్జ అందాన్ని, అన్నమయ్య మోక్షాన్ని, గోపికలు నవనీతమంటి భగవంతుని మనసును పొందగలిగారు.అలాగే కవులు కావ్య కన్యకలను, నర్తకులు నాట్యాన్ని, గానగాంధర్వులు గాత్రాన్ని, హరికథలు, నామస్మరణ వంటి అనేక మార్గాలలో దేవ దేవుని ప్రసన్నం చేసుకోవచ్చు. ఎంచుకునే రీతులేవైనా ఏకాగ్రతతో కూడిన అశేష భక్తితత్పరత ముఖ్యం. నృసిహ్మావతారంలో బాలుడ్ని అనుగ్రహించి, రామావతారంలో ఎంగిలి పళ్ళు రుచిచూసి, వేంకటేశ్వరుడై మట్టి తులసి దళాలకే ముక్తినొసగి తన అపార కరుణా కటాక్షాలను భక్తులపై కురిపించాడు భగవంతుడు. భగవంతుడంటేనే విశ్వవ్యాప్తమైన స్వరూపం. అలాగే అనంత కరుణా సాగరుడు. తలచిన చాలు, పిలచిన చాలు ఏదో ఒక రూపంలో ఆదుకోను ఆఘమేఘాలపై వస్తాడు. చేతుల్లో శంఖ చక్రాలు లేకున్నా, ఆదిశేషునికైనా అనుమానం రానివ్వక, ఆది లక్ష్మికైనా తెలియజేయక గజేంద్రమోక్షమిచ్చిన కరివరదుడు భక్తకోటి మానసములనే కైమోడ్చి ప్రణమిల్లి నివేదింపగా అందుకోను తప్పక వస్తాడు. ఆపదమ్రొక్కులు తీర్చు ఆనందనిలయుడై ఆదరిస్తాడు. ఇక్కడ భగవంతుడు అంటే మానవుడే మాధవుడైనపుడు దేహమే కదా దేవాలయం. ఆదుకోగల శక్తి వుండి ఆర్తులు ఎదురైతే చేతనైన సాయం ఏ రూపంలో చేసినా అదీ నైవేద్యమే. దానివల్ల కలిగే ఆత్మ సంతృప్తినే మనం పొందే వరం కావచ్చు. అది అందరిలో మనల్ని మంచితనంగా పరిచయం చేసి ఎన్నో ప్రయోజనాలను కలిగించవచ్చు. అది భగవత్సహాయం అని ఎందుకనుకోకూడదు? అప్పుడు సర్వం జగన్నాథమే. సమస్తం కృష్ణార్పణమే.

**- దేగల అనితాసూరి.**

# నూనె చిలకరిద్దామా !



సదుపాయాలూ సౌఖ్యాన్నిచ్చే పరికరాలు ఉంటే వంట చాలా సులువవుతుంది. అందుకోసం మార్కెట్లో ఎప్పటికప్పుడు కొత్త గాడ్జెట్స్ వస్తున్నాయి. అలాంటిదే ఆయిల్ స్ప్రేయర్ బాటిల్. కూరగాయ ముక్కలు, ఫ్రెంచ్ ఫ్రైస్, దోశలు మొదలైన వాటి మీద నూనెను గరిటెతో వేయడం కాకుండా చిలకరించినట్లు వేయాల్సి వస్తుంది. అలాంట ప్పుడు ఆయిల్ స్ప్రేయర్ గనుక ఉందంటే చాలా సౌకర్యంగా ఉంటుంది. తక్కువ నూనెతో వంట పూర్తయిపోతుంది.



# రచనలకు ఆహ్వానం

మార్చినెల అనగానే '**అంతర్జాతీయ మహిళా దినోత్సవం**' అని మనకందరికీ తెలిసిందే. మహిళలు అన్నిరంగాల్లో శరవేగంగా ముందుకు దూసుకెళ్తున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, శాస్త్ర, సాంకేతిక, సైన్యం తదితర రంగాల్లో స్త్రీలు సాధిస్తున్న విజయాలు, ఎదుర్కొంటున్న సమస్యలపై రచనలు రాసి మాకు పంపండి. సొంతంగా రాసిన రచనలుగా ఉండాలి, కాపీ కొట్టినవిగా ఉండకూడదు. ఆసక్తిగల వారు వెంటనే పంపగలరు.

మా చిరునామా: 'చెలి', వార్త, ఎడిటర్, 396, లోయర్‌ట్యాంక్‌బండ్, హైదరాబాద్, తెలంగాణ. ఈ మెయిల్ :cheli@vaartha.com

టి20 సిరీస్:

# విజేత జింబాబ్వే

## వర్షంతో ఐర్లాండ్ చివరి మ్యాచ్ రద్దు



**న్యూఢిల్లీ:** సొంత గడ్డపై ఐర్లాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌పే జింబాబ్వే కైవసం చేసుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన చివరి పోరు వర్షం కారణంగా రద్దు కాగా, జింబాబ్వే 1-0తో సిరీస్ చేజిక్కించుకుంది. తొలి మ్యాచ్ కూడా వర్షం కారణంగా రద్దయింది. రెండో టి20లో జింబాబ్వే 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇక చివరి టి20లో మొదట బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 18 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసింది. కెప్టెన్ సికందర్ రజా (27 బంతుల్లో 34; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), టోనీ (26), తషింగా (26 నాటౌట్) రాణించారు. ఐర్లాండ్ బౌలర్లలో క్రెయిగ్ యంగ్, గారెత్ డెలానీ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఐర్లాండ్ జట్టు లక్ష్యఛేదనకు దిగకముందే భారీ వర్షం కురిసింది. దీంతో మ్యాచ్ సాధ్యపడలేదు. ఫలితంగా జింబాబ్వేకు సిరీస్ దక్కింది. ఈ పర్యటనలో భాగంగా తొలుత జరిగిన ఏకైక టెస్టులో ఐర్లాండ్ జట్టు విజయం సాధించగా, అనంతరం మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో జింబాబ్వే 2-1తో గెలుపొందింది.

## టెన్నిస్ ఛాలెంజర్స్ టోర్నీ: క్వార్టర్ ఫైనల్లోకి భారత్ జోడీ



**న్యూఢిల్లీ:** బెంగళూరు ఓపెన్ ఏటీపీ-125 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత్ జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. వరుస సెట్లలో గెలిచిన భారత జోడీ మైనేని సాకేత్-రామ్‌మార్ రామనాథన్ అనూహ్యంగా క్వార్టర్ ఫైనల్స్‌కు చేరింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో సాకేత్-రామ్ ద్వయం 6-3, 7-6 (7/4)తో ఇటలీకి చెందిన జాకోపో బెరెటిని-ఎన్రికో డల్లా వాలె జంటను ఓడించింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్-రామ్ జోడీ తొమ్మిది ఏస్లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండు సార్లు బ్రేక్ చేసింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో టాప్ సీడ్, భారత్ స్టార్ అనిరుధ్ చంద్రశేఖర్- చైనీస్ తైపీకి చెందిన రేహో 6-4, 6-4తో భారత్ ప్లేయర్ గంటా సాయి కార్తీక్‌రెడ్డి-ఉజ్బెకిస్తాన్‌కు చెందిన సుల్తానోవ్‌లపై, భారత్‌కు చెందిన సిద్ధాంత్-పరీక్షిత్ సొమాని 6-4, 6-3తో భారత్ ప్లేయర్ నికీకలియంద పునాచా-జింబాబ్వేకు చెందిన జాన్ లాక్‌లపై, ప్రజ్వల్ దేవ్-ఆర్యన్ షా (భారత్) 4-6, 6-3, 10-6తో ఎంజో కుకాడో (ఫ్రాన్స్)-మైకేల్ గీర్ట్స్ (బెల్జియం)లపై, ఆదిల్ కల్యాణ్‌పూర్-కరణ్ సింగ్ (భారత్) 1-6, 6-2, 10-4తో నితిన్ కుమార్ సిన్హా-మనీశ్ సురేశ్‌మార్ (భారత్)లపై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.

# పాక్ చెత్త రికార్డు

## వర్షంతో బంగ్లాతో మ్యాచ్ రద్దు

### ఛాంపియన్స్ టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా గెలవని దాయాది

**న్యూఢిల్లీ:** ఐసిసి చాంపియన్స్ ట్రోఫీ-2025లో ఒక్క మ్యాచ్ అయినా గెలవకుండా చెత్త రికార్డు సాధించింది. కనీసం ఒక్క మ్యాచ్ అయినా గెలవాలన్న పాకిస్తాన్ ఆశలపై వరణుడు నీళ్లు చల్లాడు. రావల్పిండిలో ఎడతెగని చినుకుల కారణంగా టాస్ పడకుండానే పాక్ బంగ్లా మ్యాచ్ ముగిసిపోయింది. దీంతో పాక్ బంగ్లాదేశ్ మధ్య గురువారం జరగాల్సిన మ్యాచ్ రద్దయింది. ఫలితంగా ఇరు జట్లకు చెరో పాయింట్ వచ్చింది. ఈ క్రమంలో డిఫెండింగ్ చాంపియన్‌గా ఈ వన్డే టోర్నమెంట్ బరిలో దిగిన పాకిస్తాన్



పేరిట ఓ చెత్త రికార్డు నమోదైంది. కాగా 2017 తర్వాత చాంపియన్స్ ట్రోఫీ టోర్నీ జరగటం ఇదే తొలిసారి. నాడు టైటిల్ గెలిచిన పాకిస్తాన్ ఈ సారి ఈ మెగా ఈవెంట్ ఆతిథ్య హక్కులను సంపాదించింది. వన్డే వరల్డ్ కప్-2023లో చెత్త ప్రదర్శన కనబరిచినా, ఆతిథ్య జట్టు హోదాలో ఛాంపియన్స్ ట్రోఫీకి నేరుగా అర్హత సాధించింది. ఇక ఎ గ్రూప్‌లో తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్ న్యూజిలాండ్ తలపడ్డాయి. ఇందులో కివీస్ జట్టు గెలిచింది. అనంతరం పాకిస్తాన్ దాయాది టీమిండియాతో పోరులోనూ ఓడిపోయింది. ఈ క్రమంలో సెమీస్ చేరే అవకాశాన్ని పోగొట్టుకున్న రిజ్వాన్ బృందం, కనీసం గురువారం జరిగే ఆఖరి మ్యాచ్‌లో నైనా గెలిచి పరువు నిలుపు కోవాలని భావించింది. లీగ్ దశలో చివరగా బంగ్లాదేశ్తో గురువారం మ్యాచ్ ఆడేందుకు సిద్ధంకాగా వర్షం రూపంలో చేదు అనుభవం ఎదురైంది. ఈ క్రమంలో నిబంధనల ప్రకా ప్రరం ఇరుజట్లకు చెరో పాయింట్ వచ్చింది. దీంతో గ్రూప్ ఎ పాయింట్ల పట్టికలో అట్టడుగున నాలుగో స్థానంతో టోర్నీని ముగించింది. ఈ నేపథ్యంలో చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో గ్రూప్ దశ (2002 నుంచి) ప్రవే ప్రశపెట్టిన తర్వాత ఒక్క విజయం కూడా సాధించకుండా, అదేవిధంగా పాయింట్ల పట్టికలో ఆఖరున నిలిచిన తొలి జట్టుగా పాకిస్తాన్ చెత్త రికార్డు మూటగట్టుకుంది.





# సెమీస్‌కు చేరేదెవరు?

## ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ బిలో ఇంకా మిస్టరీ

### మూడు జట్ల మధ్య ఉత్కంఠ

**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో సెమీ ఫైనల్ సినారియో ఇంట్రెస్టింగ్‌గా మారింది. గ్రూప్‌ఏ నుంచి ఇండియా, న్యూజిలాండ్ జట్లు ఇప్పటికే సెమీస్ ఫైనల్‌కు చేరుకున్నాయి. ఇదే గ్రూప్‌లోని పాకిస్థాన్, బంగ్లాదేశ్ జట్లు టోర్నీ నుంచి నిష్క్రమించాయి. ఇక గ్రూప్ బీ నుంచి మాత్రం ఇంకా ఒక్క టీమ్ కూడా సెమీ ఫైనల్‌కు చేరలేదు. కానీ, ఆ గ్రూప్ నుంచి ఇంగ్లండ్ జట్టు ఇప్పటికే ఎలిమినేట్ అయింది. ఇక రెండు సెమీస్ బెర్త్‌ల కోసం ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్థాన్ పోటీ పడుతున్నాయి. ఈ నెల 26న ఇంగ్లండ్‌ను ఓడించిన ఆఫ్ఘాన్ సెమీస్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. ఒక వేళ ఆఫ్ఘాన్ సెమీస్ చేరాలంటే ఈ నెల 28న ఆస్ట్రేలియాపై గెలిచి తీరాలి. ఒక వేళ ఓడితే మాత్రం ఆఫ్ఘాన్ ఇంటికి, ఆసీస్ సెమీస్‌కు చేరుతాయి. ఆసీస్‌తో పాటు సౌతాఫ్రికా కూడా సెమీస్‌కు వెళ్తుంది. ఇక ఇప్పటి వరకు ఉన్న పాయింట్ల పట్టికను చూస్తే ఆసీస్, సౌతాఫ్రికా మూడేసి పాయింట్లతో ఒకటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఆఫ్ఘాన్ రెండు పాయింట్లతో మూడో ప్లేస్‌లో ఉంది. ఈ నేపథ్యంలో సెమీ ఫైనల్‌లో టీమిండియాకు ఎవరు పోటీకి వస్తారనే ఆసక్తి అందరిలో నెలకొంది. ఆఫ్ఘనిస్థాన్‌పై ఆస్ట్రేలియా గెలిస్తే 5 పాయింట్లతో సెమీస్ చేరుతుంది. ఇంగ్లండ్‌పై సౌతాఫ్రికా గెలిస్తే ఆ జట్టు కూడా ఐదు పాయింట్ల సెమీస్ చేరుతుంది. అయితే రన్‌రేట్ ఆధారంగా గ్రూప్ బీ టాపర్ ఎవరనేది తేలుతుంది. ఒక వేళ ఆస్ట్రేలియాపై ఆఫ్ఘాన్ గెలిచి, ఇంగ్లండ్‌పై సౌతాఫ్రికా గెలిస్తే. సౌతాఫ్రికా ఫస్ట్ ప్లేస్‌లో, ఆఫ్ఘాన్ సెకండ్ ప్లేస్‌లో సెమీస్‌కు చేరుతాయి. మరోవైపు గ్రూప్‌ఏలో ఇండియాన్యూజిలాండ్ మధ్య ఒక మ్యాచ్ మిగిలి ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు గ్రూప్‌ఏ టాపర్‌గా, ఓడిని జట్టు సెకండ్ ప్లేస్‌లో సెమీస్‌కు చేరుతాయి. గ్రూప్‌ఏ టాపర్, గ్రూప్ బీ సెకండ్ ప్లేస్‌లో ఉన్న టీమ్ మధ్య తొలి సెమీస్ ఫైనల్ జరుగుతుంది. అలాగే గ్రూప్ బీ టాపర్, గ్రూప్ ఏ సెకండ్ ప్లేస్‌లో నిలిచిన జట్ల మధ్య రెండో సెమీ ఫైనల్ జరుగుతుంది. సో టీమిండియా మార్చి 2న న్యూజిలాండ్‌పై గెలిస్తే సెమీస్‌లో ఆస్ట్రేలియా లేదా సౌతాఫ్రికాతో తలపడాల్సి ఉంటుంది. ఆఫ్ఘాన్‌తో కూడా తలపడే అవకాశం ఉంది కానీ, దానికి చాలా సమీకరణాలు కలిసి రావాలి. ఆఫ్ఘాన్ చేతిలో ఆస్ట్రేలియా ఓడిపోయి, ఇంగ్లండ్‌పై సౌతాఫ్రికా గెలిస్తే. గ్రూప్ బీ నుంచి ఫస్ట్ ప్లేస్‌లో సౌతాఫ్రికా, రెండో ప్లేస్‌లో ఆఫ్ఘాన్ సెమీస్‌కు వస్తాయి. అప్పుడు ఇండియా వర్సెస్ ఆఫ్ఘనిస్థాన్ మధ్య తొలి సెమీ ఫైనల్ జరుగుతుంది. అలా కాకుండా న్యూజిలాండ్ చేతిలో టీమిండియా ఓడిపోతే. గ్రూప్ ఏ నుంచి రెండో ప్లేస్‌లో ఇండియా సెమీస్‌కు చేరుతుంది. అప్పుడు కూడా ఆఫ్ఘాన్‌తో సెమీస్ ఆడాలంటే, ఆసీస్‌పై ఆఫ్ఘాన్ గెలవాలి, ఇంగ్లండ్ చేతిలో సౌతాఫ్రికా ఓడిపోవాలి. అప్పుడు ఆఫ్ఘాన్ గ్రూప్ బీ నుంచి ఫస్ట్ ప్లేస్‌లో, ఆసీస్, సౌతాఫ్రికా జట్లు మూడేసి పాయింట్లతో ఉంటాయి కాబట్టి వాటిలో మెరుగైన రన్‌రేట్ ఉన్న టీమ్ రెండో ప్లేస్‌లో సెమీస్ చేరుతుంది. అప్పుడు. గ్రూప్‌బీ టాపర్‌గా ఆఫ్ఘాన్, గ్రూప్‌ఏ సెకండ్ ప్లేస్‌లో ఉన్న టీమిండియా మధ్య రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. ఇలా అనేక ఈక్వేషన్ల మధ్య టీమిండియాకు సెమీస్‌లో ఆసీస్, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్థాన్ ఇలా ఎవరైనా రావొచ్చు.

# ముంబయి ఇండియన్స్ హ్యాట్రిక్

## మహిళల ప్రీమియర్ లీగ్‌లో యుపి వారియర్స్‌పై గెలుపు

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ జట్టు హ్యాట్రిక్ విజయం నమోదు చేసుకుంది. బెంగళూరులో జరిగిన పోరులో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబైఇండియన్స్ జట్టు 8వికెట్లతో యూపీవారియర్స్‌పై నెగ్గింది. ఈ మ్యాచ్‌లో నాట్ సివర్ బ్రంట్ (75 నాటౌట్; 3 వికెట్లు) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ముంబై ఇండియన్స్ విజయంలో కీలకపాత్ర పోషించింది. గత మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)పై సూపర్ ఓవర్లో నెగ్గిన యూపీ వారియర్స్, అదే జోరు కొనసాగించలేకపోయింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన యూపీ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 142 పరుగులకు పరిమితమైంది. గ్రేస్ హ్యారిస్ (26 బంతుల్లో 45; 6 ఫోర్లు, 2 సిక్సులు), దినేశ్ వృందా (30 బంతుల్లో 33; 5 ఫోర్లు) ధాటిగా ఆడారు. కెప్టెన్ దీప్తి శర్మ (4), కిరణ్ నవగిరె (1), తాలియా మెక్గ్రాత్ (1), షినెల్ హెన్రీ (7) విఫలమయ్యారు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో సివర్ బ్రంట్ 3 వికెట్లు, షబ్నిమ్ ఇస్మాయిల్, సంస్కృతి గుప్తా చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ముంబై ఇండియన్స్ 17 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. సివర్ బ్రంట్ (44 బంతుల్లో 75 నాటౌట్; 13 ఫోర్లు), హేలీ మాథ్యూస్ (50 బంతుల్లో 59; 7 ఫోర్లు, 2 సిక్సులు)




అర్ధ శతకాలతోఅదరగొట్టారు. యూపిబౌలర్లు సైమా, షినెల్ హెన్రీ, సోఫీ ఎకిల్‌స్టోన్ ఓవర్లలో సివర్ మూడు బౌండరీల చొప్పున కొట్టింది. రెండో వికెట్‌కు హేలీ, సీవర్ 133 పరుగులు జోడించి ముంబై జట్టుకు అలవోక విజయాన్ని అందించారు. సివర్ బ్రంట్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

# గూగుల్‌లోనూ ఉద్యోగులు ఇంటికే..

**ముంబై, ఫిబ్రవరి 27:** కష్టమర్ల అవసరాలు అండ్ కొత్త అవకాశాలను తీర్చడానికి గూగుల్ నిరంతరం మార్పులు చేస్తోందని గూగుల్ ప్రతినిధి బ్లూమ్‌బెర్గ్‌తో అన్నారు. మరోవైపు ఈ నెల ప్రారంభంలో గూగుల్ క్లౌడ్ వ్యాపారం ఆదాయం విశ్లేషకుల అంచనాల కంటే తక్కువగా ఉంది. అదే సమయంలో అయితే తొలగించిన ఉద్యోగులమొత్తం సంఖ్య వెల్లడి కాలేదు. అయితే గూగుల్ ఉద్యోగులను తొలగించడం ఇదేం మొదటి సారి కాదు. గూగుల్ ఇంతకు ముందు చిన్న తరహా తొలగింపులు చేసింది. ఫలితంగా, ఇప్పుడు మరోసారి తొలగింపు జరిగింది. క్లౌడ్ డివిజన్ తొలగింపులకు ముందు గూగుల్ జనవరి 2024లో తన "ప్లాట్‌ఫామ్స్ అండ్ డివైసెస్" విభాగం నుండి స్వచ్ఛంద తొలగింపుల ప్రణాళికను ప్రకటించింది. ఈ ప్రకటన ప్రధానంగా ఆండ్రాయిడ్, పిక్సెల్, క్రోన్ అండ్ నెస్ట్ వంటి గూగుల్ చెందిన ప్రసిద్ధ

2025లో కంపెనీ ఖర్చులు ఊహించిన దానికంటే ఎక్కువగా పెరిగాయి. ఈ తొలగింపులు కూడా దీని కారణంగానే జరిగి ఉండవచ్చని చెబుతున్నారు. గూగుల్ క్లౌడ్ విభాగం కంపెనీ వృద్ధికి ఎంతో దోహదపడే ముఖ్యమైన విభాగం. అందువల్ల, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కంపెనీ ఆర్థిక వ్యవస్థను సర్దుబాటు చేయడానికి గూగుల్ కొన్ని మార్పులు చేయాల్సి వచ్చింది. ఫలితంగా, కొంత మంది ఉద్యోగులను ఇప్పుడు తొలగించారు.




ఉత్పత్తులలో పనిచేసే ఉద్యోగుల కోసం చేసింది. ఈ ప్లాన్ కింద ఉద్యోగులు తమంతట తాముగా కంపెనీని విడిచిపెట్టాలనుకుంటే వారికి పరిహార మొత్తాన్ని చెల్లిస్తారు. ఈ స్వచ్ఛంద నిష్క్రమణ కార్యక్రమం ఉద్దేశ్యం కంపెనీ కార్యకలాపాలను క్రమబద్ధీకరించే ఉద్దేశ్యంతో తీసుకుంది. గతంలో చూస్తే సెర్చ్ ఇంజన్ దిగ్గజం గూగుల్ 2022లో ఖర్చు తగ్గింపులను ప్రారంభించింది, ఈ తరుణంలోనే సుందర్ పిచాయ్ కంపెనీని 20 శాతం మరింత సమర్థవంతంగా చేయాలనే లక్ష్యాన్ని ప్రకటించారు. ఈ పునర్నిర్మాణం భారీ తొలగింపులకు దారితీసింది, దీంతో జనవరి 2023లో 12 వేల మంది ఉద్యోగులు ఉద్యోగాలు కోల్పోయారు.

# 3వ త్రైమాసికంలో భారత్ వృద్ధి 6.2% : డాయిష్ బ్యాంకు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** భారత ఆర్థిక వ్యవస్థకు గడ్డుకాలం ముగిసినట్టేనని జర్మనీకి చెందిన డాయిష్ బ్యాంకు అభిప్రాయపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికంలో జిడిపి 5.4శాతానికి పడిపోవడం తెలిసిందే. దీంతో దేశ ఆర్థిక వృద్ధిపై ఆందోళనలు నెలకొన్నాయి. ఈ తరుణంలో డిసెంబరు త్రైమాసికంలో జిడిపి 6.2శాతానికి మెరుగు పడుతుందని బ్యాంకు అంచనా వేసింది. అయినప్పటికీ, 2025-26లో జిడిపి వృద్ధి 7శాతం లోపే ఉంటుందని పేర్కొంది. మూడవ త్రైమాసికం జిడిపి గణాంకాలు విడుదల కావడానికి ముందు బ్యాంకు ఈ నివేదిక విడుదల చేయడం విశేషం. కీలక సూచికలు కూడా వృద్ధిరేటు 6.2శాతానికి పెరుగుతుందని సూచిస్తున్నట్లు తెలిపింది. వృద్ధికి మద్దతుగా ఏప్రిల్ మానిటరీ పాలసీ సమీక్షలోనూ ఆర్‌బిఐ మరో 25 బేసిస్ పాయింట్ల మేర రేట్లను తగ్గించొచ్చని అంచనా వేసింది. అనంతరం 0.50 శాతం రేటు బదిలీ దిశగా లిక్విడిటీ




చర్యలపై ఆర్‌బిఐ దృష్టిసారించొచ్చని తెలిపింది. ప్రస్తుతం సైకిల్‌లో మరిన్ని రేట్ల కోతలు ఉండక పోవచ్చని అభిప్రాయం వ్యక్తంచేసింది. లిక్విడిటీ అవసరాల పట్ల ఆర్‌బిఐ ఇప్పటికే దృష్టిపెట్టిందంటూ, ఇటీవల 10 బిలియన్ డాలర్ల స్వాప్ ప్రకటన ప్రోత్సాహకరంగా ఉన్నట్లు పేర్కొంది. భారత్ 6.5-7 శాతం మేర జిడిపి వృద్ధిని నమోదు చేయాలంటే, పన్నుల పరిధిని 1.2-1.5 శాతం స్థాయిలో కొనసాగించాలని ఈవై సూచించింది. ఆదాయ వసూళ్లను బలోపేతం చేసుకోవాలంటూ, జిడిపిలో పన్నుల నిష్పత్తిని 2025-26లో 12శాతం అంచనా స్థాయి నుంచి 2023-31 నాటికి 14 నాటికి 14 శాతానికి పెంచుకోవాలని పేర్కొంది. ద్రవ్య నిర్వహణ, నిర్మాణాత్మకసంస్కరణలు, పన్ను చెల్లింపుదారుల పరిధిని పెంచుకోవడంపై భారత్ దృష్టి సారించాలని సూచించింది. 2025-26లో భారత జిడిపి 6.3-6.8శాతం మధ్య వృద్ధిని నమోదు చేయవచ్చని అంచనా వేసింది.

# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ సూచీలు


**ముంబై, ఫిబ్రవరి 27:** దేశీయ స్టాక్ మార్కెట్‌సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల ప్రకటనలు ఇప్పటికే ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఈ క్రమంలో మార్కెట్ గమనంపై అనిశ్చితి నెలకొనడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. దీంతో సూచీలు రోజంతా ఓ మోస్తరు శ్రేణిలోనే కదలాడాయి. ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కనిపించగా, స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్




సూచీల్లో మాత్రం అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. చివరికి సెన్సెక్స్ 10.31 పాయింట్లు లాభంతో 74,559.86 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 2.50 పాయింట్లు నష్టపోయి 22,545.05 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.87.21గా ఉంది. బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా, జొమాటో, టాటా స్టీల్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అల్ట్రాటెక్‌సిమెంట్, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటాక్ మహీంద్రా బ్యాంకు, టెక్ మహీంద్రా వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి.

# పెన్నీ స్టాక్స్‌తో ఎల్ఐసికి కనకవర్షం

**ముంబై, ఫిబ్రవరి 27:** ప్రస్తుతం మార్కెట్లో దేశీయ అతిపెద్ద బీమా కంపెనీ ఎల్ఐసీ పెట్టుబడుల పోర్ట్ ఫోలియోపై ఇన్వెస్టర్ల దృష్టి కొనసాగుతోంది. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఎల్ఐసీ దాదాపు 330 కంపెనీల్లో ఒక శాతం వాటాను కలిగి ఉంది. ఈ క్రమంలో బీమా దిగ్గజం 14.72 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడుల విలువను కలిగి ఉన్నాయి. అయితే ప్రస్తుతం మార్కెట్ల కరెక్షన్ కొనసాగుతున్న వేళ ఫిబ్రవరి 2025లో దీని విలువ రూ.13.87లక్షల కోట్లకు తగ్గింది. ఈ క్రమంలో మల్టీబ్యాగర్ రాబడులను అందించిన మూడు పెన్నీ స్టాక్స్‌పై రిటైల్ ఇన్వెస్టర్ల దృష్టి కొనసాగుతోంది. వాస్తవానికి పెన్నీ స్టాక్స్ అనేవి తక్కువ ధర వద్ద భవిష్యత్తులో మంచి పెరుగుదలకు అవకాశం ఉన్నవిగా చెప్పుకోవచ్చు. కంపెనీలో వ్యాపారం మంచి భవిష్యత్తును కలిగి ఉండి ప్రస్తుతం తక్కువ ధర వద్ద అందుబాటులో మార్కెట్లో చాలా మంది గుర్తించని కంపెనీలను మల్టీబ్యాగర్ స్టాక్స్ అని పిలుస్తారు. తక్కువ కాలంలో ఎక్కువ రాబడిని అందించటం వల్ల ఇవి ఎక్కువగా ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తుంటాయి. ఎల్ఐసి వంటి ప్రముఖ సంస్థాగత పెట్టుబడి దారులు కూడా తమ పోర్ట్‌ఫోలియోలో కొన్ని పెన్నీ స్టాక్లను హోల్డ్ చేస్తున్నాయి. ఇవి దీర్ఘకాలంలో లక్ష పెట్టుబడిని ఏకంగా రూ.15 లక్షలుగా మార్చేశాయి. ఎల్ఐసీ హోల్డ్ చేస్తూ మంచి రాబడిని అందించిన మల్టీబ్యాగర్ పెన్నీస్టాక్స్ కేటగిరీలో ముందు వరుసలో ఎటివి ప్రాజెక్ట్స్ ఇండియా కంపెనీ షేర్లు నిలిచారు. 5ఏళ్ల కాలంలో ఎల్ఐసీకి 778 శాతం భారీ రాబడిని ఈ స్టాక్ అందించింది. గడచిన ఏడాది కాలంలో స్టాక్ ధర 65 శాతం మేర పెరుగుదలను చూసింది. వాస్తవానికి కంపెనీ చక్కెర పరిశ్రమకు అవసరమైన పరికరాల తయారీలో ఉంది. కంపెనీ ఉత్పత్తులు ప్రధానంగా రసాయనాల తయారీ, పెట్రోకెమికల్స్, ఎరువులు, విద్యుత్ వంటి పరిశ్రమల్లో ఉపయోగిస్తుంటారు. ఇక ఎల్ఐసీకి మంచిరాబడులను తెచ్చిపెట్టిన రెండవ పెన్నీ స్టాక్‌గా ఓరియంట్ గ్రీన్ పవర్ నిలిచింది. రెన్యూ వబుల్ ఎనర్జీ రంగానికి చెందిన కంపెనీ తన పెట్టుబడిదారులకు దీర్ఘ కాలంలో మంచిరాబడులను తెచ్చిపెట్టింది. గడచిన 5 ఏళ్ల కాలంలో 645 శాతం మేర భారీ రాబడిని ఈ స్టాక్ ఎల్ఐసీకి అందించి తన సత్తా చాటుకుంది. గత ఏడాది కాలంలో 45 శాతం మేర పెరుగుదలతో ఉత్తమ పనితీరును కనబరిచింది. కంపెనీ ఇండిపెండెంట్ రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తిదారు.




# ఎఐ స్టార్టప్‌తో పేటిఎం టైఅప్

**ముంబై, ఫిబ్రవరి 27:** ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ పేటిఎం మాతృసంస్థ 'వన్97 కమ్యూనికేషన్స్' ఎఐ స్టార్టప్ పర్‌ప్లెక్సిటీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. తన యాప్ ఎఐ ఆధారిత సెర్చింగ్ సేవల్ని అందించేందుకు స్టార్టప్‌తో జట్టు కట్టినట్లు కంపెనీ గురువారం ప్రకటించింది. ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించేందుకు ఈ సేవలు ఉపయోగపడతాయని పేర్కొంది. ఈ సౌలభ్యంతో యూజర్లు స్థానిక భాషల్లో ప్రశ్నలు వేసి సమాధానాలు తెలుసుకోవచ్చని పేర్కొంది. పర్‌ప్లెక్సిటీతో భాగస్వామ్యంపై పేటిఎం వ్యవస్థాపకుడు, సిఇఒ విజయ్ శేఖర్‌శర్మ మాట్లాడుతూ, త్వరితగతిన సమాచారాన్ని పొందడం, నిర్ణయాలు తీసుకొనే విధానాన్ని కృత్రిమ మేధ సాంకేతికత మారుస్తోంది. పర్‌ప్లెక్సిటీతో మేము లక్షలాది యూజర్లకు ఎఐ శక్తిని అందిస్తున్నాం. దీంతో ఆర్థిక సేవల్ని మరింత సులభంగా యాక్సెస్ చేయొచ్చు అని విజయ్ అన్నారు. పేటిఎం భాగస్వామ్యంపై పర్‌ప్లెక్సిటీ సిఇఒ, సహ వ్యవస్థాపకుడు అరవింద్ శ్రీనివాస్ ఆనందం వ్యక్తం చేశారు. మెరుగైన ఆర్థిక నిర్ణయాలు తీసుకొనేందుకు ఈ ఎఐ సేవలు సాయపడతాయని తెలిపారు.




# వాణిజ్యం

## వైర్ షేర్లకు 'అల్ట్రా' ఝులక్.. 20% మేర పతనం!

**ముంబై, ఫిబ్రవరి 27:** ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్, వైర్లు, కేబుళ్ల విభాగంలోకి అడుగుపెడుతున్నట్లు ప్రకటించడంతో ఆ రంగంలో ఉన్న కంపెనీల షేర్లు గురువారం కుదుపునకు లోనయ్యాయి. మార్కెట్‌లో ఇప్పటికే ప్రధాన ప్లేయర్లుగా ఉన్న పాలిక్యాబ్ ఇండియా లిమిటెడ్, కెఇఐ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఆర్‌ఆర్ కేబుల్ లిమిటెడ్, హావెల్స్ ఇండియా లిమిటెడ్ తదితర కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. బిర్లా ఓపస్ బ్రాండు ద్వారా గతేడాది డెకరేటివ్ పెయింట్ల విభాగంలోకి ఆదిత్య బిర్లా గ్రూపు అడుగుపెట్టిన విషయం విదితమే. వాణిజ్య, స్థిరాస్తి, మౌలికం, పారిశ్రామిక రంగం సహ వివిధ రంగాల్లో వైర్లు, కేబుళ్లకు పెరుగుతున్న గిరాకీ అవకాశాలను అందిపుచ్చుకునే లక్ష్యంతోనే ఆ విభాగంలోకి అడుగుపెడుతున్నట్లు అల్ట్రాటెక్ సిమెంట్ తాజాగా ప్రకటించింది. ఇందుకోసం గుజరాత్‌లో ప్లాంటు ఏర్పాటు చేసే నిమిత్తం




రాబోయే రెండేళ్లలో రూ.1800 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. ఈ నేపథ్యంలో కెఇఐ ఇండస్ట్రీస్ అత్యధికంగా 20శాతానికిపైగా పతనమైంది. ఎన్ఎస్ఇలో రూ.3,010 వద్ద ట్రేడవుతోంది. పాలిక్యాబ్ 13శాతం, హావెల్స్ 9శాతం, ఆర్‌ఆర్ కేబుల్ 15శాతం చొప్పున నష్టపోయాయి. అల్ట్రాటెక్ ఎంట్రీ వల్ల పోటీ వాతావరణం నెలకొంటుందన్న భయాలు అమ్మకాలకు కారణమయ్యాయని అనలిస్టులు చెబుతున్నారు. అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ షేర్లు కూడా 6శాతం మేర పతనమై రూ.10,330 వద్ద ట్రేడయ్యాయి. అయితే కొత్త వ్యాపారంలోకి అడుగుపెడుతుండడంతో రిస్క్ ఉండొచ్చన్న అంచనాలు ఇన్వెస్టర్లలో భయాందోళనలకు కారణమయ్యాయి. ప్రస్తుతంసిమెంట్ రంగంలో అగ్రగామిగా ఉన్న అల్ట్రాటెక్ ప్రధాన వ్యాపారంపై తాజా నిర్ణయం ప్రభావం చూపుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.